ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-3-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 39 పేజీలు: 8+4 వెల: 6.50


డా. నమ్రత కుటుంబం రూ.50 కోట్ల ఆస్తులు జప్తు 3

జల్‌జీవన్ మిషన్ రెండేళ్లు పొడిగింపు 5




# చమురు మంటలు!

## భారత్‌పై గల్ఫ్ పరిణామాల ప్రభావం

### గ్యాస్ సంక్షోభ నివారణకు 'ఎస్మా ప్రయోగం'

### ఉత్పత్తి పెంచాలని చమురు సంస్థలకు కేంద్రం ఆదేశం

### హోటళ్లకు సిలిండర్ల సరఫరాలో బ్రేక్

### మంత్రి హర్దీప్‌సింగ్‌పూరితో ప్రధాని మోడీ చర్చలు

**న్యూఢిల్లీ, మార్చి 10:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో చమురు,గ్యాస్ నిల్వలకు భారత్‌లో కొరత ఎదురవుతోంది. ఇప్పటికే వాణిజ్యసిలిండర్ల సరఫరాకొరతతో హోటళ్లు పాక్షికంగా మూతపడుతున్నాయి. హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఆ ఎఫెక్ట్ భారత్‌పై కూడా పడింది. భారత్ నౌకలకు ఇబ్బందుల్లేవని ఇరాన్‌చెప్పినా దేశంలో చమురు, గ్యాస్‌లకు కృత్రిమ కొరత ఏర్పడిందన్నది వాస్తవం. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న వంటగ్యాస్ గృహావసరాల వినియోగదారులే 33 కోట్లమందికిపైగా ఉన్నారు. వీరందరికీ సకాలంలో అందచేసేందుకువీలుగా బుకింగ్‌సమయాన్ని ప్రస్తుతం ఉన్న 21 నుంచి 25 రోజులకు పెంచేసింది. అలాగే ప్రత్యామ్నాయంగా రష్యాతోపాటే ఇతర దేశాలనుంచి దిగుమతికి సన్నాహాలు చేయడంతోపాటు దేశీయ చమురు కంపెనీలను పదిశాతం ఉత్పత్తిని పెంచాలని ఆదేశించింది. ప్రస్తుతం చమురునిల్వలు 5.33 మిలియన్ టన్నులవరకూ ఉంది. ఈ రిజర్వులు 80శాతం అవసరాలకు సరిపోతాయన్నది అంచనా. ఇక ఎల్‌పిజి దిగుమతులు పశ్చిమాసియానుంచి నిలిచిపోవడంతో ఇతర ప్రత్యామ్నాయాలవైపు దృష్టిపెట్టింది. ఇపుడు >>2



### మూతపడుతున్న హోటళ్లు

#### బెంగళూరు, ముంబయి, ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్‌లో తీవ్ర ప్రభావం

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** అంతర్జాతీయ యుద్ధ పరిణామాల నేపథ్యంలో హోటల్ పరిశ్రమ తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకుంది. కమర్షియల్ గ్యాస్ >>2

# ఇరాన్‌ను తుడిచేస్తాం

## భూతల దాడులకూ సిద్ధమైన అమెరికా

### మొజ్తబాను హెచ్చరించిన ట్రంప్

### యుఎఇలో అతిపెద్ద చమురు కేంద్రంపై ఇరాన్ దాడి



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల దృశ్యం

**టెహ్రాన్ /జెరూసలెం, మార్చి 10:** ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికాలు చేస్తున్న దాడులు ఇపుడు క్షేత్రస్థాయికి చేరాయి. భూతల దాడులకు సిద్ధం అవుతున్నట్లు అమెరికా ఇప్పటికే ప్రకటించింది. వైమానిక దాడులతో టెహ్రాన్ వీధులన్నీ కూడా అగ్నిగుండంలా ఇప్పటికే మారిపోయాయి. మరోపక్క ఇజ్రాయెల్ కూడా తనవంతు దాడులు ఉధృతంచేస్తోంది. యుద్ధం పదోరోజు కువైట్, దుబాయిల్లోని భారీ చమురుశుద్ధి కేంద్రాలపై ఇరాన్ దాడులుచేయడంతో ఈ రెండుదేశాల్లోను ప్రస్తుతం చమురు ఉత్పత్తిని నిలిపివేసాయి. అంతేకాకుండా ఎగుమతులపైనా ఆంక్షలు విధించారు. బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ, యుఎఇ దేశాలే టార్గెట్‌గా ఇరాన్ దాడులు చేస్తోంది. మరోపక్క సైబర్ దాడులకు కూడా దిగుతోంది. అంతేకాకుండా శత్రుదేశాలపైకి స్లీపర్‌సెల్స్‌ను పంపించేందుకు కసరత్తులుషురూచేసింది. ఈ సమాచారం అమెరికా,ఇజ్రాయెల్‌లకు చేరడంతో వెంటనే అప్రమత్తం అయ్యాయి. ఇపుడు ఇరాన్ భూగర్భంలో నిక్షిప్తంచేసిన అణు సంపదపైనే అమెరికా, ఇజ్రాయెల్‌లు కన్నేసాయి. >>2



శంషాబాద్ విమానాశ్రయంలో మంగళవారం కొత్తగవర్నర్ శివప్రతాప్ శుక్లాకు స్వాగతం పలుకుతున్న సిఎం రేవంత్

# కొత్త గవర్నర్ నేడు ప్రమాణం

### శివప్రతాప్ శుక్లాకు ఘనస్వాగతం పలికిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి10:** తెలంగాణకు నూతన గవర్నర్‌గా నియమితులైన శివప్రతాప్ శుక్లా రాష్ట్రానికి విచ్చేసిన సందర్భంగా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో ముఖ్యమంత్రితో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, డిజిపి బి.శివధర్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా బుధవారం ఉ.11.30 గంటలకు రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ నూతన గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేత ప్రమాణ స్వీకారిం చేయిస్తారు. ఈ నియామకం రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. మార్చి 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో, తొలిరోజున ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శుక్లాకు రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన ఆయన, సీనియర్ పార్లమెంటేరియన్‌గా కూడా పేరు తెచ్చుకున్నారు.



ప్రి బడ్జెట్ భేటీలో డి.సిఎం భట్టి, మంత్రి పొంగులేటి

# గ్రామపంచాయతీలకు శాశ్వత భవనాలు

### అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కోర్సులు

### ప్రి బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి10:** రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో శాశ్వత భవనాలు లేని గ్రామపంచాయతీలు అన్నిటికి శాశ్వత భవనాలు నిర్మించాలని ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్ లతో కలిసి ఆయా శాఖల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ స్థలాలు అందుబాటులో ఉన్నచోట తాసిల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నారుల మెదడు బలంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టిక ఆహారంతో పాటు బోధనా పద్ధతులతో వారికి తర్ఫీదు ఇవ్వాలని >>2

# బర్డ్ ఫ్లూ కలకలం



### పలు జిల్లాల్లో వేలాది కోళ్లు మృత్యువాత

### సిద్దిపేట, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ అప్రమత్తం

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ అనుమానం కలకలాన్ని రెకెత్తిస్తోంది. పలు జిల్లాల్లో అంతుచిక్కని వ్యాధితో వేలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అయితే బర్డ్ ఫ్లూ కారణంగానే చనిపోతున్నట్లు పలువురు చెబుతున్నారు. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, సిద్దిపేట్, నల్లగొండ, నాగర్‌కర్నూల్, ఖమ్మం తదితర జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు కలకలం సృష్టిస్తూ కొన్ని కోళ్ల ఫారాల్లో కోళ్లు మృతి చెందుతుండటంతో పౌల్ట్రీ యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటి వరకు ఈ విషయాన్ని పశువైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదని తెలుస్తోంది. సిద్దిపేట్ జిల్లా మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో భారీ సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో బర్డ్ ఫ్లూ అనుమానంతో పౌల్ట్రీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పౌల్ట్రీలో సుమారు 7,700 కోళ్లు చనిపోయాయి, పశు సంవర్ధక శాఖ అధికారులు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిచారు. అధికారులు గ్రామంలో అప్రమత్తత ప్రకటించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో 10వేలకు పైగా కోళ్లు ఈ >>2



ఫోన్ ట్యాపింగ్ కేసు:

# ప్రభాకర్‌రావుకు 'సుప్రీం'లో ఊరట

### షరతులతో రెగ్యులర్ బెయిలు మంజూరు

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి నిందితుడుగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్ర భాకర్ రావుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనకుషరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్‌ను సుప్రీం ధర్మాసనం మంగళవారం మంజూరు చేసింది. ఇందుకోసం రూ.35 వేల పూచీకత్తుతో >>2

### ఆరు గ్యారెంటీలపై ప్రైవేటు

# బిల్లు పెడతాం

### సెలెక్ట్ కమిటీ లేదు, స్టాండింగ్ కమిటీ లేదు, పిటిషన్స్ కమిటీ లేదు, డిప్యూటీ స్పీకర్ కూడా లేరు

### మూసీ ప్రక్షాళనకు కాదు, రూ. లక్షల కోట్ల అవినీతికి వ్యతిరేకం

### బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఉమ్మడి ఓరియంటేషన్ సమావేశంలో కెటిఆర్



మంగళవారం ఓరియంటేషన్ సమావేశంలో కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి10:** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేస్తున్న తీరును ఎండగట్టేందుకు... ఆరు గ్యారెంటీలకు ఇచ్చిన మాట ప్రకారం చట్టబద్ధత కల్పించేందుకు ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భారత రాష్ట్ర సమితి తరపున ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అధికారంలోకి రాగానే తొలి క్యాబినెట్ సమావేశంలోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ... ఆ హామీని, ఆ మాటను మరిచిపోయిందని కేటీఆర్ అన్నారు. అందుకే ఆరు గ్యారెంటీల ద్వారా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ఈ బిల్లు ద్వారా ఎండగడతామన్నారు. 6 గ్యారంటీలలో పేర్కొన్న మహిళలు, వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు, రైతన్నలు వంటి తెలంగాణ సబ్బండ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసం నేపథ్యంలో.. ఆయావర్గాల తరఫున ఈ ప్రవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీతో సహా 6 గ్యారంటీలకు చట్టబద్ధత ఇస్తామని చెప్పిన కాంగ్రెస్‌పెద్దలు కాంగ్రెస్ పార్టీ మోసాన్ని కూడా ఈ బిల్లు ద్వారా శాసన సభలో ఎండగడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యులు కూడా ఈ బిల్లుకు మద్దతు ఇచ్చి తమ >>2


Sri Hari UTHAVNA Sri Hari



SHRI SUDHIR SANGHI
15th December 1950 - 8th March 2026
(THE SANGHI GROUP)
(S/o Late Shri Ramsharanji & Late Smt. Kamalaraniji Sanghi)

UTHAVNA - Today, 11th March 2026, 11 am to 12 noon
Venue : Hare Krishna Golden Temple (Vedic Samskara Bhavan), Road No. 12, Banjara Hills, Hyderabad.

BAITHAK - 12th March to 14th March 2026, 4 pm to 6 pm, at our Residence, 550C/A, Road No. 92, Jubilee Hills, Hyderabad.

Deeply Mourned by : Usha Sanghi (Wife) Siddarth-Juhi Sanghi (Son & Daughter-in-law)
Pooja-Prateek Poddar (Daughter & Son-in-law) Devansh, Ayaansh, Aareyaman, Kanav (Grandsons)
Shobha-Rameshji Jain, Jaishree-Shashiji Mittal (Sister & Brother-in-law)
Anjana Sanghi (W/o : Late Sri Anand Prakash Sanghi) (Sister-in-law)
Ravi-Anita Sanghi, Gireesh-Alka Sanghi (Brother & Sister-in-law)
Swati, Amit, Ekta, Aditya-Shruti, Alok-Priyanka, Aarti-Rahul Gupta, Gaurav-Ankita, Ashish-Ravisha
Forever remembered, deeply missed.

JSKADS



హోలీ వేడుకల తర్వాత జరిగే గంగా మేళా ఉత్సవాల సందర్భంగా మంగళవారం కాన్పూర్‌లో ప్రజలు ఒంటెలపై స్వారీ చేస్తున్న దృశ్యం

# చమురు మంటలు!

>> రష్యానుంచి చమురు కొంటున్న భారత్ సుమారు 40 దేశాలనుంచి కూడా కొనుగోలుచేస్తోంది. ప్రస్తుతం నాలుగువేలక ఓట్ల లీటర్ల ముడిచమురు నిల్వలున్నాయి. వీటినిశుద్ధిచేసి సిద్ధంచేస్తోంది. ఏడెనిమిది వారాలు సరఫరాకు సరిపోతుంది. ఎల్పీజీ ఉత్పత్తిని అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశాలు జారీచేసింది. పారిశ్రామిక అవసరాలకు తగ్గించింది. టీప్లాంటేషన్లు, ఉత్పత్తిరంగ యూనిట్లు ఇతర పారిశ్రామిక వినియోగదారులను మూడో కేటగిరిలో ఉంచింది. గడచిన వినియోగంలో కేవలం 80శాతం మాత్రమే వీరికి సరఫరా అవుతుంది. దేశీయ అవసరాలకు సరిపడా ఉత్పత్తిని పెంచుతోంది.

అయినా కూడా వాణిజ్య సిలిండర్ల కొరతతో భారత్‌లో ముంబయి, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో హోటల్‌పరిశ్రమ దెబ్బతిన్నది. శని, ఆదివారాలుమినహా ఇతర రోజుల్లోనే 20శాతం హోటళ్లు మూసివేయక తప్పదని ప్రకటించాయి. గ్యాస్‌సరఫరాకోసం అమెరికా, అల్జీరియా, నార్వే, కెనడా దేశాలతో భారత్ ఇప్పటికే సంప్రదింపులు జరిపింది. అడ్డంకులు లేకుండా ఉంటే షిప్పింగ్‌రూట్‌లో గ్యాస్ భారత్‌కు చేరుతుందని కేంద్రం అంచనావేసింది. అత్యవసర సర్వీసులైన విద్యాసంస్థలు, ఆసుపత్రులు, హోటళ్లు, రెస్టారెంట్లు పరిశ్రమలకు సరఫరాకోసం ముగ్గురు సభ్యుల కమిటీని నియమించింది. ఐఒసి, బిపిసి, హెచ్‌పిసిఎల్ కమిటి సభ్యులు సరఫరాను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించింది. ప్రస్తుతం వాణిజ్యసిలిండర్ల సరఫరా మెట్రోనగరాల్లో తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. గ్యాస్ డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్న ఆరోపణలతో కేంద్రం అప్రమత్తం అయింది.

**దేశీయ ఇంధన అవసరాలకు ఢోకా లేదు**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశీయంగా పెట్రోల్, డీజిల్ కొరత సమస్య తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధానంగా ఎల్‌పిజి సరఫరాపై దృష్టి పెట్టింది. గ్యాస్ సిలిండర్లు పక్కదారి పట్టకుండా బుకింగ్ నుంచి డెలివరీ వరకు నిబంధనలు కఠినతరం చేసింది. కొత్త ఎల్‌పిజి సిలిండర్ బుకింగ్‌ల కోసం వేచి ఉండే సమయాన్ని 21 రోజుల నుండి 25 రోజులకు పెంచింది. అంతేగాక, 'దేశీయ ఎల్‌పిజి సరఫరాలో దుర్వినియోగాన్ని నిరోధించడానికి, ఎల్‌పిజి సరైన దిశలో పంపిణీ జరిగేలా పరిస్థితిని పర్యవేక్షించడానికి నిత్యావసర వస్తువుల చట్టం(ఎస్మా) ప్రయోగించింది' అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే ఎల్‌పిజి ఉత్పత్తిని 10శాతం మేర పెంచాలని దేశీయ ఎల్‌పిజి ఉత్పత్తి సంస్థలను కేంద్రం ఆదేశించింది. "గృహ వినియోగం ఇప్పటికీ ప్రధానం" అని ఒక వర్గాలు తెలిపాయి. ఎల్‌పిజి కొరత గురించి సోషల్ మీడియాలో వ్యాపించే ధ్రువీకరించని సమాచారాన్ని నమ్మవద్దని కూడా ప్రభుత్వం ప్రజలను కోరింది. ఎల్‌పిజి లభ్యత గురించి ఆందోళనలను గుర్తు చేస్తూ కొన్ని సంఘాలు లేఖలు రాసినప్పటికీ, ప్రభుత్వం ఇప్పటికీ లేవనెత్తిన సమస్యలను గమనించి వాటిని పరిష్కరించ డానికి వెంటనే చర్య తీసుకుందని వర్గాలు తెలిపాయి.

**ప్రధాని మోడీ చర్చలు**

దేశాన్ని చమురు ధరల పెంపు భయం ప్రజల్ని బెంబేలెత్తిస్తున్న వేళ కేంద్రం అప్రమత్తమైంది. ఈ మేరకు కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితోపాటు, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌తో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. మంగళవారం వీరి భేటీ జరిగింది. ఇరాన్‌ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం, చమురు సంక్షోభం, ధరల నియంత్రణ, చమురు నిల్వలు, సరఫరా వంటి అంశాలపై వీరు చర్చించారు. ప్రధానంగా ఎల్పీజీ ధరల పెరుగుదలపై చర్చించినట్లు సమచారం. ఈ సందర్భంగా దేశంలో చమురు ధరల నియంత్రణపై, గృహ వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ఒక వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశాన్ని చమురు ధరల అంశం కలవరపెడుతోంది. ఇరాన్ యుద్ధం, గల్ఫ్ దేశాలపై దాడులు, హర్మూజ్ జలసంధి మూసివేత వంటి కారణాలతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరుగుతున్నాయి.

ఇండియాలో కూడా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ వంటి గ్యాస్ ధరలు భారీగా పెరుగుతాయనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఎల్పీజీ ధరలు స్వల్పంగా పెరిగాయి. వాణిజ్య సిలిండర్ల వినియోగంపై ఆంక్షలు మొదలయ్యాయి. డిమాండ్‌కు సరిపడా ఇరాన్ యుద్ధం ఇంకా కొనసాగితే ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

దీంతో ప్రజలపై ఆర్థిక భారం పెరిగే అవకాశం ఉంది. ఇండియా తన చమురు అవసరాల కోసం ఎక్కువగా విదేశీ దిగుతులపైనే ఆధారపడుతుంది.

# స్పీకర్ ఓంబిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ షురూ

## ప్రత్యేక సభాపతిగా ఎంపి జగదాంబికా పాల్

**న్యూఢిల్లీ, మార్చి 10:** లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా పై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చను మంగళవారం లోక్‌సభలోప్రారంభించారు. కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. అనంతరం తీర్మానంపై చర్చ మొదలైంది. ఇందుకోసం 10 గంటల సమయం కేటాయించారు. చర్చ తర్వాత తీర్మానంపై ఓటింగ్ నిర్వహించాలనినిర్ణయించారు. ఈ తీర్మానంపై చర్చ సందర్భంగా సభను నడిపేందుకు ప్రత్యేక సభా పతిని నియమించాలని విపక్షాలు కోరాయి. అందుకు అంగీకరించిన కేంద్రం సీనియర్ ఎంపీ, ఛైర్‌పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను స్పెషల్ స్పీకర్‌గా నియమించింది. ఆయన నేతృత్వంలో అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో చర్చ కొనసాగుతోంది. కాగా తనపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం ప్రక్రియమొత్తం ముగిసేంతవరకూ తాను స్పీకర్‌గా హాజరుకాలేనని కోటా ఎంపి ఓంబిర్లా ఇప్పటికే స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికీ డిప్యూటీ స్పీకర్ లేక పోవడంతో ఇపుడు ప్రత్యేక సభాపతిని ఏర్పాటుచేయాల్సి వచ్చింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బిజెపి ఎంపి నిషికాంత్ దూబెపై చర్యలు చేపట్టకపోవడం లాంటి కారణాలతో విపక్షాలు ఈఅవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చాయి. ఇందుకోసం 118మంది ఎంపీల సంతకాలు సేకరించి నట్లు తెలుస్తోంది. చర్చ అనంతరం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ తీర్మానం ఆమోదం పొందాలంటే సాధారణ మెజా రిటీ అయిన 272 ఓట్లు కావాలి. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీ నేతృ త్వంలోని ఎన్డీఏకు 293 ఓట్ల సంఖ్యాబలం ఉంది. ప్రతిపక్షాలకు 238 మంది ఎంపీలు ఉన్నారు. దాంతో విపక్షాలు తీర్మానం నెగ్గే అవకాశాలు దాదాపు కనిపించడంలేదు.

# శాశ్వత భవనాలు

>> సూచించారు. పట్టణాల్లో రహదారుల పైన కొంతమంది చంటి బిడ్డలను పెట్టుకొని యాచక వృత్తి కొనసాగిస్తున్నారు వారందరినీ శిశు విహార్‌లో తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్లపై చంటి బిడ్డలు పట్టపగలు ఎండకు, వర్షాకాలంలో వానకు తడిసి వారి విలువైన బాల్యం మసకబారి పోతుందని ఆ విధంగా జరగడానికి అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం తెలిపారు. శిశు విహార్‌లో మోడ్రన్ కిచెన్ నిర్మించాలని సూచించారు. ఉపాధి కల్పించే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు రూపొందించాలని, గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఎంఓయు కుదుర్చుకున్న కంపెనీలను సంప్రదించి అందుకు అనుగుణంగా ఏటిసి సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. క్యూర్, ప్యూర్ రేర్ పాలసీకి అనుగుణంగా వచ్చే పరిశ్రమలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలి, స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేసుకోవాలని సమంత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులకు సూచించారు. కవ్వాల్, శ్రీశైలం వంటి టైగర్ జోన్లు అభివృద్ధి చేసుకోవాలని పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో, టెంపుల్ టూరిజం ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు యువతను చైతన్యం చేయాలని, డ్రగ్స్ వినియోగం ద్వారా జరిగే నష్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపించే విధంగా గ్రామస్థాయిలో కళారూపాలు ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీసీఎల్ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అనిత రామచంద్రన్, దివ్య దేవరాజ్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, గృహ నిర్మాణ శాఖ సెక్రటరీ గౌతం, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బర్డ్ ఫ్లూ కలకలం

>> రెండు రోజుల్లోనే మృత్యువాతపడినట్లు తెలియవచ్చింది.. దీంతో జిల్లాకూ ఈ వైరస్ సోకిందని, అందుకే గుర్రంపోడు గ్రామంలో కోళ్లు మృతిచెందాయని పలువురు భావిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దు ఏపీ రాష్ట్రంలోని జిల్లాలో కూడా ఈ ప్రభావం ఉన్నట్లు సమాచారం. ఆంధ్రనరపదేశ్ లోని పలు జిల్లాల్లో పెద్ద మొత్తంలో బర్డ్‌ఫ్లూతో కోళ్లు చనిపోవడంతో అక్కడి అధికారులు విషయాన్ని ప్రకటించకుండా వాటిని గుంతలు తీసి పూడ్చిపెడుతున్నారని తెలుస్తోంది. కాగా మహబూబ్‌నగర్ ల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రమేష్ స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకలేదని, ఏ గ్రామం నుంచి కూడా బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకి కోళ్లు చనిపోయినట్లు ఫిర్యాదు రాలేదన్నారు. జిల్లాల్లో అన్ని ప్రాంతాల్లోనూ కోళ్లు ఆరోగ్యంగా ఉన్నాయని, ఎక్కడైనా కోళ్లు చనిపోయినట్లు సమాచారం ఉంటే శాంపిళ్లను సేకరించేందుకు వెళతామని పేర్కొన్నారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లిలో బాయిలర్ కోళ్లు వేలసంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. రెండు ఫౌల్ట్రీ ఫామ్స్‌లో అంతుచిక్కని వైరస్‌తో పెద్దఎత్తున చనిపోతున్నాయి. గత మూడ్రోజులుగా వేల సంఖ్యలో కోళ్లు మరణించాయని వాపోతున్నారు. ఇప్పటివరకు 10 వేల కోళ్లు మృత్యువాత పడినట్లు పేర్కొంటున్నారు. అయితే ఎందుకు చనిపోతున్నాయో తెలియడం లేదంటున్నారు. రోజురోజుకీ ఈ సంఖ్య పెరుగుతోందని, దీని గురించి అధికారులు చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు. అంతుచిక్కని వైరస్‌తో తెలంగాణ వ్యాప్తంగా లక్షల కోళ్లు చనిపోయినట్టు ఫౌల్ట్రీ యజమానులు అంటున్నారు. కోళ్ల శాంపిల్స్‌ను తీసి ల్యాబ్స్‌కి పంపించారు.

## పెరిగిన ఎండల తీవ్రత

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఎండల తీవ్రత పెరిగింది. వేసవి కాలంలో సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు నమోదవుతాయి. కానీ మార్చి తొలి వారంలోనే ఆ తరహాలో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి భానుడు భగభగా మండుతున్నాడు. ఈ నేపధ్యంలో భారత వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. దేశంలోని 12 రాష్ట్రాలకు హీట్‌వేవ్ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రధానంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. దీంతో ప్రజలు ఎండ వేడిమికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇక వేసవి ఎలా ఉంటుందా అని భయపడుతున్నారు.

## 'వడదెబ్బ సాయం.. రూ.50 వేల నుండి రూ.4 లక్షలకు పెంపు'

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** వడదెబ్బ తాకి చనిపోతున్న వారి విషయంలో రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎండాకాలంలో వడదెబ్బ తాకి ప్రాణాలు విడిచిన వారి కుటుంబాలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

ఇప్పటివరకు వడదెబ్బతో చనిపోయిన వారి కుటుంబాలకు అధికారులు రూ.50 వేల ఎక్స్‌గ్రేషియాను ఇచ్చేవారు. ఇప్పుడు దాన్ని రూ. 4 లక్షలకు పెంచుతూ తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ చట్టం (ఎస్‌డీఎంఏ) ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు.

## వారం - వర్జ్యం

11-03-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
అష్టమి తె.4.19
జ్యేష్ఠ రా.9.59
వర్జ్యం : ఉ.5.21-7.06
దు.ఉ.11.55-12.43
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ఇ-మెయిల్స్ ద్వారా లేక ఫోన్ సంభాషణల ద్వారా మీకు ఉపకరించే సమాచారం అందుకుంటారు.

**వృషభం:** రాజకీయ పలుకుబడి, ప్రజా సంబంధాలు లాభిస్తాయి. శుభకార్యాలు నిర్వహించడానికి అదృష్టం తోడవుతుంది.

**మిథునం:** పక్షపాతధోరణితో వ్యవహరించారన్న నిందలు ప్రచారంలో ఉంటాయి. ఋణయత్నం ఫలిస్తుంది. వాహనసౌఖ్యం.

**కర్కాటకం :** కార్యాలయాలలో మీ పనితీరును మరింతగా మెరుగుపర్చు కోగలుగుతారు. వ్యాపారస్థులకు అనుకూలం. ధనలాభం.

**సింహం:** కొత్త, వింత ఆలోచనలతో మీ మనస్సు వత్తిడికి లోనవుతుంది. విదేశీయాన ప్రయత్నాలు కలిసివస్తాయి.

**కన్య :** వైద్యున్ని మార్పుచేయడం వలన లాభపడగలుగుతాయని భావిస్తారు. ఆధ్యాత్మిక భావాలు కలిగిఉంటారు.

**తుల :** సుపరిచితులు కొందరు మీ సహాయాన్ని అర్థిస్తారు. ఆర్థికంగా లాభనష్టాలు రెండూ సరిసమానంగా ఉంటాయి.

**వృశ్చికం:** డాక్యుమెంట్స్, లిఖిత పూర్వక వ్యవహారాలవలన లాభపడతారు. నూతన వైద్య విధానాలను అవలంభిస్తారు.

**ధనుస్సు:** ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడానికి గాను ప్రయత్నాలను సాగిస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు.

**మకరం:** వ్యాపారాభివృద్ధిలో చురుకుదనాన్ని తీసుకురావడానికిగాను చేసే ప్రయత్నాలు సానుకూలపడతాయి. వాహనసౌఖ్యం.

**కుంభం:** ఇష్టం లేని వ్యక్తులతో కలిసి పనిచేయవలసి వస్తుంది. ఆశయ సాధనకోసం అహోరాత్రులు శ్రమిస్తారు.


**మీనం :** సున్నితమైన అంశములతోటి వివాదాస్పదమైన వ్యక్తులతోటి ముడిపడి ఉంటాయి. ఆహారనియమాలను పాటిస్తారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రైవేటు బిల్లు పెడతాం

>> చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల ఉమ్మడి ఓరియంటేషన్ సమావేశం ముగిసిన అనంతరం పార్టీ సీనియర్ నేతలతో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఈసారి కాంగ్రెస్ పెడుతున్న బడ్జెట్.. మూడవ బడ్జెట్. ఈసారి బడ్జెట్ సమావేశాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇప్పటికే సగం ప్రభుత్వ పదవీ కాలం అయిపోయింది. హామీల అమలులో ప్రజలు ఇచ్చిన వ్యవధి అయిపోయింది. వారి హామీల అమలు వైఫల్యాన్ని మోసాన్ని ఎండగట్టేందుకు ఈ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం పైన సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాల పైన ఈ అసెంబ్లీ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం పైన చర్చించాం. మా పార్టీ సీనియర్ నేతలు మధుసూదనాచారి, బండ ప్రకాష్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రా రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా అసెంబ్లీలో ఏ కమిటీలను వేయడం లేదు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీని మా పార్టీ నుంచి ద్రోహం చేసి పోయిన వ్యక్తికి ఇచ్చారు. ఒక్క సెలెక్ట్ కమిటీ లేదు, స్టాండింగ్ కమిటీ లేదు, పిటిషన్స్ కమిటీ లేదు. ఇలా డెప్యూటీ స్పీకర్ కూడా శాసనసభలో లేరు. కేవలం అనివార్యంగా శాసనసభ సమావేశాలను నడిపించాల్సి వస్తుంది కాబట్టి ప్రభుత్వం బలవంతంగా నడిపిస్తున్నదన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ బుల్డోజర్లను పంపి ఇళ్లను కూలగొడుతున్న తీరుగానే శాసనసభలోనూ మంద బలంతో బుల్డోజర్ టాక్టిక్స్‌ని ప్రయోగిస్తున్నదన్నారు.

శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో అబద్ధాలను, అసత్యాలను పచ్చిగా మాట్లాడుతూ అంకెలను తారుమారు చేస్తూ శాసనసభ సమావేశాలను తూతూమంత్రంగా నిర్వహిస్తున్నదన్నారు. ఆరు గ్యారెంటీలకు మొదటి క్యాబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకొని చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ రెండున్నర సంవత్సరాల తర్వాత కూడా చట్టబద్ధత పక్కన పెట్టి కనీసం అమలు కూడా చేయడం లేదు. అందుకే ఈ సమావేశాల్లో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును మా పార్టీ తరపున తీసుకురావడానికి ప్రయత్నం చేస్తాం. మేము పెట్టే ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుకి మద్దతు ఇవ్వాలని మేము కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాహుల్ గాంధీకి వెయ్యి కోట్లు ఇస్తామని చెప్తున్న రేవంత్ రెడ్డి రైతన్నలకు ఇవ్వాల్సిన రైతు బంధును మాత్రం పక్కన పెట్టాడు. ఖమ్మంలో ప్రభుత్వ దాష్టీకం వల్ల ఇళ్లు కోల్పోయిన ఖమ్మం వెలుగుమట్ల తరపున, మూసీ బాధితుల తరపున, పేద దళిత గిరిజన ప్రజల కోసం ఈ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు, 420 హామీల అమలుకు డబ్బులు లేవని చెప్తున్నది. రైతన్నలకు, మహిళలకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలకు డబ్బులు లేవని చెప్తున్నది. కానీ వీటన్నింటినీ పక్కన పెట్టి మూసీ పేరుతో అవినీతి కార్యక్రమానికి తెరలేపింది. అందుకే దాన్ని వ్యతిరేకిస్తున్నాం. మేము మూసీ సుందరీకరణకు వ్యతిరేకం కాదు. కానీ ఒకవైపు డబ్బులు లేవు, అప్పులయ్యాయని చెబుతూనే మూసీలో రూ.లక్షన్నర కోట్ల అవినీతితో లక్షలాది మంది ఇళ్లను కూలగొట్టడాన్ని మాత్రమే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన చేయడం లేదు, కేవలం ఢిల్లీకి డబ్బులు పంపించడం కోసమే మూసీ ప్రాజెక్టును చేపడుతున్నాడని ఆరోపించారు.



హర్యానాలోని సోనిపట్‌లో మంగళవారం రైతు సంజయ్ మాలిక్ కుమార్తె వివాహానికి హాజరైన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

# మూతపడుతున్న హోటళ్లు

>> సరఫరా నిలిచిపోవడంతో, రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లను మూసివేసి నిరసన తెలపాలని తెలంగాణ హోటళ్ల అసోసియేషన్ యోచిస్తోంది. ఈ సమస్యపై చర్చించేందుకు హైదరాబాద్‌లో అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం అత్యవసరంగా సమావేశమయ్యారు. ఇరాన్-ఇజ్రాయెల్, యూఎస్ యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత ఏర్పడిందని, అది హోటళ్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని అసోసియేషన్ వెల్లడించింది. కమర్షియల్ ఎల్‌పిజి గ్యాస్ సరఫరాలో తీవ్ర అంతరాయం నెలకొనడంతో వినియోగదారుల మాట అటుంచితే కనీసం పనిచేసే సిబ్బందికి సైతం వంట చేసి పెట్టే పరిస్థితి కూడా లేదని హోటళ్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ హోటళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. హోటల్ పరిశ్రమకు గ్యాస్ అనేది ప్రాణవాయువు వంటిదని స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్యాస్ నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని, హోటళ్లలో పని చేసే సిబ్బందికి కూడా వంట చేసి పెట్టేంత గ్యాస్ నిల్వలు లేని దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హోటళ్లను శాశ్వతంగా మూసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. సమస్యను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, తదుపరి ఏ విధమైన ఆందోళనలు చేపట్టాలనే దానిపై అసోసియేషన్ ఒక స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేస్తోందన్నారు. అయితే హోటళ్ల బంద్‌పై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

**బెంగళూరు, ముంబయి, చెన్నై, ఢిల్లీ, విశాఖలో తీవ్ర ఇబ్బందులు...**

యుద్ధం నేపథ్యంలో దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ దేశంలోని పలు ప్రధాన నగరాల్లో కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు పెద్దఎత్తున కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై ఆధారపడటంతో గ్యాస్ కొరత ప్రభావం హోటల్ వ్యాపార రంగంపై స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే దేశ ఐటి రాజధాని బెంగళూరు, ఆర్థికరాజధాని ముంబైలోని లోని హోటళ్లు తీవ్ర ఎల్‌పిజి సిలిండర్ల కొరతను ఎదుర్కొంటున్నాయి. ప్రతిష్టాత్మక త్రీస్టార్ హోటళ్లు వంట కోసం సాంప్రదాయ కలపను ఆశ్రయిస్తున్నాయి. బెంగళూరులోని వేలాది హోటళ్లకు ప్రతిరోజూ అయిదు నుండి పది వాణిజ్య సిలిండర్లు అవసరం. అయితే, సరఫరా లేకపోవడం తో చాలా హోటళ్లు ఇప్పటికే నిల్వ చేసిన సిలిండర్లను ఉపయోగిస్తున్నాయి. సమీప భవిష్యత్తులో సిలిండర్లు అందుబాటులో లేకపోతే తమ హోటళ్లను మూసివేయాల్సి రావచ్చని బెంగళూరు హోటళ్ల యజమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అటు మహారాష్ట్ర రాజధాని ముంబాయిలోనూ ఎల్‌పిజి సిలిండర్ల సరఫరా సమస్య తీవ్రంగా మారింది. అక్కడ కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్లు సరిపడా అందుబాటులో లేకపోవడంతో సుమారు 20 శాతం హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడినట్లు హోటల్ అసోసియేషన్ వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా కొన్ని రెస్టారెంట్లు గ్యాస్ కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం.

# 'సుప్రీం'లో ఊరట

>> పాటు ఇద్దరు వ్యక్తుల ష్యూరిటీలను సమర్పించాలని ఆదేశించింది. ఇదే సమయంలో పాస్ పోర్టును పోలీసులకు అప్పగించాలని, ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లవద్దని, పోలీసుల విచారణకు సహకరించాలని, సాక్షులను, ఆధారాలను ప్రభావితం చేయవద్దని సుప్రీం కోర్టు ఆదేశించింది. 2024 మార్చి నెలలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ కేసు రాష్ట్రంలో రాజకీయం గా దుమారం రేపగా పోలీసు శాఖలో ప్రకంపనలు సృష్టించడం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఎస్ఐబిలో పనిచేసిన ప్రణీత్ రావు, భుజంగరా వు, తిరుపతన్నతో పాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావులు అరెస్టయి సుదీర్ఘ కాలం జైల్లో వుండడం విదితమే. అప్పట్లో ఎస్ఐబికి నా యకత్వం వహించిన ప్రభాకర్ రావు ఈ గోల్‌మాల్‌కు సూత్రధారిగా కేసును విచారించిన సిట్ తేల్చింది. ఆయనతో పాటు మీడియా అధినేత శ్రవణ్ రావును నిందితుడుగా నిర్ధారించింది.

కాగా ఈ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఇటీవలే ప్రభాకర్ రావు ను జూబ్లీహిల్స్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించారు. ప్రభాకర్ రావుకు అరెస్టు నుంచి వున్న మినహాయింపును రద్దు చేయాలని ఓవైపు పో లీసులు కోరగా మరోవైపు తనకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని ఆయన నేరుగా పిటిషన్ దాఖలు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీం కోర్టు ప్ర భాకర్ రావుకు షరతులతో కూడిన రెడగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది.

# 'కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు'

**హైదరాబాద్, మార్చి 10 ప్రభాతవార్త:** గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కుంభమేళా తరహాలోనే నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని గోదావరి పుష్కరాలు 2027 కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. తెలంగాణ బ్రాండ్ మారుమోగేలా మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కమిటీ తొలి సమావేశంలో సభ్యులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కర నిర్వహణ తేదీలు, సంబంధిత శాఖల సన్నద్ధత, భవిష్యత్తు కార్యాచరణను సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలు, సమ్మక్క సారక్క జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించిందన్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు, 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలను నిర్వహించాలని వేద పండితులు నిర్ణయించారన్నారు.

# ఇరాన్‌ను తుడిచేస్తాం

>> ఇరాన్‌లో మిగిలి ఉన్న ఉరేనియం నిల్వలన్నింటినీ స్వాధీనంచేసుకునేందుకు భూతల దాడులకోసం ఆర్మీని రెడీచేస్తున్నారు. అదేవిధంగా అమెరికాను విభేదిస్తున్నా దేశాల్లోని యుఎస్ దౌత్యకార్యాలయాలవద్ద బాంబుపేలుళ్లు చోటుచేసుకుంటున్నాయి. టొరంటోలోని యుఎస్ కార్యాలయం వద్ద పేలుడు జరిగితే ముందురోజు ఓస్లోలోని యుఎస్ కాన్సులేట్‌వద్ద పేలుడు సంభవించింది. ఇదిలా ఉంటే యుఎఇలోని అతిపెద్ద రువైస్ ఆయిల్ రిఫైనరీపై ఇరాన్‌డ్రోన్లసాయంతో దాడులుచేసింది. ఇదిలా ఉంటే యుద్ధవ్యయం రెండురోజులకే ఐదు లక్షలకోట్లు దాటడంతో ఇక ఆయుధ సంపద పూర్తిగా క్షీణిస్తుందని అందువల్ల యుద్ధ విరమణ మంచిదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే ట్రంప్ వార్‌ను ముగింపు దశకు చేరిందని, తామేముగిస్తామని ప్రకటించడంతో ఇరాన్‌కూడా ధీటుగా బదులిచ్చింది. ఆయనెవరు ముగించేందుకు మేమే ఆపనిచేస్తామని ఇరాన్ రక్షణ మంత్రిత్వశాఖ స్పందించింది. మొత్తంగాచూస్తే ఇరాన్ చౌకబారు డ్రోన్లను కూల్చేందుకు కూడా ఖరీదైన క్షిపణులను వినియోగించాల్సిరావడంతో ఆయుధ సంపద కరిగిపోవడంతోపాటు రాజకీయంగా ట్రంప్‌పై నిరసన పెరుగుతున్నందున ఎన్నికల నష్టం ఛాన్స్ ఉందని యుద్ధం వెంటనే విరమించాలని సలహాదారులు పట్టుబడుతున్నారు. అయితేట్రంప్ మాత్రంయుద్ధం కొనసాగింపుపైనే ఉన్నారు. ఇదిలా ఉంటే సుప్రీం లీడర్‌గా దివంగతఖమైనీ కుమారుడు మొజ్తబా ఖమైనీ నియామంకపై ట్రంప్‌ఫైర్ అయ్యారు. ఆయన నియామకాన్ని అంగీకరించబోమని తమ ప్రమేయంలేకుండా నియామకం జరగకూడదని చెపుతూనే ప్రస్తుత సుప్రీం కమాండర్ ఎవరైనా సరే మానుంచి కఠిన కార్యాచరణ ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. అలాగే హార్మోజ్ జలసంధిని కూడా స్వాధీనంచేసుకుంటామని, అవసరమైతే సైనిక చర్యతో రవాణాను పునరుద్ధరిస్తామని ట్రంప్‌ప్రకటించడం ఇరాన్‌కు మరింత ఆగ్రహం కలిగించింది. రోజుకోసారి తమపై విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడికి ఇరాన్‌కూడా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది.

# పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## సంస్థ బస్సులను నిరుపయోగంగా ఉంచరాదు

## స్పెషల్ ప్యాకేజీలు, ప్రత్యామ్నాయ రూట్ల ద్వారా ఆదాయాన్ని పెంచాలి

## రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

## పర్యాటక కేంద్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి

### పర్యాటక శాఖ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి10:** తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశంలోనే మేటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్ లోని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) కార్యాలయంలో సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, పర్యాటక ఆస్తుల వినియోగం, ప్రచార్యం, ప్రచారం, ఆదాయ మార్గాలు, హరిత హోటళ్ల నిర్వహణ, పెండింగ్ పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రధాన పర్యాటక ప్రాంతాలలో సూచిక బోర్డులు, ఫుడ్ కోర్టులు, టూరిజం సమాచార కేంద్రాలు వంటి ప్రాథమిక సౌకర్యాల స్థితిగతులపై మంత్రి సమీక్షించారు. బోటింగ్ సౌకర్యాలు, కాటేజీలు, వ్యూ పాయింట్లు, హరితహోటళ్ల నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, పర్యాటకుల సంఖ్య పెరిగేలా, వారికి మరింత సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రపంచ పర్యాటక ముఖ చిత్రంలో తెలంగాణ కీలక స్థానంలో ఉండాలనే సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా పర్యాటక రంగ అభివృద్ధి, బ్రాండింగ్, ప్రమోషన్, ప్రచారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి తెలంగాణను అంతర్జాతీయమైన టూరిజం గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని చెప్పారు. పర్యాటక ప్రచారంపై ఆయా రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాలను అధ్యయనం చేసి వాటికి ధీటుగా మన పర్యాటక ప్రాంతాలకు ప్రచారం కల్పించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ పర్యాటక ప్రదేశాలకు పర్యాటకులు సులభంగా చేరుకునేలా సూచిక బోర్డులను (డైరెక్షన్ సైనేజ్) ఏర్పాటు చేయాలని, సాధ్యమైనంత త్వరగా వీటిని పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతో పాటు, కళాకారులను ప్రోత్సహించేందుకు పర్యాటక కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. మన కళలు, మన భాష, మన సంస్కృతి మన అస్తిత్వానికి ప్రతీకలు. వాటిని పరిరక్షించుకుంటూ భావితరాలకు అందించేందుకు కృషి చేయాలి. కళాకారులకు తగిన గుర్తింపు, ఆర్థిక చేయూత అందించే దిశగా చర్యలు ఉండాలి. ప్రసిద్ధ ప్రదేశాల్లో హాంపి థియేటర్లు నిర్మించాలని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆయా రూట్లలో నడుస్తున్న బస్సుల వివరాలను, ఆదాయాన్ని మంత్రి ఆరా తీశారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం పర్యాటక ప్యాకేజీలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రద్దు చేయడంతో గణనీయంగా ఆదాయం తగ్గిందని మంత్రికి అధికారులు సర్ది చెప్పే ప్రయత్నం చెప్పగా మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి బస్సులను కొనుగోలు చేశామని, వాటిని నిరుపయోగంగా ఉంచడం వల్ల ఆదాయ కోల్పోవాల్సి వస్తుందని, స్పెషల్ ప్యాకేజీలు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి, ఆదాయాన్ని పెంపొందించాలని సూచించారు. పనులను మరింత వేగవంతం చేయాలని అన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకాన్ని ప్రధానికి అందచేస్తున్న బండారు దత్తాత్రేయ

## ప్రధాని మోడీని మర్యాదపూర్వకంగా కలిసిన బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్ (ముషీరాబాద్), మార్చి 10, ప్రభాతవార్త:** ప్రధాని మోదీని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో మోదీని కలిసిన దత్తాత్రేయ, తనకు కేంద్ర క్యాబినేట్‌లో కార్మికశాఖ మంత్రిగా, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా, హర్యానా గవర్నర్‌గా అవకాశం ఇచ్చిన ప్రధాని మోదీకి ఆయన ధన్యవాదములు తెలియచేశారు. హర్యానా గవర్నర్‌గా పదవీ విరమణ చేసిన అనంతరం మొట్టమొదటిసారి మోదీని కలిసిన సందర్భంగా, మోదీని శాలువాతో సత్కరించి, తాను రచించిన ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకాన్ని మోదీకి అందచేశారు. ఈ సందర్భంగా ప్రధాని, దత్తాత్రేయ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అన్ని కార్యక్రమాలకు ఉత్సాహంగా హాజరవుతున్న దత్తాత్రేయను ప్రధాని అభినందించి, ఇదే ఉత్సాహంతో ప్రజా జీవితంలో కొనసాగాలని ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి బీరేన్‌సింగ్ కన్నుమూత

**గువాహతి, మార్చి 10:** కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి బిరేన్ సింగ్ ఎంగ్టి (81) కన్నుమూశారు. అసోం రాజధాని గువహటిలో మంగళవారం ఉదయం స్థానిక ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారని కాంగ్రెస్ ప్రతినిధి వెల్లడించారు. గతంలో తను ప్రాతినిధ్యం వహించిన పార్లమెంట్ నియోజకవర్గమైన దిఫులోని ఆయన నివాసంలో ఇటీవల బిరేన్ సింగ్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు గుహవటి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బిరేన్ సింగ్ కన్నుమూశారు. ఆయన భౌతిక కాయాన్ని సొంత నియోజకవర్గానికి తరలించారు. దాదాపు ఐదు దశాబ్దాలకుపైగా రాజకీయ అనుభవం ఉన్న ఆయన అసోంలోని, కర్బి ఆంగ్లాంగ్ జిల్లా, దిఫు పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. 1971, 1977, 1984లో ఎంపీగా గెలిచారు, ఆ తర్వాత 2004 నుంచి వరుసగా మూడుసార్లు అంటే 2004, 2009, 2014లో ఎంపీగా గెలిచారు. రాజీవ్ గాంధీ హయాంలో కేంద్ర మంత్రిగానూ పని చేశారు. కర్బి ఆంగ్లాంగ్ అటానమస్ కౌన్సిల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గానూ సేవలందించారు. బిరేన్ సింగ్ మృతిపై అసోం సీఎం హిమంత బిశ్వశర్మ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. దీర్ఘకాలికంగా బిరేన్ సింగ్ దిఫు ప్రాంతంలో అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కాంగ్రెస్ అగ్రనేతలు కూడా బిరేన్ సింగ్ మృతిపై సంతాపం తెలిపారు. ఆయన మరణం అసోం రాజకీయాలకు, ఈ ప్రాంతానికి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ గౌరవ్ గొగోయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన చిన్నతనం అంతా బిరేన్ సింగ్ కుటుంబంతోనే గడిచిందని గుర్తు చేసుకున్నారు.



## డాక్టర్ నమ్రత కుటుంబం రూ. 50 కోట్ల ఆస్తులు జప్తు

### సృష్టి ఆస్పత్రి సరోగసి స్కాం కేసు

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన సృష్టి సరోగసి స్కాం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారణ వేగాన్ని మరింత పెంచింది. చైల్డ్ ట్రాఫికింగ్ కేసులో నిందితులుగా వున్న సృష్టి ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతతో పాటు ఆమె కుటుంబీకులు, ఆసుపత్రి నిర్వాహకులను ఏడాదిన్నర క్రితం హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. పదుల సంఖ్యలో శిశువులను అక్రమంగా కొనుగోలు చేసి ఈ శిశువులు పిల్లలు పుట్టని వారు సరోగసి కోసం వచ్చిన సమయంలో అంటగట్టి లక్షలాది రూపాయలను డాక్టర్ నమ్రత బృందం దండుకున్నట్లు వెలుగు చూడడం విదితమే. ఈ క్రమంలో దేశ వ్యాప్తంగా వున్న అనేక చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలతో డాక్టర్ నమ్రత కు సంబంధాలున్నట్లు వెలుగు చూడగా దీనిపై వెంటనే రంగంలో దిగిన ఈడీ అధికారులు మనీలాండరింగ్ కోణంలో విచారణ చేబట్టారు. ఈ కేసు లో హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన డాక్టర్ నమ్రత బృందాన్ని ఈడీ అధికారులు మరోసారి అరెస్టు చేసి విచారణ చేబట్టి అక్రమాలను రట్టు చేశారు. ఈ క్రమంలో మంగళవారం నాడు డాక్టర్ నమ్రతో పాటు ఆమె కుటుంబీకులకు చెందిన 50 కోట్ల రూపాయల ఆస్తులను ఈడీ అధికారులు జప్తు చేశారు. జప్తు అయిన ఆస్తుల్లో ఆసుపత్రితో పాటు స్థిరచరాస్తులు వున్నాయి. 2014 నుంచి సృష్టి ఆసుపత్రిలో సరోగసి స్కాం కొనసాగుతుందని ఈడీ విచారణలో తేలింది.

## వైఎస్ వివేకా హత్య కేసులో కీలక పరిణామం.. నిందితులకు కేసు ఫైల్స్ అందజేత

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన అన్ని ఫైల్స్‌తో పాటు వివరాలను సిబిఐ ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు సిబిఐ అధికారులు నిందితులందరికి మంగళవారం అందజేశారు. ఈ కేసులో నిందితులుగా వున్న వారు సిట్ నివేదికను తమకు అందజేయాలని సిబిఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. సి బిఐ కంటే ముందు ఈ కేసును విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదికను కూడా తమకు ఇవ్వాలని వారు కోరడం విదితమే. దీంతో పాటు కోర్టుకు సిబిఐ అందించిన 13 లక్షల ఫైళ్లలో చాలా వరకు తెరుచుకోవడం లేదని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. అయితే నిందితుల తరపు వాదనలను సిబిఐ తోసిపుచ్చింది. కోర్టు అనుమతి ఇస్తే అన్ని వివరాలు నిందితులకు అందజేస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగిన విచారణలో కోర్టు ఆదేశాల మేరకు సిబిఐ అధికారులు కీలక నిర్ణయం తీసుకుని వివేకా హత్య కేసులో 13 లక్షల ఫైల్స్‌ను ఇండెక్స్ రూపంలో నిందితులకు అందజేశారు. ఫైల్స్ తెరుచుకునే క్రమంలో ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తకుండా చూస్తామని సిబిఐ అధికారులు ఈ సందర్భంగా కోర్టుకు తెలిపారు. దీంతో పాటు ఈ కేసులో నిందితులుగా వున్న కిరణ్ యాదవ్, అర్జున్ రెడ్డి విచారణ నివేదికను సైతం కోర్టుకు సిబిఐ అధికారులు సమర్పించారు. దీనిపై తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా పడింది.

## 13న కిసాన్ సమ్మాన్ నిధులు

### రైతుల ఖాతాలో జమ కానున్న పంట పెట్టుబడి సాయం

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి తాలూకు 22వ విడత నిధులను ఈ నెల 13న రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధమవుతోంది. దేశ వ్యాప్తంగా రూ.9.32 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2000 వేల చొప్పున జమ కానున్నాయి. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో పీఎం కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ప్రతి ఏటా మూడు దఫాలుగా రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ ఏడాది మొత్తం రూ.19వేల కోట్ల నిధులు విడుదల చేయనున్నారు. గత ఏడాది నవంబర్ 19వ తేదీన 21వ విడత పీఎంకిసాన్ నిధులు విడుదల చేశారు. ఈ పథకం ద్వారా దేశంలో పదకొండు కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

## ఎన్‌సిఇఆర్‌టి బహిరంగ క్షమాపణలు

**న్యూఢిల్లీ, మార్చి 10:** 8వ తరగతి పాఠ్యపుస్తకంలో న్యాయపరమైన అవినీతిపై ఒక అధ్యాయాన్ని ప్రచురించినందుకు జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) బహిరంగ క్షమాపణలు ప్రకటించింది. "ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్, సభ్యులు ఇందుమూలంగా చెప్పిన అధ్యాయం 4 కోసం బేషరతు క్షమాపణలు చెబుతున్నారు. మొత్తం పుస్తకం ఉపసంహరించబడింది. అందుబాటులో లేదు" అంటూ పత్రికల్లో ప్రకటన ప్రచురించింది. ఈ అధ్యాయానికి సంబంధించి సుప్రీంకోర్టు సుమోటో కేసులో విచారణకు ఒక రోజు ముందే బహిరంగ క్షమాపణలు కోరడం గమనార్హం. ఎన్‌సిఇఆర్‌టి తప్పిదంపై ఫిబ్రవరి 26న ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్, పాఠశాల విద్యా శాఖ కార్యదర్శికి కోర్టు ధిక్కార చర్యలకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.



## అంతుచిక్కని వ్యాధితో 84,000 కోళ్లు మృతి

### రైతుకు భారీ నష్టం

**మిరుదొడ్డి, మార్చి 10, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో అంతుచిక్కని వ్యాధితో కోళ్ల ఫారంలో భారీ నష్టం జరిగింది. అందె గ్రామానికి చెందిన రంగనబోయిన కుమార్ అనే రైతు నిర్వహిస్తున్న కోళ్ల ఫారం షెడ్లలో పెంచుతున్న కోళ్లు అకస్మాత్తుగా మంగళవారం మృతి చెందాయి. సుమారు నెల రోజుల వయస్సు గల 8400 కోళ్లు చేతికొచ్చే దశలో ఉండగా సోమవారం నుంచి తెలియని వ్యాధితో సోకడంతో కోళ్లు కొట్టుకుంటూ ఒక్కొక్కటిగా చనిపోవడం ప్రారంభమైంది. దీంతో రైతు రంగనబోయిన కుమార్ తీవ్ర ఆవేదనకు గురై కన్నీటి పర్యంతమయ్యాడు. ఏదో అంతుచిక్కని వైరస్ సోకడంతోనే కోళ్లు మృతి చెందాయని ఈ ఘటనలో సుమారు రూ. 20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు కుమార్ తెలిపారు. తనకు భారీ నష్టం జరిగినందున ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

## రాహుల్‌గాంధీకి సొంత ఇల్లు లేదు

### మాజీ సిఎం కెసిఆర్ కారణంగా తెలంగాణ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం

### ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్

**హైదరాబాద్, మార్చి 10,ప్రభాతవార్త:** ప్రధానికి మనుమడు, ఇంకో ప్రధానికి కొడుకు అయిన రాహుల్ కి సొంత ఇల్లు లేదని ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ సిఎం వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాహుల్‌కి ఆస్తులు కావాలంటే తెలంగాణ కార్యకర్తలు తలా కొంచెం వేసుకుంటే 1000 కోట్లు అవుతాయని రేవంత్ అంటే దానిని ఇంకో రకంగా మార్చి ప్రజలకు చెప్పి వారి మనస్సులను కలుషితం చేస్తున్నారని దుయ్యబట్టారు. కెటిఆర్ మారకపోతే ఇంకో రకంగా స్పందించాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెటిఆర్ మారకపోతే ప్రజలు ఇంకా ఛీ కొడతారనీ హితువ చెప్పారు. బిఆర్ఎస్ ఇంత చిల్లరగా ఉన్నా సిఎం ఓపికగా ఉంటున్నారుఇంత ఓపికగా ఉంటున్న సిఎంకి దండం పెట్టాలనీ రాజకీయాలకు పాల్పడుతూ హెడ్ లైన్స్ కోసమే కెటిఆర్ తాపత్రయం అని భాష్యం చెప్పారు. విమర్శలు వాస్తవాలకు దగ్గరగా ఉండాలి, పచ్చి అబద్ధాలను కెటిఆర్ ప్రజలపై రుద్దుతున్నారని ఆయన అవేదనచెందారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు కెటిఆర్ ప్రభుత్వ పైసలను దుబారా చేసారనీ గవర్నమెంట్ సొమ్ముతో టిఆర్ఎస్ పార్టీని బిఆర్ఎస్ పార్టీగా చేసేందుకు వేరే రాష్ట్రాల వారిని ఫ్లైట్స్ లో రప్పించారనీ ఆయన గుర్తుచేశారు. కెసిఆర్ ఫోజులు కొట్టేందుకు తెలంగాణ పైసలను పంజాబ్ లో పంచారనీ, ఆర్థిక పరిస్థితిని కెసిఆర్ చిన్నాభిన్నం చేశారనీఆయన అన్నారు. తెలంగాణ ప్రజల సొమ్మును కెసిఆర్ కల్వకుంట్ల కుటుంబానికి దోచి పెట్టారనీ విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ బందు, కెటిఆర్ బందు, హరీష్ బందు, సంతోష్ బందు, కవిత బందు ఉండేదనీ ఇప్పుడు ఏ బందులేదనిచిల్లర రాజకీయాలు చేయడం కెటిఆర్ మానుకోవాలనీ కోరారు. తప్పుడు ప్రచారాలు చేయడంలో కెటిఆర్ దిట్ట నిజాలను అబద్ధాలుగా మార్చడం కెటిఆర్ కి వెన్నతో పెట్టిన విద్యలాంటి అలవాటు అని అన్నారు. కెటీఆర్ అబద్ధాలను నిజాలుగా వక్రీకరిస్తున్నారనీ ఆయన నీచ ఆయన అన్నారు.

## చర్లపల్లి-కామాఖ్య మధ్య కొత్త అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** చర్లపలి-కామాఖ్య మధ్య నూతన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం కానుంది. అస్సాం రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కామాఖ్య మరియు చర్లపల్లి మధ్య స్లీపర్ మరియు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో కూడిన కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 13న కామాఖ్య నుండి ప్రారంభించబడుతుంది.ఈ కొత్త రైలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఈశాన్య రాష్ట్రాలకు సింహద్వారంగా నిలుస్తున్న అస్సాం రాష్ట్రంతో అనుసంధానిస్తుంది. ఇది ముఖ్యంగా భారతదేశంలోని ఈశాన్య ప్రాంతాల వైపు ప్రయాణించే దూర ప్రయాణీకులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన,తక్కువ ప్రయాణ ఖర్చుతో కూడిన ప్రయాణాన్ని అందించడానికి దోహదపడుతుంది.

## నటి లావణ్య త్రిపాఠికి ఆన్‌లైన్‌లో వేధింపులు

### సిసిఎస్‌లో ఫిర్యాదు

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** టాలీవుడ్ నటి, యువ హీరో వరుణ్ తేజ్ సతీమణి లావణ్య త్రిపాటికి ఆన్‌లైన్‌లో వేధింపులు ఎదురయ్యాయి. అదేపనిగా సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేస్తుండడంతో ఆమె మంగళవారం నాడు సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్టాగ్రాం అనే అకౌంట్ ద్వారా తనతో పాటు తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు పలు పోస్టులు పెట్టడంతో పాటు కామెంట్లతో దూషణలు అసభ్య వ్యాఖ్యలు చేస్తున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపులు కొన్ని వారాలుగా కొనసాగుతున్నాయని ఆమె తన ఫిర్యాదులో తెలిపారు. వ్యక్తిగత జీవితంతో పాటు గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఇన్‌స్టాగ్రాం అకౌంట్‌ను విని యోగిస్తున్న వ్యక్తిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు ఆ అకౌంట్ ద్వారా చేసిన పోస్టులను తొలగించేలా చూడాలని లావణ్య త్రిపాటి కోరారు. లావణ్య త్రిపాటి ఫిర్యాదుపై సిసిఎస్ పోలీసులు ఐటి చట్టంలోని సెక్షన్ 67తో పాటు బిఎన్ఎస్ 78, 79 కింద కేసు నమోదు చేసి దీనిపై సైబర్ క్రైం పోలీసులు విచారణ చేబట్టారు.

## సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలిచ్చే నేరస్తులపై దాడులు

### 1,888 మ్యూల్ ఖాతాల గుర్తింపు, 549 కేసులు నమోదు, 208 మంది అరెస్టు

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** విదేశాల్లో ఉండే బడా సైబర్ నేరగాళ్లకు సహకరించే క్రమంలో వారికి భారత్‌లో మ్యూల్ ఖాతాలు అందిస్తూ సైబర్ నేరాల లావాదేవీలకు సహకరిస్తున్న వారిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేబట్టింది. దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ మంగళవారం మీడియాకు తెలిపారు. నేషనల్ క్రైం పోర్టల్ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ దాడులు చేబట్టినట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు రాష్ట్రాలలో 512 మంది సిబ్బందితో 137 పోలీసు బృందాలు మొత్తం 137 బ్యాంకు శాఖల్లో ఆకస్మిక తనిఖీలు చేబట్టగా ఇందులో దేశ వ్యాప్తంగా 9451 సైబర్ నేరాలతో సంబంధం కలిగిన 1888 మ్యూల్ ఖాతాల వివరాలు వెలుగు చూసినట్లు ఆమె తెలిపారు. ఈ ఖాతాల వల్ల వంద కోట్ల రూపాయల నేరం జరిగిందని తేలిందని శిఖా గోయల్ తెలిపారు. ఈ సందర్భంగా 549 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 626 మంది అనుమానితులను గుర్తించామని, వీరిలో 208 మందిని అరెస్టు చేశామని ఆమె తెలిపారు. వీరిలో 15 మంది మహిళలు, ఏడుగురు విద్యార్థులు, ఇద్దరు లెక్చరర్లు, విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు వున్నారని ఆమె వెల్లడించారు. వీరంతా తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్ల లావాదేవీలకు ఇస్తున్నారని, ఇందుకోసం కమీషన్ తీసుకుంటున్నారని ఆమె తెలిపారు. అరెస్టయిన వారి నుంచి 63 సెల్‌ఫోన్లు, 208 పాస్‌బుక్కులు జప్తు చేశామని, నిందితుల వయస్సే 19 నుంచి 45 ఏళ్ల మధ్య వుందని ఆమె తెలిపారు. ఈ తరహా నేరాలపై అందరు జాగ్రత్తగా వుండాలని ఆమె కోరారు.

## స్పీకర్‌పై అవిశ్వాసతీర్మాన చర్చలో మాకు అవకాశం కల్పించాలి

### భువనగరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 10,ప్రభాతవార్త:** లోకసభ స్పీకర్ అవిశ్వాస తీర్మాన చర్చలో సస్పెండ్ అయిన ఎనిమిది మంది ఎంపిలకు అవకాశం కల్పించాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం లోక్‌సభ ప్రాంగణంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. అవిశ్వాస తీర్మానం చర్చలో "సస్పెండైన ఎమ్.పిలు" ను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. తొలివిడత బడ్జెట్ సమావేశాల్లోప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని మాట్లాడేందుకు స్పీకర్ నిరాకరించినందుకు నిరసనగా"వెల్" లోకి వెళ్ళి ప్రశ్నించామనీ అన్నారు. ప్రశ్నించినందుకు 8 మంది ఎమ్.పిలను స్పీకర్ ఓం బిర్లా సస్పెండ్ చేశారనీ గుర్తుచేశారు .. స్పీకర్ ఓం బిర్లా పక్షపాతం తో వ్యవహరిస్తున్నారని మా ఆరోపణలతోనే వివాదం మొదలైందనీ తెలిపారు. కాబట్టి, మా పై సస్పెన్షన్ ను తొలగించి, చర్చలో భాగస్వామ్యం అయ్యేలా మాకు అవకాశం ఇవ్వాలనీ ఆయన తెలిపారు.

## గ్యాస్‌ను పొదుపుగా వాడుకోండి

### ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ సూచన

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో గృహ వినియోగదారులు గ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలని తెలంగాణ డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి సూచించారు. తాజాగా మంగళవారం గ్యాస్ కొరత అంశంపై ఒక ప్రకటనలో స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడే గ్యాస్ కొరత వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. అయితే ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం ఇలాగే కొనసాగితే మాత్రం ఇబ్బందులు వచ్చే ప్రమాదముందన్నారు. ఈ నేపథ్యంలో గ్యాస్ ఇబ్బందులు పెరగకుండా కేంద్రం అప్రమత్తమైందని చెప్పారు. గృహ వినియోగదారులకు కొరత రాకుండా కేంద్రం ముందస్తు చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ఇప్పటికే వ్యాపార, హోటల్స్‌కు నిలిపివేస్తూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయని అన్నారు. హాస్టళ్లు, ఆస్పత్రులు వంటి అత్యవసర విభాగాలకు మినహాయింపు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కమిటీ సిఫారసుల మేరకు ఆయిల్ కంపెనీలకు గ్యాస్ కొనసాగనుందని వెల్లడించారు.

## ఓవర్‌టేక్ వివాదం.. హైవేపై ప్రమాదం

### నల్గొండ ఫ్లైఓవర్ వద్ద లారీ ఢీకొని ఇద్దరు బస్సు డ్రైవర్లు మృతి

### మరో వ్యక్తికి తీవ్రగాయాలు

**నార్కట్‌పల్లి, మార్చి 10, ప్రభాతవార్త:** నార్కెట్ పల్లి లోని నల్గొండ ఎక్స్‌రోడ్ ఫ్లైఓవర్ వద్ద మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనలో ఇద్దరు బస్సు డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్ నుంచి కాకినాడ వైపు వెళ్తున్న మోజో ట్రావెల్స్ బస్సు (ఎన్ ఎల్ 02 3119) మరియు గుజరాత్ రాష్ట్రంలోని కచ్ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ (జీజే 16 ఏ డబ్ల్యూ 5757) ఒకదానిని ఒకటి ఓవర్‌టేక్ చేసే సమయంలో స్వల్పంగా తగిలాయి. దీంతో రెండు వాహనాల డ్రైవర్లు ఫ్లైఓవర్ పక్కన వాహనాలను ఆపి వాగ్వాదం చేస్తూ ఉన్నారు .అదే సమయంలో హైదరాబాద్ నుంచి కాకినాడ వైపు వెళ్తున్న మరో మోజో ట్రావెల్స్ బస్సు (ఎన్ ఎల్ 02 3126) అక్కడికి చేరుకుంది. ఆ బస్సు డ్రైవర్లు పస్తం శ్రీనివాస్, చిట్టి కేనా బంగారయ్య కూడా అక్కడికి వచ్చి వారితో మాట్లాడుతున్నారు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వస్తున్న లారీ (ఏ పి 31 టీ హెచ్ 1289) అతివేగంగా వచ్చి ముందుగా నిలిపి ఉన్న గుజరాత్ లారీని బలంగా ఢీకొట్టింది.ఈ ఢీకొన్న ప్రభావంతో వాహనాల మధ్యలో ఉన్న నలుగురు వ్యక్తులు వాహనాల మధ్య ఇరుక్కుపోయారు. ఈ ప్రమాదంలో రెండవ బస్సు డ్రైవర్లు శ్రీనివాస్ (30) మరియు బంగారయ్య (45) అక్కడికక్కడే మృతి చెందగా, మొదటి బస్సు క్లీనర్ సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు.సమాచారం అందుకున్న వెంటనే నార్కెట్‌పల్లి సీఐ, ఎస్సై పి. విష్ణుమూర్తి, చిట్యాల ఎస్ఐ పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

మృతదేహాలను నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన మూడు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా క్లియర్ చేశారు.ఈ ఘటనపై నార్కెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.






తెలంగాణ ప్రభుత్వం
మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం: జడ్చర్ల
సంక్షిప్త కొటేషన్ ప్రకటన
కొటేషన్ ప్రకటన నం: E/రంజాన్ పండగకు అవశ్యక ఏర్పాట్లు చేయుట/కొటేషన్/2025 తేది: 10.03.2026
జడ్చర్ల మునిసిపాలిటీలో ఈద్గా వద్ద రంజాన్ పండుగకు సరఫరా, అందచేత మరియు టెంట్ ఫిక్సింగ్ (పెండాల్స్), టేబిల్, కుర్చీలు, తివాచీలు, హారన్స్, యాంప్లిఫైర్లు, మౌత్ పీస్‌లు వగైరా ఇతర ఐటమ్‌ల కొరకు పేరొందిన సంస్థలు/ఏజన్సీల నుండి సీల్ టెండర్‌లు కోరబడుతున్నవి. కొటేషన్‌ల స్వీకరణకు చివరి తేది: 12.03.2026 మ.12.00గం. వరకు. పై ఐటమ్‌లకు కొటేషన్, జడ్చర్ల మునిసిపాలిటీ కమిషనర్‌గార్కి ఎడ్రస్ చేయవలెను. తదుపరి వివరాలను మునిసిపల్ కమిషనర్ (7337351867) మునిసిపల్ ఇంజనీర్ (8179333826) కార్యాలయ పని వేళలలో సంప్రదించవలెను. జడ్చర్ల మునిసిపాలిటీ కమిషనర్ గార్కి ఏ కారణం తెలుపనక్కర్లేకుండానే అన్ని కొటేషన్‌లను లేదా ఏకొటేషన్ అయినా ఆమోదించే తిరస్కరించే హక్కు రిజర్వ్ అయిఉంది.
సం/-. కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ.
DIPR.NO. 16748-PP/CL/ADVT/1/2025-26 తేది: 10.03.2026

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
జిల్లా R&B అధికారి (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) నాగర్‌కర్నూల్ జిల్లా: నిట్ సంక్షిప్త టెండర్ ప్రకటన NO.EE/R&B/NGKL/ER (1నం.లు)/2025-26 తేది: 05.03.2026. 1. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1(ఒక) పనికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) NGKL NO.EE/R&B/NGKL/ER (1నం.లు) / 2025-26/తేది: 05.03.2026 ప్రకారం, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. 2. టెండర్‌దారులు టెండర్ షెడ్యూల్స్‌ను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in నుండి 12.03.2026 ఉ.11.00గం. వద్ద ఆపై డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్‌ల స్వీకరణ యొక్క చివరి తేది: 20.03.2026న మ.3.30గం. వరకు లేదా ముందు. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (R&B) డివిజన్: నాగర్‌కర్నూల్.
DIPR.NO. 16714-PP/CL/ADVT/1/2025-26 తేది: 10.03.2026

వార్త


అందం కంటిని మాత్రమే ఆకట్టుకుంటుంది.
కానీ సౌశీల్యం హృదయాన్నే దోచుకుంటుంది.

-రామకృష్ణ పరమహంస

# పతనం అంచున ప్రజారోగ్యం

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే లక్ష్యంతో దేశ ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశాం, చేస్తూనే ఉన్నాం. అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కానీ లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టారు. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యలగూర్చి రాజ్యాంగంలో పొందుపరిచారు. ఇన్ని దశాబ్దాలు గడిచిపోయినా అందరికి కనీస ఆరోగ్య వసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపైదాడుల పరంపర కొనసాగుతూనే ఉన్నది. కొన్ని వ్యాధులను నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యం కావడం లేదు. కొత్త మందులు, చికిత్సలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటున్నా అంతకురెట్టింపు స్థాయిలో కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయి. కోట్లాది మంది రోగపీడితులు అవుతున్నారు. లక్షలాది మంది ప్రాణాలు వదులుతున్నారు. నిన్నమొన్నటి వరకు ప్రపంచాన్ని చిగురుటాకులా వణికించిన కరోనా రక్కసి శాంతించినా అప్పుడు వాడిన మందుల ప్రభావం నుండి ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది కోలుకోలేకపోతున్నారు. కిడ్నీ సమస్యలు పెరిగిపోతున్నాయి. డయాలసిస్ కేంద్రాలు ఎన్ని పెట్టినా సరిపోవడంలేదు. ఇటీవల కాలంలో గుండె జబ్బులు పెరిగిపోయాయి. వయస్సుతో నిమిత్తంలేకుండా ఎనిమిది, తొమ్మిదేళ్ల వయసున్న చిన్నపిల్లల నుండిఅరవై యేళ్లకు పైబడిన వారు గుండెజబ్బులకు లోనవుతున్నారు. ఆకస్మికంగా ఉన్న చోటనే కూలిపోయి క్షణాల్లో ప్రాణాలు వదులుతున్నారు. ఇక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీఇన్నీ కావు. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఒకటే మిటిరకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. అయితే ఈ వ్యాధుల నుండి రోగ నిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు డాక్టర్లు అభిప్రాయపడు తున్నారు. ఒక్క అల్లోపతి డాక్టర్లేకాదు, ఆయుర్వేదం, హోమియో తదితర విభాగాల డాక్టర్లు, వైద్య నిపుణులు, శరీరంలో ఇమ్యూనిటీ పెంచుకోవాలని సలహాలు ఇస్తున్నారు. ఈవిషయం ఇప్పుడు కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో చెప్తున్నారు. ఈవాస్తవాలు ప్రజలకు కూడా తెలియనివి కావు. అయినా రోగనిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు. కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? తదితర అంశాలు పరిశీలించాల్సిన తరుణమిది. రోగనిరోధక శక్తి ఒక్క రోజులో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్యమైన పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందించాలి. ఏమేరకు అందిస్తున్నామో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్థాకలితోఅలమటించే వారు భారత్‌లో కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారిలో రోగ నిరోధకశక్తి ఎలా వస్తుంది. మరోకపక్క వాయు, నీటి కాలుష్యాలు ప్రజారోగ్యాన్ని కోలుకోలేకుండా చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు దాదాపు కాగితాలకే పరిమితమవుతున్నాయి. మొన్న దేశరాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం తారాస్థాయికి చేరుకోవడంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఢిల్లీపరిసర ప్రాంతాల్లో ప్రధానంగా చలికాలం, వాయుకాలుష్యం చుట్టుముట్టడం, ఆ పౌరులను ఉక్కిరిబిక్కిరి చేయడం ప్రతియేడాది జరుగుతూనేఉన్నది. యేడాదియేడాదికి పెరిగిపోతున్నది. ఒక్క ఢిల్లీయేకాదు, భారత దేశంలోని అనేక నగరాలు, పట్టణాలు వాయుకాలుష్యంతో అతలాకుతలం అవుతున్నాయి. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. దీనికి తోడువాహన కాలుష్యం పెరిగిపోతున్నది. ఫలితంగా కేన్సర్ లాంటి వ్యాధులు పంజా విసురుతున్నాయి. దీని బారినపడి లక్షలాది మంది ఆర్థికంగా చితికిపోతుంటే మరికొందరు సకాలంలో సరైన వైద్యం అందకప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. యేటా సరాసరి దేశంలో పద్నాలుగు లక్షలకుపైగా కేన్సర్ కేసులు నమోదవుతున్నట్లు భారత వైద్య పరిశోధన మండలి జాతీయ కేన్సర్ నమో దు కార్యక్రమం నివేదికను బట్టి తెలుస్తున్నది. యాభై యేళ్ల వయసురాకముందే మహిళలు, పురుషులు రకరకాల కేన్సర్ల బారిన పడుతుండటానికి వారి జీవన శైలి, సంబంధిత అలవాట్లు ప్రధాన కారణమని పరిశోధకులు, వైద్యనిపుణులు విశ్లేషిస్తున్నారు. అలవాట్లను, జీవనశైలిని మార్పు చేసుకోవడం ద్వారా కేన్సర్ మహమ్మారిబారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని నిపుణులు చెబుతున్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడంవల్ల నోరు, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక కేన్సర్ల నుండి తప్పించుకోవచ్చునని డాక్టర్లు సలహా ఇస్తున్నారు. అయితే ప్రజ ల్లో దీనిపై అవగాహన పెంచేందుకు త్రికరణశుద్ధిగా ప్రయత్నాలు జరగడంలేదు. ఒక పక్క పొగాకు సాగును ప్రోత్సహిస్తూనే మరొకపక్క నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. మద్య పానంకూడా ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నది. ప్రజా సంక్షేమమే తమలక్ష్యమని చెప్పుకునే పాలకపెద్దలు ఆప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ఇవేకాదు కల్తీకూడా ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం చూపిస్తున్నది. ఇలాంటివి ఎన్నో ప్రజారోగ్యాన్ని పతనం అంచుకు తీసుకుపోతున్నాయి. పాలకులు ఇప్పటికైనా మనస్సు పెట్టి ఆలోచించాలి. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఆస్పత్రులను, సిబ్బందిని పెంచి వైద్యసదుపాయాలు అందించాల్సిన అవసరం ఉంది.

అదును తెలిసి వ్యవహరించడమంటే ఎంతో శ్రమను, సమయాన్ని, వ్యయాన్ని ఆదా చేయడమే.



ఆస్కార్‌వైల్డ్

ఉత్తముల్ని గౌరవించడం, సేవకుల్ని దయతల్చడం, శత్రువుల్ని క్షమించడం అభివృద్ధికి ఆధారాలు.



అబ్రహాంలింకన్

## ప్రజావాక్కు



### సైబర్ నేరాలను అరికట్టాలి

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రజలు తమ కష్టార్జితాన్ని పొదుపు రూపంలో దాచుకుంటారు. అయితే సైబర్ నేరగాళ్లు ప్రజలకు తెలియకుండానే ఈసొమ్మును దొంగిలిస్తున్నారు. ఇలాంటిమోసాలకు గురైన బాధితులు పోలీసులకు, బ్యాంకులకు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా అవి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగించే విషయం. బ్యాంకులు తమ నిస్సహాయతను వ్యక్తంచేస్తూ, పోగొట్టుకున్న లేదా స్తంభింపజేసిన సొమ్మును తిరిగి పొందడం కేవలం సైబర్ సెక్యూరిటీ సిబ్బంది ద్వారానే సాధ్యమని చెబుతున్నాయి. దీనివల్ల సామాన్య ప్రజలు తమ సొంత డబ్బు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిఏర్పడుతోంది. అధికారులు సకాలంలో స్పందించి, సాంకేతికతనుఉపయోగించిబాధితులు పోగొట్టుకున్న సొమ్మును తిరిగి వచ్చేలాచేయాలి. అప్పుడే ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థపై, చట్టంపై నమ్మకం కలుగుతుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

మన దేశంలో కొన్ని రకాల పర్యాటక రంగాలున్నాయి. అందులో ఒకటి విమాన రంగం. పూర్వం బేగంపేట విమానాశ్రయంలో వచ్చేపోయే విమానాలను చూడటానికి పల్లెటూర్ల నుండి పనిమీద బంధువుల ఇంటికి హైదరాబాద్ వచ్చినవారుటికెట్టుకొని పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన మిద్దెమీద ప్రదేశానికి వెళ్ళి చూసేవారు. ఇదే మాదిరిగా రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో కూడా పర్యాటకులకు ఇటువంటి సదుపాయాన్ని తక్కువ ధర అంటే 50రూపాయలలోపు ప్రవేశ రుసుమును నిర్ణయించాలి. ఈపర్యాటక సదుపాయం కల్పిస్తే చూసేవారికి కనువిందు, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

- ఎన్. లక్ష్మి, సికింద్రాబాద్

### షరా మామూలే

ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి రావాలని ముందు వెనుక ఆలోచించకుండాసాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా హామీల వర్షం కురిపేస్తుంటారు పార్టీలకు చెందిన నాయకులు. అధికారంలోకివచ్చాకహామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుంటారు. అయితే ఒకరుమోసం చేసినా మరొకరు మంచి చేయకపోతారా అనే ఆశతో ప్రభుత్వాలను మారుస్తుంటారు.

- ఎమ్.శర్మ, హైదరాబాద్

### వైద్య కళాశాలల విస్తరణ అవసరం

వైద్య విద్యను, ఆరోగ్య సేవలను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వ వైద్య కళాశాలల విస్తరణ అవసరంగా మారింది. ప్రస్తుతం లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రైవేటు వైద్య కళాశాలలసంఖ్య ప్రభుత్వ కళాశాలల కంటే ఎక్కువగా ఉంది. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 18 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే, తెలంగాణలో ఇటీవల 8 కొత్త కళాశాలలు మంజూరు కావడంతో ప్రభుత్వ కళాశాలల సంఖ్య 34కిపెరిగింది. అయినప్పటికీ విద్యార్థుల పెరుగుతున్న డిమాండ్‌కి, జనాభాకు తగిన వైద్యులనిష్పత్తి దృష్ట్యా ఈ సంఖ్య పరిమితంగా ఉంది. అధిక శాతం వైద్య సీట్లు ప్రైవేట్ లేదా మేనేజ్‌మెంట్‌కోటాలో ఉండటంవల్ల మెరిట్ ఉన్నప్పటికీ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఎంబీబీఎస్ సీటు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- సి.సాయిరుత్విక్, నల్గొండ

### నిధుల కొరత

వాతావరణ మార్పులు గ్లోబల్ పాలనను పునర్నిర్వచిస్తున్న ఈ దశలో, కాప్30లోభారత్ ప్రకటించిన వైఖరి ఒక ప్రతిస్పందన మాత్రమేకాదు, అదివాతావరణ న్యాయం, సమానత్వం, చారిత్రక బాధ్యతలపై ఆధారపడిన ఒక సుస్థిరదృక్కోణం. ప్యారిస్ ఒప్పందానికి పునాది అయిన సాధారణ కానీ విభిన్న బాధ్యతలు సూత్రం, సర్వదేశాలకుఒకేరకం బాధ్యతలను పెట్టడం అసంబద్ధమని స్పష్టంగా చెబుతుంది. పారిశ్రామికీకరణ ద్వారా శతాబ్దాలుగా అధిక ఉద్గారాలు విడుదల చేసిన అభివృద్ధి చెందిన దేశాలు తమ పాత్రను సక్రమంగా నిర్వర్తించకపోవడం, కానీ అదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలపై కఠిన బాధ్యతలను మోపాలని, వాతావరణ చర్చల్లో ఏర్పడుతున్న అసమతౌల్యాన్ని బహిర్గతం చేస్తుంది.

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

### నిప్పులేనిదే పొగ రాదు

నేపాల్‌లో బంగ్లాలో శ్రీలంకలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలు ప్రధాని రాజీనామా దాకా తీసుకొచ్చారు. నిప్పులేనిదే పొగరాదు అన్నట్టు ప్రభుత్వం అనుసరించిన అవినీతి విధానాలు ఒకవైపు వలసీకరణ ఒకవైపు విద్యార్థుల ఉద్యమం ఒకవైపు ఈ జెన్ జీ ఉద్యమాన్ని ఫలవంతం చేసాయి. అయితే ప్రజా పోరాట విస్ఫోటనం తరవాత కొన్ని రాజ్యాలు లేక దేశాలు వెనుకబడిపోయాయి .

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చట్టం అందరికీ సమానమేనా?

**రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను వాడటం, 30 రోజుల జైలు జీవితం వంటి అసంబద్ధ చట్టాలను తీసుకురావాలనే ఆలోచన ప్రజాస్వామ్య మనుగడకు శ్రేయస్కరం కాదు. చట్టం తన పని తాను చేయాలి, కానీ అది ఏ ఒక్క పార్టీకో లేదా వర్గానికో కొమ్ముకాయకూడదు. రాజ్యాంగంలోని ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లో మార్పులు తెచ్చేటప్పుడు న్యాయవ్యవస్థ స్వతంత్రతను, వ్యక్తుల ప్రాథమిక హక్కులను రక్షించేలా ఉండాలి. తప్పుడు కేసులు పెట్టిన అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా జవాబుదారీతనం పెంచాలి. అప్పుడే దర్యాప్తు సంస్థల్లో పారదర్శకత వస్తుంది, ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థల మీద నమ్మకం కలుగుతుంది. నిర్దోషులకు న్యాయం జరగాలి, నిజమైన దోషులు చట్టం నుండి తప్పించుకోకూడదు. అదే అసలైన ప్రజాస్వామ్య చిహ్నం.**

నల్ల రవికుమార్

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశం'చట్టంముందు అందరూ సమానులే' అన్నసూత్రం. కానీ, వర్తమాన రాజకీయ ముఖచిత్రాన్ని నిశితంగా పరిశీలిస్తే, చట్టం అందరికీ సమానంగా వర్తిస్తోందా? లేక అధికార పీఠంపై ఉన్నవారికి అనుకూలంగా, ప్రతిపక్షంలో ఉన్న వారికి ప్రతిబంధకంగా మారుతోందా? అన్న సందేహం సామాన్యుడికి కలగక మానదు. ఇటీవలి కాలంలో సంచలనం సృష్టించిన లిక్కర్ కుంభకోణం వంటి కేసుల్లో సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పు కేవలం ఒక కేసు ముగింపు మాత్రమే కాదు, అది మన దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థల విశ్వసనీయతపై సంధించిన ఒక పదునైన అస్త్రం. సాక్ష్యాధారాలతో లేవని, కేవలం ఊహాగానాలతోనే కేసులు అల్లారని న్యాయమూర్తి కుండబద్ధలు కొట్టినప్పుడు, ఆ నెపం మోసి, జైలు గోడల మధ్య కాలాన్ని వెళ్లదీసి, రాజకీయంగా సర్వస్వం కోల్పోయిన నేతల జీవితాలకు జరిగిన నష్టానికి బాధ్యులెవరు? అనే ప్రశ్నఇప్పుడు గట్టిగా వినిపిస్తోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ప్రకారం ప్రతి పౌరుడికి జీవించే హక్కువ్యక్తిగత స్వేచ్ఛ ఉన్నాయి. చట్టం నిర్దేశించిన పద్ధతిలో తప్ప, ఏ వ్యక్తి స్వేచ్ఛను హరించకూడదు. అయితే, ఈ ఆర్టికల్‌ను అడ్డంపెట్టుకుని, దర్యాప్తు సంస్థలు 'అరెస్ట్' అనే ఆయుధాన్ని రాజకీయ వ్యూహంగా వాడుకుంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇటువంటి ఫాల్స్ కేసులు నమోదు చేయడం ద్వారా ఓటర్ల ఆలోచనా దృక్పథాన్ని, తద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ప్రమాదకర ధోరణి పెరుగుతోంది. ఒక బలమైన నాయకుడిని ఎన్నికల ప్రచారానికి దూరం చేయడం కోసం లేదా ప్రజాక్షేత్రంలో వారిని అవినీతిపరులుగా ముద్ర వేయడం కోసం నెలల తరబడి జైల్లో ఉంచడం అంటే అది కేవలం ఒక వ్యక్తికి జరుగుతున్న అన్యాయం కాదు, అది ప్రజల తీర్పునే అపహాస్యం చేయడం. ఉదాహరణకు, ఎన్నికలకు కేవలం ఆరు నెలలముందు ఒక కీలక నేతను అరెస్ట్ చేస్తే, విచారణ పూర్తయి అతను నిర్దోషి అని తేలేసరికి ఎన్నికలు ముగిసిపోతాయి, ప్రభుత్వం మారిపోతుంది. అంటే, ఇక్కడ 'విచారణే ఒక శిక్ష'గా మారిపోతోంది. తప్పుడు కేసుల ద్వారా ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చేయడం ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోయడంతో సమానం. ఈ గందరగోళంలో 30 రోజులు జైల్లో ఉంటే పదవి కోల్పోవాలి అనే చట్ట ప్రతిపాదన ప్రజాస్వామ్యానికి మరో గొడ్డలిపెట్టు. భారత న్యాయ సూత్రం ప్రకారం నేరం నిరూపితమయ్యేవరకు ప్రతి ఒక్కరూ నిర్దోషులే. కానీ, ఈ ప్రతిపాదన ఆప్రాథమిక సూత్రాన్నే తుంగలో తొక్కుతోంది. విచారణ పూర్తి కాకుండానే, శిక్ష పడకముందే ఒక వ్యక్తిని పదవికి అనర్హుడిని చేయడం



అంటే అది ప్రత్యర్థులపై రాజకీయ కక్ష సాధింపులకు రాజమార్గం వేయడమే అవుతుంది. దర్యాప్తు సంస్థలు అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మలుగా మారినప్పుడు, ఎవరినైనానెల రోజులు బెయిల్ రాకుండా జైల్లో ఉంచడం పెద్ద కష్టమేమీ కాదు. ఇలాంటి చట్టం అమలులోకి వస్తే, దేశంలో రాజకీయ సుస్థిరత దెబ్బతింటుంది. ప్రత్యర్థుల పొలిటికల్ కెరీర్ను నాశనం చేయడానికి ఇది ఒక చట్టబద్ధమైన ఆయుధంగా మారుతుంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వపు హక్కు)కు పూర్తి విరుద్ధం. మరోవైపు, ఈ నాణేనికి మరో భయంకరమైన పార్శ్వం కూడా ఉంది. నిరాధారమైన కేసులు పెరిగిపోవడం వల్ల, నిజమైన నేరస్థులు కూడా దీనిని ఒక కవచంగా వాడుకుంటున్నారు. దర్యాప్తు సంస్థలు తమపై కూడా తప్పుడు కేసులే పెట్టాయని ప్రజల్లో నమ్మించి, విచారణాధికారులను బెదిరించడం, దర్యాప్తును నీరుగార్చడం వంటివి చేస్తున్నారు. వ్యవస్థల విశ్వసనీయత తగ్గినప్పుడు, నిజమైన అవినీతిపరులు కూడా బాధిత ముద్ర వేసుకుని ప్రజల్లో సానుభూతి పొందడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది దర్యాప్తు సంస్థల సామర్థ్యాన్ని నీరుగార్చడమే కాకుండా, నిజమైన దోషులు చట్టం నుండి తప్పించుకోవడానికి మార్గం సుగమం చేస్తోంది. దర్యాప్తు అధికారుల మీద కేసులు ఫైల్ చేయాలని కోర్టు ఆదేశించాల్సి వస్తుందంటేనే, వ్యవస్థ ఎంతటి సంక్షోభంలో ఉందో అర్థమవుతోంది. ఇందులో మీడియా పాత్ర కూడా ఇక్కడ విమర్శల పాలవుతోంది. సంచలనం కోసం దర్యాప్తు సంస్థలు ఇచ్చే అరకొర సమాచారాన్ని పరమ సత్యంగా ప్రసారం చేయడం వల్ల ప్రజాస్వామ్య పౌరులైన ప్రజల్లో ఉదాసీనత పెరుగుతోంది. ఒక వ్యక్తి అరెస్ట్ అయినప్పుడు గంటల తరబడి చర్చలు నిర్వహించే మీడియా, అదే వ్యక్తి నిర్దోషిగా విడుదలైనప్పుడు ఒక చిన్న స్క్రోలింగ్తో సరిపెడుతోంది. దీనివల్ల నిందితులకు జరిగే క్యారెక్టర్ అస్సాసినేషన్ అంతా ఇంతా కాదు. రాజకీయ నాయకులపై కేసులు అంటే అది వారి వ్యక్తిగత విషయమని సామాన్య పౌరులు భావిస్తుండటం ప్రమాదకరం. వ్యవస్థలు నిర్వీర్యమైతే, చట్టం తన దారిని తప్పుతుంటే అది రేపు సామాన్యుడి గడప వరకు రాదని గ్యారెంటీ లేదు. నిర్దోషిత్వం నిరూపించుకున్న నాయకుల కన్నీళ్లు వ్యవస్థలోని లోపాలను వేలెత్తి చూపుతున్నాయి. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను వాడటం, 30 రోజుల జైలు జీవితం వంటి అసంబద్ధ చట్టాలను తీసుకురావాలనే ఆలోచన ప్రజాస్వామ్య మనుగడకు శ్రేయస్కరం కాదు. చట్టం తన పని తాను చేయాలి, కానీ అది ఏ ఒక్క పార్టీకో లేదా వర్గానికో కొమ్ముకాయకూడదు. రాజ్యాంగంలోని ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 లో మార్పులు తెచ్చేటప్పుడు న్యాయవ్యవస్థ స్వతంత్రతను, వ్యక్తుల ప్రాథమిక హక్కులను రక్షించేలా ఉండాలి. తప్పుడు కేసులు పెట్టిన అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా జవాబుదారీతనం పెంచాలి. అప్పుడే దర్యాప్తు సంస్థల్లో పారదర్శకత వస్తుంది, ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థల మీద నమ్మకం కలుగుతుంది. నిర్దోషులకు న్యాయం జరగాలి, నిజమైన దోషులు చట్టం నుండి తప్పించుకోకూడదు. అదే అసలైన ప్రజాస్వామ్య చిహ్నం. •

# హైటెక్ అడుగులతో వ్యవసాయానికి స్వర్ణ యుగం

తిప్పర్తి శ్రీనివాస్

దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా నిలిచిన వ్యవసాయ రంగం ప్రస్తుతం అనేక సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం, భూసారహ్రాసం, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, మార్కెట్ అనిశ్చితి వంటి సమస్యలు రైతు జీవితాన్ని క్లిష్టతరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ హైటెక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆమోదించే దిశగా అడుగులు వేయడం సమయానుకూలమైన, దూరదృష్టితో కూడిన నిర్ణయంగా భావించాలి. ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో సమర్థవంతంగా వినియోగించడం ద్వారా రైతు ఆదాయం పెంపు, దిగుబడి వృద్ధి, వనరుల సంరక్షణ వంటి లక్ష్యాలు సాధ్యమవుతాయి. ఇప్పటి ప్రపంచంలో వ్యవసాయం కేవలం సంప్రదాయ పద్ధతులకే పరిమితం కావడం సాధ్యం కాదు. ప్రపంచవ్యాప్తంగా డేటా ఆధారిత వ్యవసాయం, ఖచ్చితత్వ వ్యవసాయం, డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాలు, సెన్సార్లు, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతిక పరిజ్ఞానాలు విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. ఇవి పంటల ఆరోగ్య పరిస్థితిని, నేలలోని పోషక స్థాయిలను, నీటి అవసరాన్ని ముందుగానే అంచనా వేసి రైతులకు సరైన సూచనలు అందించగలవు. ఈ విధంగా పంటలపై వచ్చే ఒత్తిడి, వ్యాధులు, నీటికొరత వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుంది. ఉపగ్రహ సాంకేతికత డ్రోన్ సర్వేలు ద్వారా పంటల స్థితిగతులను సున్నిత స్థాయిలో గమనించడం ఒక విప్లవాత్మక మార్పుగా నిలవవచ్చు. పంటలో చిన్న మార్పులు వచ్చినా వాటిని గుర్తించి రైతులకు హెచ్చరికలు అందించడం ద్వారా నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు. అంతేకాకుండా నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించడం, ఎరువుల వినియోగాన్ని ఖచ్చితంగా అంచనా వేయడం ద్వారా ఖర్చులు తగ్గుతాయి. ఇది రైతు లాభదాయకతను పెంచడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుంది. అయితే సాంకేతికత ప్రవేశపెట్టడమే సరిపోదు. దాని అమలు సక్రమంగా జరగాలి. ముఖ్యంగా మన దేశంలో చిన్న సన్నకారు రైతులే ఎక్కువ. వారికి అధునాతన పరికరాలు అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. సబ్సిడీలు, సమూహ ఆధారిత వినియోగ విధానాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పరికరాల పంచుకునే విధానం వంటి చర్యలు తీసుకోవాలి. లేకపోతే సాంకేతికత పెద్ద రైతులకు మాత్రమే పరిమితమై అసమానతలను పెంచే ప్రమాదం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం రైతుకు సహాయకారిగా మారాలంటే శిక్షణ అత్యవసరం. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వ్యవసాయ విస్తరణాధికారులకు సాంకేతిక శిక్షణ ఇవ్వడం, రైతులకు సులభమైన భాషలో మార్గదర్శకాలు అందించడం అవసరం. డిజిటల్ వేదికల ద్వారా మొబైల్ యాప్‌లు, సందేశ సేవలు, కాల్ సెంటర్లు వంటి సౌకర్యాల ద్వారా రైతులకు సమయానుకూల సమాచారం అందించాలి. మార్కెట్ అనుసంధానం కూడా హైటెక్ వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తుంది. పంటల ధరల సమాచారం, డిమాండ్ అంచనాలు, నిల్వ సదుపాయాల వివరాలు వంటి అంశాలను డిజిటల్ ప్లాట్ ఫారమ్‌ల ద్వారా రైతులకు అందిస్తే వారు సరైన నిర్ణయాలు తీసుకోవచ్చు. ముందస్తు ఒప్పంద వ్యవసాయం, నేరుగా వినియోగదారులకు విక్రయం వంటి అవకాశాలు విస్తరిస్తాయి. డేటా ఆధారిత వ్యవసాయం రైతుకు పంట ఎంపికలో, సాగు కాల నిర్ణయంలో, మార్కెట్ ఎంపికలో కీలకంగా మారుతుంది. అదేవిధంగా డేటాభద్రత గోప్యత అంశాలను విస్మరించరాదు. రైతుల భూమి, పంటల వివరాలు వంటి సమాచారాన్ని రక్షించేందుకు స్పష్టమైన విధానాలుఉండాలి. సాంకేతికత వినియోగం పారదర్శకంగా ఉండి రైతు ప్రయోజనాలను కాపాడాలి. ప్రభుత్వ పర్యవేక్షణతో పాటు నిపుణుల సూచనల ఆధారంగా వ్యవస్థలు రూపొందించాలి. వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో క్లైమేట్ స్మార్ట్ వ్యవసాయం అత్యవసరం. మట్టి ఆరోగ్య పటాలు, వర్షపాతం అంచనాలు, నీటి నిర్వహణ సాంకేతికతలు రైతులకు రక్షణ కవచంలా నిలుస్తాయి. దీర్ఘకాలికంగా చూస్తే ఇది ఆహార భద్రతకు బలమైన ఆధారంగా నిలుస్తుంది. మొత్తం మీద వ్యవసాయ శాఖ హైటెక్ దిశగా అడుగులు వేయడం శుభ సూచకం. అయితే ఇది కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, నేలమీద స్పష్టమైన ఫలితాలుగా మారాలి. రైతు ఆదాయం పెరగడం, వ్యయాలు తగ్గడం, పంట నష్టాలు తగ్గడం వంటి స్పష్టమైన ప్రయోజనాలు కనబడితేనే ఈ ప్రయత్నం సార్థకమవుతుంది. ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, నిపుణులు, రైతులు కలిసికట్టుగా కృషి చేస్తేనే సాంకేతికత నిజమైన మార్పుకు దోహదపడుతుంది. హైటెక్ వ్యవసాయం ఒక ఆశాకిరణం. సరైన ప్రణాళిక, సమర్థ అమలు, సమగ్ర భాగస్వామ్యంతో ఇది రైతు జీవితాన్ని స్థిరత్వం వైపు నడిపించగలదు. వ్యవసాయం లాభదాయకంగా, సుస్థిరంగా మారే దిశగా ఈ మార్పు ఒక కీలక మైలురాయిగా నిలవాలని ఆకాంక్షిద్దాం. •

# యుద్ధోన్మాది అమెరికా ప్రపంచ ప్రజల శత్రువు!


బొల్లిముంతసాంబశివరావు

సామ్రాజ్యవాద రక్తపిపాసి అమెరికా మరోసారి ఇరాన్పై విరుచుకుపడింది. తనపెంపుడు బిడ్డ ఇజ్రాయిల్తో కలిసి ఇరాన్లోని అనేకప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్సుప్రీమ్నాయకుడు అలీఖమేని హత్యచేసింది. ఇంకా అనేక మంది ఇరాన్ నాయకులు, వందలాది మంది ప్రజలు అమెరికా దాడిలో మరణించారు. 140మంది చిన్నపిల్లలను బాంబులతో చంపివేసింది. ఇజ్రాయిల్, అమెరికా నిరంతరం బాంబుల వర్షం కురిపిస్తూ మారణకాండ సాగిస్తున్నది. ఆధునిక కాలంలో యుద్ధాలకు మూలం సామ్రాజ్యవాదమే. సామ్రాజ్యవాదుల మోసపూరితమైన శాంతిపంథానూ, దురాక్రమణ పూరితమైన యుద్ధాలను రెండుచేతులా ఉపయోగిస్తారు. తాము జరిపిన దురాక్రమణ యుద్ధాలనూ, యుద్ధ ప్రయత్నాలను శాంతివచనాల ముసుగుతో కప్పిపెట్టుకో ప్రయత్నిస్తారని లెనిన్మహాశయుడు అన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు. సామ్రాజ్యవాద ప్రభుత్వాలు శాంతి గురించి కబుర్లు చెబుతాయి. వాస్తవంలో ఆక్రమణ యుద్ధాలను, బందిపోటు దండయాత్రలను కొనసాగిస్తాయి. సాత్విక వాదాన్ని ప్రచారం చేయడంలో ఒకేఒక్క ఆశయమున్నది. శాంతిని గురించి వాగాడంబరంతో ప్రజలను మోసగించడం దానిచాటున మరో కొత్తయుద్ధానికి సన్నాహాలు చేయడం, ఇదే సామ్రాజ్యవాద ఆవశ్యమని వివరించారు స్టాలిన్. లెనిన్, స్టాలిన్చెప్పిన మాటలు నేడు అమెరికా సామ్రాజ్యవాదానికి వర్తిస్తాయి. అది చేసిన దురాక్రమణ యుద్ధాలకు, సైనిక జోక్యాలకు కమ్యూనిజం, టెర్రరిజం వల్ల ప్రపంచ శాంతికి ప్రమాదం ఏర్పడుతుందని, శాంతి ఏర్పడాలంటే వాటిపై దాడిచేయాలని అమెరికా చెబుతూ తన దురాక్రమణ విధానాలను సమర్థించుకుంటున్నది. ఇరాన్‌పై దాడికి ఇలాంటి శాంతిజపాన్నే వల్లిస్తూ ఉన్నది. ఇరాన్ యురేనియం శుద్ధి పెద్దఎత్తున కొనసాగిస్తూ అణ్వాయుధాల తయారీకి సిద్ధమౌతున్నదని, పెద్దఎత్తున మిస్సైల్స్ ఉత్పత్తి చేసిందని ఇది ప్రపంచానికి ముఖ్యంగా అమెరికా రక్షణకు చాలాప్రమాదమని అందుకే ఇరాన్ యురేనియం శుద్ధికార్య క్రమాన్ని ఆపివేయాలని లేని వెడల దానిపై ఆంక్షలు విధిస్తామని అవసరమైతే దాడికూడా చేస్తామని అమెరికా బెదిరింపులు ప్రారంభించింది. ఇరాన్ విధానాల వల్ల పశ్చిమాసియాకి ప్రమాదమని ముఖ్యంగా తనపెంపుడు బిడ్డ ఇజ్రాయెల్‌కు ప్రమాదమని అమెరికా భావిస్తున్నది. అందుకే ఇరాన్‌ను తన చెప్పు చేతుల్లో ఉంచుకునేందుకు అవసరమైన విధానాలు అమలు జరుపుతున్నది. ఇరాన్‌లో సహజ వనరులు అనేకం ఉన్నాయి. ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఇంధన వనరులు కలిగిన దేశం. ప్రపంచంలో 3వ అతిపెద్ద సహజ వనరుల నిల్వలను 2వ అతిపెద్ద సహజవాయువు నిల్వలు కలిగి ఉంది. బొగ్గు, రాగి, సీసం, యురేనియం వంటి ఖనిజ సంపద పుష్కలంగా ఉన్న దేశం. ఇవికాక కుంకుమ పువ్వు, పిస్తా వంటి వ్యవసాయ ఉత్పత్తులలో కూడా అగ్ర స్థానంలో ఉంది. ఇరాన్‌లో 208.6మిలియన్ల చమురు నిల్వలు ఇతర ఖనిజాలు, సుమారు 2కోట్ల, 20లక్షల టన్నుల స్వచ్ఛమైన బంగారంఉన్నాయి. వీటి విలువ27.30 ట్రిలియన్ డాలర్లు. ఇరాన్ విస్తారమైన సహజ వనరులను తన అవసరాలకు



వినియోగించుకునే విధానాలు అమలు జరిపేలా ఆ దేశపాలకులను అమెరికా ప్రభావితం చేసింది. అమెరికా మద్దతుతో కొనసాగిన షామొహమ్మద్రెజాపహ్లవి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటుకి షానిరంకుశపాలన, అమెరికా అనుకూల విధానాలు, తీవ్ర ఆర్థిక అసమానతలు, ఇస్లామిక్ సంప్రదాయాలను విస్మరించడం, అవినీతి, సామాజిక అణచివేత కారణాలుగా ఉన్నాయి. చమురు కార్మికులు సమ్మెలు చేశారు. ప్రవాసంలో ఉన్న ఖొమేని షా పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపర్చాడు. ప్రజల తిరుగుబాటుతో షా ప్రభుత్వం కూలిపోయింది. 1979 ఇరాన్ విప్లవం తర్వాత అమెరికా దోపిడీ ప్రయోజనాలకు ఆటంకం ఏర్పడింది. ఫలితంగా ఇరాన్ పట్ల అమెరికా శత్రుత్వ వైఖరి చేపట్టింది. రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఇరాన్ అణుశుద్ధి కార్యక్రమం మధ్యప్రాచ్యంలో ప్రభావం చూపింది. తనపెంపు బిడ్డ ఇజ్రాయెల్‌కు, తన ప్రయోజనాలకు ఇరాన్ ఆటంకంగా ఉందని అమెరికా భావించింది. దానిపై దాడి చేయడానికి ఉగ్రవాదానికి ఇరాన్ మద్దతు ఇస్తుందనే ప్రచారం అమెరికా ప్రారంభించింది. 1985 నుంచి ఇజ్రాయెల్‌ను ఇరాన్‌పై ఘర్షణకు సిద్ధమైంది. 2018లోసంయుక్త సమగ్ర కార్యాచరణ ప్రణాళిక నుండి వైదొలిగిన అమెరికా, ఇరాన్‌పై అనేక ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు ఇరాన్ ఆర్థికవ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఇరానియని యాల కరెన్సీ విలువ గణనీయంగా తగ్గింది. ఇరాన్‌తో వ్యాపా రంచేసే అనేక అంతర్జాతీయ బ్యాంకులు భారీ జరిమానాలు చెల్లించాయి. అన్ని ప్రధాన యూరోపియన్ కంపెనీలు అమెరికాకు భయపడి ఇరాన్‌తో వ్యాపారం మానివేశాయి. ఫలితంగా ఆర్థికంగా ఇరాన్‌బాగా దెబ్బతిన్నది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇరాన్, రష్యా, చైనాలతో అనేక ఒప్పం దాలు చేసుకుంది. 2025 జనవరిలో రష్యాతో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేయగా, చైనాతో 2021లో25 సంవత్సరాల సహకార ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందాలు సైనిక, ఆర్థికసహకారానికి పెంచుకోవడానికి ఇరాన్‌కు తోడ్పడ్డాయి. రష్యాప్రధానంగా ఇరాన్‌కు ఆయుధ సరఫరాదారుగా ఉంది. చైనాతో కుదిరిన 25 ఏళ్ల సమగ్ర సహకార ఒప్పందం ద్వారా చైనానుంచి ఇరాన్ ఇంధన రంగానికిభారీగా నిధులు పొందింది. చైనా, రష్యా, ఇరాన్, ఉత్తరకొరియా దేశాలు, పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆధిపత్యాన్ని ముఖ్యంగా అమెరికా ఆంక్షలను సవాలు చేయడానికి ఒకభౌగోళిక, రాజకీయ కూటమిగా ఏర్పడ్డాయి. ఈ ఒప్పందాలవల్ల షాంఘై సహకార సంస్థ బ్రిక్స్ద్వారా సహకారాన్నిపొందుతున్నాయి. రష్యా, చైనాలతో ఒప్పందాలు తనప్రపంచ ఆధిపత్య విధానాలకు ప్రమాదంగా అమెరికా భావించింది. తన ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా ఉన్న ఇరాన్‌ను దెబ్బతీయడానికి ఆ దేశంపై దాడులు ప్రారంభించింది. 2003లో, 2024లో, 2025లో ఇరాన్‌పై దాడులు చేసింది. వెనిజులాపై దాడి తర్వాత ఇరాన్‌ను అమెరికా లక్ష్యంగా చేసుకుంది. దానిపై దాడి చేయడానికి కుంటిసాకులు ప్రచారంచేయడం ప్రారంభించింది. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తున్నదని దానివల్ల ప్రపంచానికి, అమెరికాకు ప్రమాదమని పేర్కొంది. యురేనియంశుద్ధిని, అణ్వాయుధాల తయారీని మానుకోవాలని అందుకుచర్చలకు రావాలని, చర్చలకురాకపోతే ఇరాన్‌పై దాడిచేస్తామని బెది రించింది. ఇరాన్ చర్చలకు ఆమోదం తెలిపింది. రెండు దేశాల మధ్య చర్చలు జరిగాయి. జెనీవాలో రెండవ రౌండ్‌చర్చల జరగాల్సిఉంది. ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణదాడిని ప్రపంచ ప్రజలూ ఖండించి దానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి. •

# జల్‌జీవన్ మిషన్ రెండేళ్లు పొడిగింపు




## అదనంగా రూ.1.15 లక్షల కోట్లు కేంద్ర ఆర్థిక సాయం

### రూ.4,474కోట్లతో 2 మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులు

### రూ.3,839 కోట్లతో బడ్నావర్- తిమర్వాణి ఎన్‌హెచ్ విస్తరణ

### మదురై ఎయిర్‌పోర్టు ఇక అంతర్జాతీయ విమానాశ్రయం

### కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు: మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, మార్చి 10:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ గడువును 2028 వరకు పొడిగిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం రూ.1.51 లక్షల కోట్లు అదనంగా కేంద్రం సాయం అందించనుంది. ఈ మేరకు జల్ శక్తి మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

రూ.4,474 కోట్లతో పశ్చిమబెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని రెండు మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులు చేపట్టాలన్న ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు 192 కిలోమీటర్ల మేర అంటే సైంథియా- పకూర్, సంత్రాగచి -ఖరగ్ పూర్ మార్గాలలో నాల్గవ లైన్ నిర్మిం చనున్నారు. ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌లో భాగంగా బడానవర్- పెట్లవాడ్- థండ్లా- తిమర్వాణి సెక్షన్ జాతీయ రహదారిని నాలుగు వరుసలు (గ్రీన్‌ఫీల్డ్ కారిడార్)గా అభివృద్ధి చేయడానికి రూ. 3,839.42 కోట్లతో ఎన్‌హెచ్ఐఎ రూపొందించిన ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ జాతీయ రహ దారిని హైబ్రిడ్ అన్యుటి మోడ్‌లో అభివృద్ధి చేయాలని ప్రతిపా దించారు. ఈ కారిడారి అభివృద్ధి చేయడంతో ఉజ్జయిని-తిమర్వాణి ఇం టర్‌చేంజ్ కనెక్టివిటీకి దోహదపడనుంది.

అలాగే ఢిల్లీ- ముంబై ఎక్స్‌ప్రెస్‌లోని ఢిల్లీ - ఫరీదాబాద్- బల్లాభ్‌ఘర్-సోహ్నాపూర్ నుంచి జెవార్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ నిర్మాణానికి రూ.3,630.77 కోట్లతో రూపొం దించిన ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమో దం తెలిపింది. తమిళనాడులోని మదురై ఎయిర్ పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటిం చాలన్న ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. మధురై విమా నాశ్రయం తమిళనాడులోని పురాతన విమానాశ్ర యాలలో ఒకటి. ఇది దక్షిణ తమిళనాడుకు కీలకమైన ప్రవేశ ద్వారంగా పనిచేస్తుంది. పర్యాటకం, తీర్థయాత్రలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది, తద్వారా ఈ ప్రాంతం వృద్ధికి దోహదపడుతుంది. మధురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ హోదాకు పెంచడంవల్ల ప్రాంతీయ కనెక్టివిటీ పెరుగుతుంది, వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ ప్రాంతంలో ఆర్థిక అభి వృద్ధిని ప్రోత్సహిస్తుంది. అంతర్జాతీయ యాత్రికులను, వ్యాపారాలను ఆకర్షించేవిమా నాశ్రయం సామర్థ్యంనగరం చారి త్రక ప్రాముఖ్యతకు అనుగుణంగా ఉంటుంది.

# వంటగ్యాస్ కోసం బారులు తీరిన కస్టమర్లు

**న్యూఢిల్లీ, మార్చి 10:** డిమాండ్ స్వల్పంగా పెరిగినా, సరఫరా గొలుసులు బిగుసుకుపోయినా మార్కెట్లు స్పష్టమైన ఒత్తిడితో స్పందిస్తాయి. ప్రస్తుతం ఇరాన్‌లో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సిఆర్) సహా అనేక పట్టణాలు, నగరాల్లోని ఎల్పీజీ ఏజెన్సీల బయట ఆ ఒత్తిడి కనిపిస్తున్నది. నోయిడాలోని సెక్టార్ 22లో ఓ భారత్ గ్యాస్ ఏజెన్సీ వెలుపల ఖాళీ సిలిండర్లు పట్టుకుని పెద్ద సంఖ్యలో ప్రజలు బారులు తీరి నిలబడి ఉన్న దృశ్యాలు సోమవారం ఉదయం కనిపించాయి. అదే విధంగా ఉత్తర ప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలోని బిస్వాన్ గ్రామంలో ఓ గ్యాస్ ఏజెన్సీ బయట వందలాది మంది ప్రజలు ఖాళీ సిలిండర్లతో నిలుచున్న దృశ్యాల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎల్పీజీ సిలిండర్ల కోసం కొన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు గ్యాస్ ఏజెన్సీల వెలుపల బారులుతీరి నిలబడుతున్నట్లు వార్తలు వస్తుండగా దేశంలో ఎక్కడా ఎల్పీజీ సంక్షోభం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇరాన్ యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు వస్తున్న వార్తలతో ప్రజల్లో ఏర్పడిన భయాందోళనలను సొమ్ము చేసుకునేందుకు కొందరు గ్యాస్ సరఫరాదారులు కృత్రిమ కొరతను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. గ్యాస్ ఏజెన్సీలో స్టాక్ లేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో రూ. 1,500 ఇచ్చి ఎల్పీజీ సిలిండర్ కొనవలసి వచ్చిందని ఉత్తరప్రదేశ్‌లోని ఓ చిన్న పట్టణానికి



చెందిన మహిళ ఒకరు తెలిపారు. రంజాన్ మాసం కావడంతో ఎల్పీజీ అత్యవసరమని ప్రతాప్‌గఢ్ జిల్లాకు చెందిన ఆ గృహిణి చెప్పారు. గత నాలుగైదు రోజులుగా ప్రజలు భయాందోళనలతో ఎల్పీజీని కొనుగోలు చేస్తున్నట్లు దక్షిణ ఢిల్లీలోని ఇండేన్ గ్యాస్‌కు చెందిన సిలిండర్ డెలివరీ ఉద్యోగి ఒకరు చెప్పారు. గతవారం ఎల్పీజీ సిలిండర్ ధరను పెంచిన కేంద్రం సిలిండర్ రీబుకింగ్ నిబంధనలను కఠినతరం చేసింది. ఎల్పీజీ సిలిండర్లపై ఆంక్షలు పెంచిన దరిమిలా హైదరాబాద్, రాంచీ, కోల్‌కతా, గోవా తదితర నగరాల్లో కూడా ఎల్పీజీ కోసం ప్రజలు బారులు తీరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. వంటగ్యాస్ అక్రమ నిల్వను నిరోధించి అందరికీ సమానంగా పంపిణీ జరిగే లక్ష్యంతో ఎల్పీజీ సిలిండర్ కనీస వెయిటింగ్ కాలాన్ని 21 రోజుల నుంచి 25 రోజులకు ప్రభుత్వం పెంచినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రెండు సిలిండర్లు ఉన్న వారికైతే లాక్ ఇన్ పీరియడ్‌ను 30 రోజులకు పెంచింది.

ప్రపంచ ముడి చమురు బ్యారెల్ ధర 130 డాలర్లు దాటేంతవరకు దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు నిలకడగా ఉంటాయని వర్గాలు చెప్పాయి. బ్యారెల్ చమురు ధర 100 డాలర్ల సమీపంలో స్థిరపడవచ్చని ప్రస్తుత అంచనాలు సూచిస్తున్నట్లు పేర్కొన్నాయి. దేశంలో ఏ పెట్రోల్ పంపు వద్ద పెట్రోల్, డీజిల్ కొరత లేదని, సరఫరా కూడా సజావుగా సాగుతున్నదని తెలిపాయి. ముడి చమురు సరఫరాకు అంతరాయాన్ని నివారించేందుకు హార్ముజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాలపై కేంద్రం దృష్టి కేంద్రీకరించినట్లు వివరించాయి.

### వాణిజ్యసిలిండర్ల కొరతతో హోటల్ పరిశ్రమకు ముప్పు

### ప్రధాన నగరాల్లో తాత్కాలిక మూసివేత

దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పలు ప్రాంతాల్లో ఇంధన కొరత ఆందోళన కలిగిస్తున్నది. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబైలో 20 శాతం హోటళ్లు, రెస్టారెంట్‌లు మూతపడ్డాయి. ఈ విషయాన్ని ముంబై హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో నగరంలోని సగం హోటళ్లు మూతపడతాయని పేర్కొన్నది. ముంబై మాత్రమే కాదు, గత రెండు రోజులుగా దేశంలోని పలు ప్రధాన నగరాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత ఏర్పడింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై నగరాల్లో ఇప్పటికే కొన్ని హోటళ్లలో వంటగ్యాస్ అందుబాటులో లేక తాత్కాలికంగా మూసివేస్తున్నారు. సిలిండర్ల కొరతవల్ల తమ వ్యాపారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ఒక్కో వాణిజ్య సిలిండర్‌ను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతం ఉన్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. ఇక వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వ శాఖ ఓ కమిటీని వేసింది. మన దేశంలో ఏటా 31.3 మిలియన్ టన్నుల వంటగ్యాస్‌ను వినియోగిస్తున్నారు. ఇందులో 62 శాతం దిగుమతుల నుంచి వచ్చేదే. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో ఈ దిగుమతులపై ప్రభావం పడింది. అయితే ప్రస్తుతం మన వద్ద సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులోనే ఉన్నాయని కేంద్రం వెల్లడించింది.


## యూరోప్ దేశాలను కలవరపరిచిన ఖగోళ అగ్నిగోళం

**ప్యారిస్, మార్చి 10:** యూరప్‌లోని పలు దేశాల ప్రజలను మార్చి 8వ తేదీ సాయంత్రం ఒక అద్భుత దృశ్యం ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఆకాశంలో అత్యంత కాంతివంతమైన అగ్నిగోళం ఒకటి వేగంగా ప్రయాణిస్తూ కనిపించింది. దాదాపు ఆరు సెకన్ల పాటు వెలుగులు చిమ్ముతూ ప్రయాణించిన ఈ అగ్నిగోళం చివరకు గాలిలోనే ముక్కలై భూమిపై పడింది. బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీ, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో ఇది స్పష్టంగా కనిపించింది. శాస్త్రవేత్తల ప్రాథమిక అంచనా ప్రకారం ఇది కొన్ని మీటర్ల వ్యాసం కలిగి ఉంది. జర్మనీలోని కోబ్లెంజ్ ప్రాంతంలో దీని శకలాలు పడ్డాయి. ఒక ఇంటి కప్పును చీల్చుకుంటూ సుమారు ఫుట్‌బాల్ పరిమాణంలో ఉన్న రాయి లోపలికి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. గాలిలోనే పేలిపోవడంతో భూమిపైకి వచ్చేసరికి చిన్న చిన్న ముక్కలుగా మారిపోయిందని నిపుణులు చెబుతున్నారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (యుఎస్ఎ), ఇతర పరిశోధనా సంస్థలు ఈ అగ్నిగోళం ప్రయాణించిన మార్గాన్ని విశ్లేషిస్తున్నాయి. ఇది ఉల్క కావచ్చని పలువురు భావిస్తున్నారు. ఇవి సాధారణంగా ప్రతి కొన్ని వారాలకు ఒకసారి భూ వాతావరణంలోకి వస్తుంటాయని, అయితే ఇంత ప్రకాశవంతంగా కనిపించడం అరుదని వారు పేర్కొంటున్నారు. సూర్యాస్తమయం సమయంలో వెలుతురు ఎక్కువగా ఉన్న దిశ నుంచి ఇది రావడంతో భూమిపై ఉండే టెలిస్కోపులు దీనిని ముందుగా గుర్తించలేకపోయాయని సమాచారం.

## ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, మార్చి 10:** ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లలో క్రిమీలేయర్ విధానం అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ జోయ్ మల్య బాగ్చిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతిస్పందనల కోరుతూ నోటీసులు జారీ చేసింది. మాజీ బ్యూరోక్రాట్ జ్ఞానేంద్ర కుమార్ ఖరే ఈ పిటిషన్ దాఖలు చేయగా, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఎన్‌హెచ్ ఆర్‌సిలను ప్రతివాదులుగా చేర్చారు. విచారణ నాలుగు వాయిదాలు వాయిదా వేసింది.

# ఏ ఒక్క ఓటరును జాబితానుంచి తొలగించం: సిఇసి



**కోల్‌కత్తా, మార్చి 10:** అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరును కూడా ఓటర్ జాబితా నుంచి తొలగించబోమని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం సీఈసీ బృందం పశ్చిమబెంగాల్‌లో పర్యటించింది. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశాల అనంతరం జ్ఞానేశ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడటమే ఎన్నికల సంఘం (ఈసిఐ) మొదటి ప్రాధాన్యమని ఆయన చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ఓటర్ల పేర్లు ఎప్పటికీ తొలగించబోమని స్పష్టంచేశారు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారమే అన్ని రాష్ట్రాలో ప్రత్యేక సమగ్రసవరణ అమలవుతుందన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడటం, అర్హులైన వారి పేర్లు ఆ జాబితాలో ఉండేలా చూడటమే సర్ బాధ్యత అని చెప్పారు. ఇక్కడ ఎన్నికలు ఎన్ని దశల్లో జరుగుతాయనేది రాష్ట్రప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో చేపట్టే చర్యలపైన ఆధారపడి ఉంటుందన్నారు. బెంగాల్ ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఓటర్లపైనా, ఎన్నికల అధికారులపైనా రాజకీయ నేతలు ఎలాంటి బెదిరింపులకు పాల్పడినా సహించేది లేదని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 80 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిల్లో దాదాపు 61 వేలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని చెప్పారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించేందుకు రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను అమలుచేయనున్నట్లు తెలిపారు.

# మురిద్ ఎయిర్‌బేస్‌ను నేలమట్టం చేసిన పాకిస్థాన్



**కరాచి, మార్చి 10:** భారత వైమానిక దళం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ధాటికి పాకిస్థాన్‌లోని కీలకమైన మురిద్ ఎయిర్‌బేస్ కోలుకోలేని విధంగా దెబ్బతిన్నట్లు తాజా శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. చక్వాల్ సమీపంలోని ఈ వ్యూహాత్మక ఎయిర్‌బేస్‌లో ధ్వంసమైన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను పునరుద్ధరించడానికి పాక్ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. గతనెల 28నఅందిన చిత్రాల ప్రకారం, అక్కడ మరమ్మతులకు బదులుగా భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తున్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ప్రముఖ శాటిలైట్ ఇమేజరీ అనలిస్ట్ డామియన్ సైమన్ విశ్లేషణ ప్రకారం, ఈ భవనాన్ని ప్రస్తుతం పూర్తిగా నేలమట్టం చేశారు. కేవలం పైకప్పు మాత్రమే కాకుండా, భవనం లోపలి ప్రధాన నిర్మాణం తీవ్రంగా దెబ్బతినడం వల్లే దీనిని రిపేర్ చేయడం అసాధ్యమని పాక్ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లుతెలుస్తోంది. అంతకు ముందు ఈభవనాన్ని టార్పాలిన్ షీట్లతో కప్పి ఉంచిన ప్పటికీ, ఇప్పుడు అక్కడకేవలం శిథిలాలు మాత్ర మే కనిపిస్తున్నాయి. 2025మే 10న తెల్లవా రుజామున భారత వైమానిక దళం మెరుపు దాడి చేసిన 10 పాక్ ఎయిర్‌బేస్‌లలో మురిద్ ఒకటి. ఇక్కడినుంచే డ్రోన్లకార్యకలాపాలు సాగుతుంటాయని అంచనా. భారత గగనతలంనుంచే రఫేల్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగించిన స్కాల్ప్ వంటి శక్తివంతమైన ఎయిర్ టు సర్ఫేస్ క్షిపణుల వల్లే పాక్ కు ఇంతటి భారీ అంతర్గత నష్టం సంభవించి ఉండవచ్చని రక్షణ నిపుణులు భావిస్తున్నారు.

# చైనా పెట్టుబడులకు కేంద్రం పచ్చజెండా

## ఎఫ్‌డిఐల నిబంధనల సవరణకు మంత్రివర్గం ఆమోదం

**న్యూఢిల్లీ, మార్చి 10:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో సరిహద్దు పంచుకునే దేశాల నుండి వచ్చే పెట్టుబడుల నిబంధనలను సరళతరం చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 2020లో గాల్వాన్ లోయ ఉద్రిక్తతల తర్వాత విదేశీ శక్తులను ముఖ్యంగా చైనాను నిరోధించడానికి 'ప్రెస్ నోట్ 3' (పిఎన్3) నిబంధనను తీసుకువచ్చారు. దీని ప్రకారం చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి పొరుగు దేశాల నుండి వచ్చే ప్రతి పైసా పెట్టుబడికి ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనసరి చేశారు. అయితే, తాజా సవరణతో ఈ కఠినమైన ఆంక్షలను సడలిస్తూ కొన్ని రకాల పెట్టుబడులను, ముఖ్యంగా తక్కువ మొత్తంలో ఉండే పెట్టుబడులను 'ఆటోమేటిక్ రూట్' ద్వారా అనుమతించాలని కేంద్రం నిర్ణయంచింది. దీనివల్ల ఇకపై కొన్ని నిర్దేశిత రంగాలలో, అలాగే పరిమితులకు లోబడి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వ అనుమతి కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. ఈ నిబంధన ప్రకారం భారత్‌తో భూసరిహద్దు ఉన్న దేశాలకు చెందిన కంపెనీలు లేదా ఆ దేశాల షేర్ హోల్డర్లు ఉన్న సంస్థలు భారత్‌లో ఏ రంగంలోనైనా పెట్టుబడి పెట్టాలంటే తప్పనిసరిగా ప్రభుత్వఅనుమతి తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ నిబంధనల్లో కొంత సడలింపు కల్పించినట్లు వర్గాలు చెబుతున్నాయి.

**భారత్‌లో చైనా ఎఫ్‌డీఐ వాటా తక్కువే**

భారత్‌లో మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో చైనా వాటా చాలా తక్కువగా ఉందని అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. 2000 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ వరకు వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో చైనా వాటా కేవలం 0.32 శాతం మాత్రమే. విలువ పరంగా ఇది సుమారు 2.51 బిలియన్ అమెరికన్ డాలర్లుగా నమోదైంది. ఈ కారణంగా ఎఫ్‌డీఐ పరంగా చైనా భారత్‌లో 23వ స్థానంలో ఉంది.

# మహిళలపై వివక్ష..యుసిసినే మేలు

**న్యూఢిల్లీ, మార్చి 10:** ముస్లిం మహిళల పట్ల వివక్ష చూపుతున్న 1937నాటి షరియత్ చట్ట నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. సిజె జస్టిస్‌సూర్యకాంత్, జస్టిస్‌ఆర్.మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీల ధర్మాసనం విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) అమలుకు సమయం ఆసన్నమైందన్నారు. మహిళలకు ఆస్తి వారసత్వంలో వివక్ష జరుగుతోందన్న వాదనతో ధర్మాసనం ఏకీభవిస్తూ,అయితే, దీనిపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యత చట్టసభలకే వదలివేయడం ఉత్తమమని పేర్కొంది. మహిళల హక్కులు, వివక్ష తదితర సమస్యలన్నింటికీ యూనిఫాం సివిల్ కోడ్ ఒక్కటే శాశ్వత పరిష్కారమని, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం దీనిని రూపొందించే అధికారం పార్లమెంటుకు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్ నౌకలను ముంచేయడం సరదాగా ఉంది: ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 10:** ఇరాన్ నౌకలను ముంచడం సరదా అనిపించిందని తమ సైన్యం చెప్పిందని, అదే సురక్షితమని కూడా వారు తనతో చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. మా సైన్యం చెప్పింది కూడా తనకు నిజమే అనిపించిందన్నారు. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం అనంతరం ఇప్పటి వరకు 5 వేల లక్ష్యాలను ఛేదించామని ఆయన వెల్లడించారు. తమ దాడులతో ఇరాన్ క్షిపణి సామర్థ్యం 10 శాతానికి పడిపోయిందని అన్నారు. మూడున్నర రోజుల్లో ఇరాన్‌కు చెందిన 46 అగ్రశ్రేణి నౌకలను అమెరికా మిలిటరీ ముంచివేసిందన్నారు. ఇరాన్ డ్రోన్, క్షిపణి సామర్థ్యం పూర్తిగా ధ్వంసమవుతోందని అన్నారు. 46ఇరాన్ నౌకలను ముంచివేశామంటే విశ్వసించగలరా అని అన్నారు. అయితే ఒక విషయంలో మన సైన్యం తీరు తొలుత తనకు నచ్చలేదని, దాంతో వెంటనే సైనికాధికారులతో మాట్లాడానని అన్నారు. ధ్వంసమైన నౌకలు ఎలాంటివని తాను అడిగానని, అవి ఇరాన్ అగ్రశ్రేణి నౌకలు అని తమ సైన్యం చెప్పిందన్నారు. అలాంటప్పుడు వాటిని స్వాధీనం చేసుకుని మన కోసం ఉపయోగించుకోవచ్చు కదా, ఎందుకు ముంచివేశారని తాను వారిని ప్రశ్నించానని తెలిపారు. వాటిని ముంచడం సరదాగా అనిపించిందని, అలా చేయడమే సురక్షితమని వారు సమాధానం చెప్పారని అన్నారు.

## పుతిన్‌తో ట్రంప్ సుదీర్ఘ చర్చలు..



**వాషింగ్టన్, మార్చి 10:** అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఫోన్‌లో దాదాపు గంటపాటు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఇరాన్ యుద్ధం, ఉక్రెయిన్ సంక్షోభం తీవ్రతపై ఇరుపక్షాల నేతలు విస్తృతంగా చర్చించారు. ట్రంప్ చొరవతోనే ఈ ఫోన్ కాల్ సంభాషణ జరిగిందని రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి యూరి ఉషకోవ్ తెలిపారు. ఈ సంభాషణ ఎంతో నిర్మాణాత్మకంగా సాగిందని, ఇది ఇరు దేశాల నేతల మధ్య జరిగే సాధారణ చర్చల వంటిదేనని ఆయన వివరించారు. మరోవైపు, ట్రంప్ మాట్లాడుతూ, నేను పుతిన్‌తో చాలా మంచి సంభాషణ జరిపాను. ఉక్రెయిన్ గురించి చర్చించాం. అది ఎప్పటికీ అంతం కానియట్లుంది. కానీ, ఈ అంశంపై సానుకూల చర్చ జరిగింది. ఉక్రెయిన్, మధ్యప్రాచ్యం గురించి చర్చించాం. ఈ సమస్యల పరిష్కారానికి పుతిన్ సాయం చేయాలని కోరుకుంటున్నానని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుతిన్ ఇరాన్‌కు రష్యా బేషరతు మద్దతు కొనసాగుతుందని ట్రంప్‌కు తేల్చిచెప్పారు. పశ్చిమ ఆసియాలో యుద్ధం ఇలాగే కొనసాగితే ప్రపంచచమురు, గ్యాస్ సరఫరాలు దెబ్బతిని, ధరలలో పెనుమార్పులు వస్తాయని పుతిన్ హెచ్చరించారు. ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ జరిపిన ఉమ్మడి దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన విషయం తెలిసిందే.

## యుద్ధం ముగించాలంటూ ట్రంప్ సలహాదారుల ఒత్తిడి



**వాషింగ్టన్, మార్చి 10:** ఇరాన్ తో కొనసాగుతున్న యుద్ధం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. యుద్ధాన్ని సాగదీయడం వల్ల రాజకీయంగా భారీ మూల్యం చెల్లించు కోవాల్సి వస్తుందని భయపడుతున్న ఆయన సలహాదారులు యుద్ధం నుంచి వెంటనే వైదొలగాలని ట్రంప్‌పై ఒత్తిడి పెంచుతున్నారు. సలహాదారుల ఆందోళనకు ప్రధానంగా రెండు కారణాలు కనిపి స్తున్నాయి. యుద్ధం సుదీర్ఘంగా కొనసాగితే అమెరికా ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందని, ఇది రాబోయే ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి గట్టి దెబ్బ కొడుతుందని వారు హెచ్చరిస్తున్నారు. చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరడంతో అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. సామాన్యుడిపై పడుతున్న ఈ ఆర్థికభారం ట్రంప్ పాపులారిటీని దెబ్బతీస్తోంది. సలహాదారుల నుంచి ఒత్తిడి వస్తున్నప్పటికీ ట్రంప్ మాత్రం బయటపడకుండా తనదైన శైలిలో స్పందించారు. మేము షెడ్యూల్ కంటే ముందే ఉన్నాం. మిలిటరీ పరంగా సాధించాల్సిన లక్ష్యాలను దాదాపుగా పూర్తి చేశాం. ఈ యుద్ధం చాలా త్వరగా ముగిసిపోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే, సంతృప్తికరమైన విజయం సాధించకుండా ఆయన వెనక్కి తగ్గేలా కనిపించడంలేదని మరికొందరు అధికారులు అభిప్రా యపడుతున్నారు. ఇదే సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్‌గా హార్డ్‌లైనర్ మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. ఒకవేళ ఆయన తమ డిమాండ్లకు లొంగకపోతే, ఆయనపై కూడా దాడులు చేసేందుకు ట్రంప్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## యాక్టివేట్ అయిన ఇరాన్ స్లీపర్ సెల్స్..

**టెహ్రాన్, మార్చి 10:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత ఆ దేశం తన స్లీపర్ సెల్స్‌ను మేల్కొలిపేందుకు ప్రయత్నిస్తోందని నిఘా నివేదికలు ప్రస్తావించాయి.ఇరాన్ నుంచి వెలువడిన కొన్ని రహస్య ఎన్‌క్రిప్టెడ్ సందేశాలను అమెరికా నిఘా సంస్థలు అడ్డుకున్నాయి. ఇవి విదేశాల్లో ఉన్న ఇరాన్ ఏజెంట్లకు దాడులు చేయాలని ఇచ్చే సంకేతాలు కావచ్చని ఏజెన్సీలు చెపుతున్నాయి. గతనెల 28న ఖమేనీ మృతి చెందిన కొద్దిసేపటికే ఇరాన్ నుంచి ఒక కొత్త రేడియో స్టేషన్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో సందేశాలు వెలువడ్డాయి. ఇవి ఇంటర్నెట్ లేదా సెల్ ఫోన్ నెట్‌వర్క్ వాడకుండా, కేవలం క్లోజ్డ్ గ్రూపులకు మాత్రమే అర్థమయ్యే కోడ్ లాంగ్వేజ్‌లో ఉన్నాయి. వీటి ద్వారా విదేశాల్లో ఉన్న తమ ఏజెంట్లకు ఇరాన్ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉందని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దీనివల్ల అమెరికా, యూరప్ దేశాల్లోని భద్రతా సంస్థలు అప్రమత్త మయ్యాయి. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని, ఇరాన్ గనుక ఏవైనా పిచ్చి వేషాలు వేయాలని చూస్తే ఆ దేశం మ్యాప్‌లో లేకుండా పోతుందని హెచ్చరించారు. యుద్ధం దాదాపు ముగిసిందని, ఇరాన్ గగనతలం, నౌకాదళం పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ, అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచాలని స్థానిక పోలీసు విభాగాలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

## రెండురోజుల యుద్ధానికి రూ.4.65 లక్షలకోట్ల ఖర్చు



**వాషింగ్టన్, మార్చి 10:** ఇరాన్‌పై అమెరికా జరుపుతున్న సైనిక చర్య అత్యంత ఖరీదుగా మారింది. యుద్ధం మొదలైన తొలి రెండు రోజుల్లోనే కేవలం ఆయుధాల కోసం అమెరికా ఏకంగా 5.6 బిలియన్ డాలర్లు భారత కరెన్సీలో సుమారు రూ. 4.65 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు అమెరికా పత్రికలు అంచనా వేస్తున్నాయి. యుద్ధం త్వరలోనే ముగియవచ్చని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచిస్తున్నప్పటికీ, ఈ భారీ వ్యయం వాషింగ్టన్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. అమెరికా కాంగ్రెస్‌కు అందించిన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేసినట్లు పత్రికలు పేర్కొంటున్నాయి. ఇది కేవలం దాడుల్లో వాడిన అత్యాధునిక ఆయుధాల విలువ మాత్రమే. సైనిక బలగాల తరలింపు, విమానాలు, నౌకల నిర్వహణ వంటి ఇతర కార్యాచరణ ఖర్చులను ఇందులో కలపలేదు. ఈ స్థాయిలో దాడులు కొనసాగితే, అమెరికా వద్ద ఉన్న కీలకమైన ఆయుధ నిల్వలు వేగంగా తరిగిపోతాయని చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఈ సైనిక చర్యను కొనసాగించేందుకు అదనపు నిధులు కోరే క్రమంలోనే పెంటగాన్ ఈ వివరా లను కాంగ్రెస్‌తో పంచుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఈ యుద్ధంలో ఏడుగురు అమెరి కన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. కువైట్‌లో ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిలో ఆరుగురు, సౌదీ అరేబి యాలో జరిగిన దాడిలో గాయపడి మరొకరు మరణించినట్లు అమెరికా అధికారులు ధ్రువీకరించారు.

## ఇరాన్ ఫైనాన్షియల్ హాబ్‌పై ట్రంప్ నజర్: అడ్డుకుంటున్న అడ్వైజర్లు



**వాషింగ్టన్, మార్చి 10:** పశ్చిమాసియాలోని పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ తీరానికి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపంపై ఇపుడు ట్రంప్ దృష్టిపడింది. 20 చదరపు కిలోమీటర్ల అతి తక్కువ వైశాల్యంతో ఉన్నప్పటికీ ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు ఇది వెన్నెముకగా అమెరికా అంచనా వేసింది. ఇరాన్ చమురు ఎగుమతుల్లో 90శాతం వాటా దీనిదే. అమెరికా ఆంక్షలు విధించినప్పటికీ, 2024లో ఈ ద్వీపం నుంచి చమురు ఎగుమతుల ద్వారా ఇరాన్ 78 బిలియన్ డాలర్లను ఆర్జించింది. దీన్ని బట్టి ఇరాన్ ఆర్థిక వ్యవస్థ నడవాలంటే ఇక్కడి చమురు ఎగుమతులే కీలకమన్న విషయం అర్థమవుతున్నది. ఖర్గ్‌లోని లోడింగ్ టర్మినళ్లు రోజుకు ఏడు మిలియన్ బ్యారెళ్ల చమురును హ్యాండిల్ చేయగలవని నివేదికలు చెప్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలుకావడానికి ముందు ఖర్గ్ నుంచి రోజుకు 1.5 మిలియన్ బ్యారెళ్ల చమురును ఎగుమతి చేసిన ఇరాన్ ఘర్షణలు మొదలైన తర్వాత ఈ ఎగుమతులను 4 మిలియన్ బ్యారెళ్లకు పెంచింది. యుద్ధానికి అవసరమైన నిధుల కోసమే ఇలా చేసినట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఖర్గ్‌లో ఉత్పత్తి అవుతున్న చమురు ఎగుమతితో ఆర్థికంగా బలోపే తమవుతున్న ఇరాన్‌ను దీర్ఘకాలంలో దెబ్బతీయలేమని ట్రంప్ గ్రహించినట్టు వినికిడి. ఈ క్రమంలోనే ఆ ద్వీపంపై దాడులు జరిపి ఇరాన్‌ను వ్యూహాత్మకంగా దెబ్బతీయాలని ఆయన యోచిస్తున్నట్టు సమాచారం. ఖర్గ్‌పై దాడులు చేస్తే ఇరాన్‌ను దెబ్బతీయవచ్చన్న విషయం నిజమైనప్పటికీ, ఈ చర్య అటు అమెరికాకు, ఇటు ఇజ్రాయెల్‌కు కొత్త ఇబ్బందులు తీసుకురావొచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇప్పటికే చమురు ధరలు బ్యారెల్‌కు 110నుంచి 115 డాలర్లకు చేరుకొన్నాయి. ఇప్పుడు ఖర్గ్‌పై దాడులు జరిగితే ఈ ధరలు మరో 10 డాలర్ల మేర పెరిగే ప్రమాదముంది. అంతేకాకుండా ఖర్గ్ ద్వీపం స్వాధీనానికి యూరోప్, ఇతర ఆసియా దేశాలు కూడా తీవ్రంగా వ్యతిరేకించే ప్రమాదం ఉంది. ఈలోపు ఇరాన్‌యుద్ధం ముగించాలని సలహదారులు ఒత్తిళ్ల తీసుకురావడంతో ట్రంప్ ఇపుడు కొంతమేర వెనుకంజవేసినట్లు తెలుస్తోంది.

# అవయవ దానాల ప్రోత్సాహానికి సరళీకృత విధివిధానాలు అవసరం



## సమీక్షలో అధికారులను ఆదేశించిన
## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అవయవ దానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలను సరళీకృతం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు మంత్రి దామోదర రాజనర్సింహ. ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్(టిహెచ్‌ఓటి) విధానం రూపకల్పన కోసం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సచివాలయంలోని తన కార్యాలయంలో మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమీక్షలో అవయవ మార్పిడి చికిత్సలపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమా న్యాలతోనూ చర్చించారు. అవయవ దానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలను సరళీకృతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అవయవ మార్పిడి చికిత్సల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఆర్గాన్ డొనేషన్స్ యాక్ట్ సమర్థవంతంగా అమలయ్యేలా అవసరమైన సమగ్ర పాలసీ రూపకల్పనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు , ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ప్రైవేటు ఆసుపత్రులలో అవయవ మార్పిడి చికిత్సల ధరలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులకు సైతం అవయవ మార్పిడి చికిత్సలకు అయ్యే ఖర్చును భరించే విధంగా ధరల నియంత్రణ ఉండాలని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు మంత్రి సూచించారు. మంత్రి సూచనలకు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయి. దాతలు ఇచ్చిన అవయవాలు వృధా కాకుండా ఆస్పత్రులు ప్రత్యేక చర్యలను చేపట్టాలన్నారు. ఇతర దేశాల నుండి ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం వచ్చే రోగుల కోసం నూతన విధివిధానాలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు . ప్రైవేటు ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ అవయవ మార్పిడి చికిత్సలకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో వెయ్యి మార్పిడి చికిత్సల కోసం 4 ఆసుపత్రులకు అనుమతులు ఇచ్చామన్నారు. అలాగే రాష్ట్రంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై మంత్రి ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ రాష్ట్రంలో సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలకు అయ్యే టారిఫ్‌పై నియంత్రణ ఉండేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టామన్నారు. సమావేశంలో హెల్త్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్ర కుమార్, జీవన్ దాన్ డైరెక్టర్ డాక్టర్ భూషణ్ రాజ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌తోపాటు వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమానులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారత, చిన్నారుల భవిష్యత్తే లక్ష్యం

## బడ్జెట్ సన్నాహక సమావేశంలో
## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర 2026–27 వార్షిక అంచనా బడ్జెట్ రూపకల్పనలో ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో బడ్జెట్ సన్నాహక సమావేశం మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పంచాయితీరాజ్, మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖలకు సంబంధించి బడ్జెట్ అవసరాలు కేటాయింపులు తదితర వాటిపై చర్చించారు. సంబంధిత మంత్రి సీతక్క పాల్గొన్న ఈ సన్నాహక సమవేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామీణ ముఖచిత్రం మార్చేలా ప్రభుత్వం కేటాయింపులు జరుపుతుందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనుందని చెప్పారు. ప్రతి గ్రామంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన పంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రత్యేక నిధుల కేటాయించాలని నిర్ణయించినట్లు వివరించారు. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయనుందని పేర్కొన్నారు. ఉపాధి హామీపై వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధుల్లో కోత విధించడంపై స్పందించిన ఆయన కేంద్రం నిధులు తగ్గించినప్పటికీ, రాష్ట్ర నిధులతో ఈ పథకాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ కూలీలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన నిధులు బడ్జెట్‌లో పొందుపరచనున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత మరియు చిన్నారుల భవిష్యత్తే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. ఇక మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు సంబంధించి విక్రమార్క మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో విప్లవాత్మక మార్పులు చేపట్టనున్నట్లు తెలియచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన చోట్ల కొత్తగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని వెల్లడించారు. వీటిని ఇంటిగ్రేటెడ్ పాఠశాలలతో అనుబంధంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు గాను పోషకాహార కార్యక్రమాలకు అదనపు నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా మహి ళా సంఘాల కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా మహిళా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు ఆయన వివరించారు.

# వాగ్దానాలు అమలు చేయకుండా మోసగించిన కెసిఆర్

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, మార్చి 10,ప్రభాతవార్త:** కెసిఆర్ పదేళ్ల పాటు అధికారంలో ఉండి కనీసం సగం హామీలను కూడా నేర్చక ప్రజలను మోసం చేశారని అందుకే బిఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిందనీ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరోపించారు. మంగళవారం సిఎల్‌పిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అన్ని వర్గాలను ఘోరాతీఘోరంగా మోసం చేసిన చరిత్ర కెసిఆర్‌దనీ అన్నారు.

దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి దగా చేశారనీ మోసాల చిట్టాను చదివారు. దళిత బంధు పేరుతో మోసం చేశారు,గిరిజనులకు మూడెకరాల భూమి అని కనీసం మూడు అడుగులు కూడా ఇవ్వలేదు, బిసిలకు బిసిబంధు అని చెప్పి ద్రోహం చేశారనీ ఆయన విమర్శించారు. రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తామని చెప్పి అన్యాయం చేశారనీ తెలిపారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారనీ ఉద్యోగాలు భర్తీ చేయకుండా అన్యాయం చేశారనీ ఆయన వివరించారు. కెసిఆర్ చేసిన మోసం అంతా ఇంతా కాదు అందుకే అసెంబ్లీతో పాటు అనేక ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని చిత్తు గా ఓడించారనీ భాష్యం చెప్పారు. ఓటమి నుంచి పాఠం నేర్చుకోలేదని అందుకే మార్పు రావడం లేదని దుయ్యబట్టారు.

కెటిఆర్ నీకు దమ్ముంటే ప్రతి పక్ష నేత కెసిఆర్ ను అసెంబ్లీకి తీసుకురా అని సవాల్ చేశారు. ఆయన ప్రతి ప్రశ్నకు ప్రభుత్వం, మా ముఖ్యమంత్రి సమాధానం చెపుతారనీ అన్నారు. ప్రతిపక్ష నాయకుడి ని ఫామ్ హౌస్ లో కూర్చో బెట్టి నువ్వు, హరీష్ రావు ఇచ్చి కుట్ర చేస్తానంటే చూస్తూ ఊర్కోంఅన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన చూసి ఓర్వ లేక అసెంబ్లీ ని అడ్డుకుంటామని చెపుతున్నాడనీ ఆవేదన చెందారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అసెంబ్లీ సమావేశాల కోసం శిక్షణా తరగతులు పెట్టారనీ దీనికి సంతోషంగా ఉందని అయితే అసెంబ్లీ ని ఎలా అడ్డుకోవాలన్న దానిపైనే వాళ్లకు శిక్షణను ఇచ్చినట్లు కెటిఆర్ మాటలను చూస్తే అర్థమోతోందనీ ఆపాదించారు.

ఆరు గ్యారెంటీల అమలు పైన అసెంబ్లీ లో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని కెటిఆర్ అనడం ఆయనకు తగదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండున్నర యేళ్లు కూడా కాలేదనీ అంటే సగం కాలపరిమితి కూడా పూర్తి కాలేదు అప్పుడే హామీలపైన కెటిఆర్ ఎగిరెగిరి పడుతున్నారనీ అన్నారు. ఇప్పటికే సాధ్యమైన హామీలన్నింటిని నేరవేర్చామని తెలిపారు. మేం చెప్పని పథకాలను కూడా అమలు చేస్తున్నామనీ అన్నారు.

రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, వడ్డీలేని రుణాలు, సన్న బియ్యం, రైతు భరోసా, వరికి 500 రూపాయల బోనస్ వంటివి నీ కళ్లకు కనిపించడం లేదా..? అని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ తెలంగాణను అప్పుల కుప్పగా మార్చినా మా ముఖ్యమంత్రి గుండె ధైర్యంతో పోరాటం అసెంబ్లీ ని అడ్డుకుంటే వదిలిపెట్టమని తెలిపారు. బచ్చా గాని వి నువ్వు తండ్రి చాటున వచ్చి మంత్రి వి అయ్యావనీ విమర్శించారు. అసెంబ్లీలో ఏ అంశమైన అయినా మేం చర్చకు సిద్ధమని తెలిపారు.

# ఢిల్లీలో నీతులు.. రాష్ట్రంలో రాజ్యాంగ ఉల్లంఘన


## రెండేళ్లు దాటినా డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ఏది?

### రాహుల్‌గాంధీ, కెసి వేణుగోపాల్ సమాధానం చెప్పాలి: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 10:** ఢిల్లీలో రాజ్యాంగం గురించి గొప్పలు చెబుతూ రాష్ట్రాల్లో మాత్రం అదే రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ పార్టీ తీరును మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తప్పుపట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కించపరడం, అగౌరవపరచడంలో కాంగ్రెస్, బీజేపీలు ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలన్నారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పోస్టును ఏడేళ్లుగా ఖాళీగా ఉంచడాన్ని రాజ్యాంగ శూన్యత అని పీఏసీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.ఆయన చెప్పిన మాటలు నిజమే కావచ్చు, కానీ అదే సూత్రం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వర్తించదా అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నరేళ్లు కావస్తున్నా.. అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ పోస్టును ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీలో రాజ్యాంగం గురించి గొంతు చించుకునే కేసీ వేణుగోపాల్ , రాహుల్ గాంధీలు తెలంగాణలో జరుగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనపై ఏం సమాధానం చెబుతారు.. ఇది రాజ్యాంగ శూన్యత కాదా అని ప్రశ్నించారు.రాజ్యాంగ విలువల గురించి ఢిల్లీలో నీతులు చెప్పే కాంగ్రెస్, తన రాజకీయ అవసరాల కోసం రాష్ట్రాల్లో వ్యవస్థలను ఖూనీ చేస్తోందని హరీశ్ రావు మండిపడ్డారు. బీజేపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలనే కాంగ్రెస్ కూడా తెలంగాణలో రిపీట్ చేస్తోందని, ఈ రెండు పార్టీలు ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడంలో పోటీ పడుతున్నాయన్నారు.తమకు అనుకూలంగా ఉన్నప్పుడు ఒక మాట.. లేనప్పుడు మరో మాట మాట్లాడటం కాంగ్రెస్ నైజమన్న హరీశ్ రావు, ఈ దొంగ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అధికార దాహంతో ఈ రెండు పార్టీలు రాజ్యాంగాన్ని అగౌరవపరచడం అత్యంత సిగ్గుచేటన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, రాజ్యాంగబద్ధమైన పదవులను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# షిర్డీ సాయినాధుని దర్శించుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 10:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కుటుంబ సమేతంగా మహారాష్ట్ర పర్యటనకు వెళ్లారు.అక్కడ షిర్డీ సాయినాధుని



దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుమార్తె,వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, సన్నిహిత బంధువులు, మిత్రులతో కలిసి సోమవారం రాత్రి దూప హారతి పూజలో స్పీకర్ ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. మంగళవారం దయం విఐపి బ్రేక్ దర్శనంలో సాయినాధుని మహా సమాధిని దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు, అధికారులు సంప్రదాయబద్ధంగా, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ట్రస్ట్ కార్యాలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్యను షిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సీఈవో గోరక్ష గాడ్గికర్, అధికారులు శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

# బిజెపి నిర్లక్ష్యంతో ఆర్‌ఎఫ్‌సిఎల్ రామగుండం సంస్థకు దెబ్బ

## పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** పెద్దపల్లి నియోజకవర్గంలోని ఆర్‌ఎఫ్‌సిఎల్ రామగుండం సంస్థను సరైన నిర్వహణ లేకుండా నడుపుతున్నారని పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ కృష్ణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థలో జరుగుతున్న మిస్ మేనేజ్మెంట్, నిర్లక్ష్యంపై కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాకు పలుమార్లు లేఖలు రాసినట్లు తెలిపారు. వ్యక్తిగతంగా కూడా కలసి సమస్యలను వివరించినప్పటికీ సరైన స్పందన రాలేదని అన్నారు.ప్రస్తుతం ఆర్‌ఎఫ్‌సీఎల్ రామగుండం సంస్థలో ఉత్పత్తి సామర్థం పూర్తిగా వినియోగించుకోవడం లేదని, కేవలం సుమారు 70 శాతం మాత్రమే ప్రొడక్షన్ కొనసాగుతోందని పేర్కొన్నారు. సంస్థ హెడ్ ఆఫీస్ ప్రస్తుతం ఢిల్లీలో ఉండటం వల్ల ఇక్కడి సమస్యలపై తగిన శ్రద్ధ లేకపోతుందని, అందువల్ల హెడ్ ఆఫీస్‌ను హైదరాబాద్‌కు మార్చాలని కూడా పలుమార్లు లేఖలు, విజ్ఞప్తులు చేసినట్లు తెలిపారు.అయితే కేంద్ర ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించలేదని, హెడ్ ఆఫీస్‌ను మార్చే అవకాశం లేదని అధికారికంగా లేఖ ద్వారా తెలియజేసినట్లు చెప్పారు. ఈ నిర్ణయం వల్ల సంస్థ నిర్వహణపై మరింత ప్రభావం పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో మూతపడిన ఆర్‌ఎఫ్‌సీఎల్ సంస్థను తిరిగి ప్రారంభించేందుకు మాజీ కేంద్ర మంత్రి జి. వెంకటస్వామి కలిసి అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్‌తో చర్చలు జరిపి కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం వివేక్ ఎంపీగా ఉన్న సమయంలో కూడా ఎంతో శ్రమించి సంస్థను మళ్లీ ప్రొడక్షన్‌లోకి తీసుకు వచ్చారని తెలిపారు. ఈ సంస్థ ద్వారా అనేక మంది స్థానిక యువతకు ఉపాధి లభించిందని చెప్పారు. ఈ పరిస్థితి తెలంగాణ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని, దీనిపై నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

### కొలనూరు ఆర్‌ఒబి మంజూరు ఓదేలుకు కూడా సాధిస్తాం: ఎంపీ వంశీకృష్ణ

కొలనూర్ లెవల్ క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించడానికి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మంజూరు చేసి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 1982 మార్చి 20న కొలనూర్ లో సికిందరాబాద్ నుంచి న్యూఢిల్లీ వెళుతున్న జయంతి జనతా ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టడంతో 62 మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఆనాటి ప్రమాదంలో ఒక చిన్నారి సీటుతో సహా పర్లాంగ్ దూరంలో పడిపోవడంతో ఆమె మాత్రమే బ్రతికి బట్టకట్టారు. దేశంలో అతిపెద్ద ప్రమాదంగా నిలిచిన ఈ రైల్వే లెవల్ క్రాసింగ్‌పై ఆర్‌ఓబి మంజూరు కావడంతో 45 యేళ్లుగా భయం భయంగా అక్కడి నుంచి వెళ్ళే ప్రయాణీకులకు ఊరట లభించింది. పెద్దపల్లి ఎంపి వంశీకృష్ణ ఆర్‌ఓబి మంజూరుపై మాట్లాడుతూ కొలనూరు ప్రాంతానికి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మంజూరు కావడం ప్రాంత ప్రజలకు ఆనందకరమైన విషయమని తెలిపారు. కొలనూరు ఓదేలు ప్రాంతాల్లో రైల్వే గేటు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు.రైల్వే అధికారులు కొలనూరు ప్రాంతాన్ని సందర్శించినప్పుడు తాను స్వయంగా వారితో కలిసి ఆన్‌సైట్ పరిశీలన నిర్వహించానని, ఆ సమయంలో ఓదేలు ప్రాంతానికి కూడా అత్యవసరంగా ఆర్‌ఓబీ అవసరమని వివరించామని ఆయన పేర్కొన్నారు. మొదటగా రైల్వే శాఖ కొలనూరుకు మాత్రమే ఆర్‌ఓబీ మంజూరు చేసి, ఓదేలు ప్రాంతానికి సాధ్యం కాదని తెలిపిందన్నారు. అయినప్పటికీ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తాను నిరంతరం ప్రయత్నాలు కొనసాగించానని ఎంపీ వంశీ కృష్ణ తెలిపారు.

# అగ్నిమాపక విభాగం ఆధ్వర్యంలో యువతకు శిక్షణ

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** రాష్ట్ర అగ్నిమాపక, విపత్తులు, సివిల్ డిఫెన్స్ విభాగం ఆధ్వర్యంలో అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందిం చాలనే దానిపై యువతకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చే కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యింది. సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ పేరిట సికింద్రాబాద్‌లోని ఓ కాలేజిలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఫైర్ సర్వీస్ మాజీ డిజి అరుణా బహుగుణ ప్రారంభించారు. వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాలలో జరగనున్న ఈ కార్యక్రమం ఎంతో మంచిదని ఈ సందర్భంగా అరుణ బహుగుణ అన్నారు. అత్యవస ర పరిస్థితుల్లో అగ్నిమాపక విభాగం చేరుకునేలోపు స్థానిక యువత ముందు గా స్పందించి బాధితులకు అండగా వుండాల్సి న అవసరం వుందని ఆ మె తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు ఫైర్ సర్వీస్ విభాగం తరచూ చేబట్టాలని ఆమె కోరారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులను రక్షించడం, మ ంటలు చెలరేగితే వాటిని ఆర్పడం, గాయపడ్డవారికి ప్ర థమ చికిత్స అందించడం, గుంపులుగా చేరిన వారిని నియంత్రించడం వంటి అంశాలపై యువతకు శిక్షణ ఇవ్వాలని ఆమె సూచించారు. ఈ క్రమంలో యువతకు సహాయ సామాగ్రిని అందిం చాలని ఆమె కోరారు.

# అంతర్జాతీయ తల్లిదండ్రుల పిల్లల అపహరణపై మోనోగ్రాఫ్ విడుదల

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:**అంతర్జాతీయ తల్లిదండ్రుల పిల్లల అపహరణపై మోనో గ్రాఫ్‌ను హైకోర్టు న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ అ థారిటీ చైర్మన్ జస్టిస్ సాం కోషి మంగళవారం విడుదల చేశారు. హైకోర్టు ప్రాంగణంలో నల్సా ర్ వర్సిటీ విసి కృష్ణదువరావు, లా ఫ్యాకల్టీ, సెంటర్ ఫర్ చైల్డ్ అండ్ యూత్ జస్టిస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ బాలకృష్ణల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి పంచాక్షరి సహా పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సాం కోషి మాట్లాడుతూ అంతర్జాతీయ తల్లిదండ్రుల పి ల్లల అపహరణ అనేది ప్రైవేట్ అంతర్జాతీయ చట్టంలో ఒక ముఖ్యమైన విభాగమని తెలిపారు. ఇది ఒక తల్లిదండ్రులు 16 యేళ్లలోపు బాలలను తప్పుగా తొలగించడం, లేదా నిలుపుకోవడం వంటిదని, ఇదంతా మరొకరి కస్టడీ హక్కులను ఉల్లంఘించడం గురించి అ ని ఆయన తెలిపారు. 1990 తరువాత ఇండియాలో ఇది ఆందోళన కలిగించే అంశంగా మారిందని ఆయన అన్నారు. భారతీయ కుటుంబ వ్యవస్థ ఇప్పుడు వేగంగా అభివృద్ధి చె ందుతుందని, విదేశీయులతో భారతీయుల వివాహాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

# సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల మెరిట్ లిస్ట్ విడుదల

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులు త్వరగా భర్తీ కానున్నాయి. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పోస్టుల భర్తీ కోసం తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన మెరిట్ లిస్టును విడుదల చేసింది. డాక్టర్ల భర్తీకోసం 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. మెరిట్ లిస్టుకు సంబంధించిన మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఈ నెల 12 నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను నిర్వహించానున్నారు. ఈ నెలఖారు వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసి 692 మంది డాక్టర్లను ప్రభుత్వ ఆసుపత్రుల్లో భర్తీ చేయనున్నారు.

# జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు సిపిఐలో చేరాలి

## పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** జన జీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు మాతృ పార్టీ అయిన భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)లో చేరాలని ఇందుకు రాష్ట్ర కౌన్సిల్ బహిరంగంగా సాధార ఆహ్వానం పలుకుతోందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ప్రజా బలం లేని అతికొద్దిమందితో చేసే సాయుధ పోరాటం ద్వారా అంతిమ లక్ష్యం సాధ్యం కాదన్నారు. కమ్యూనిస్టులు కోరుకుంటున్న సమ సమాజాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా సాధించుకుందామని, ఇందుకు కలిసి పని చేసేందుకు కలిసి రావాలన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ప్రారంమయ్యాయి. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.బాల్‌రాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ, సిపిఐ సెంట్రల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ .. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తన బలమేమిటో నిరూపించుకోవడమే కాకుండా తమతో పొత్తు లేకపోతే ఏమి జరుగుతుందో పార్టీలకు ఒక జలక్ పుట్టించామన్నారు. తాము ఎవరితో పొత్తు పెట్టుకున్నా ధర్మాన్ని తు.చ. తప్పకుండ పాటిస్తామని, కాని ఇతర పార్టీలు మాత్రం పాటించడం లేదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పొత్తు ధర్మానికి విఘాతం కల్గించిందని కూనంనేని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో పొత్తులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆయనతోనే స్వయంగా తేల్చుకుంటామని కూనంనేని స్పష్టం చేశారు. తమతో పొత్తు పెట్టుకున్న పార్టీలు ప్రయోజనాలు పొందాయి తప్పితే వారితో తమకు ఒరగబెట్టింది ఏమిలేదన్నారు.

# గ్లోబల్ బ్రాండ్‌గా ఇప్పపూల సారా


## తెలంగాణ సాంప్రదాయక పానీయంగా గుర్తించాలి
## ఇప్పసారాపై అసెంబ్లీలో మాట్లాడుతా: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల, మార్చి 10, ప్రభాతవార్త :** రసాయనాలు ఉపయోగించి తయారు చేసే కల్తీ సారా గురించి తాను మాట్లాడటం లేదని, అడవుల్లో సహజంగా దొరికే ఇప్పపూలతో తయారు చేసే సారాను ప్రమోట్ చేయాలని మాత్రమే కోరుతున్నానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేసారు. ఇప్పపూలతో తయారు చేసే సారాతో తెలంగాణ బ్రాండ్ ను క్రియేట్ చేయాలని, తద్వారా అటు ప్రభుత్వానికీ ఇటు ఆదివాసీ, గిరిజనులకు కూడా భారీ ఎత్తున ఆదాయం వచ్చేలా చూడాలని తాను ప్రభుత్వాన్ని కోరనున్నామని తెలిపారు. ఇప్పపూల సారా అనేది తన వ్యక్తిగత ఆలోచన అని, కేవలం తాను గిరిజనుల కోసమే దీని గురించి అసెంబ్లీలో మాట్లాడాలని నిర్ణయించుకున్నానని వివరించారు. జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనిరుధ్ రెడ్డి తాను సారాపై చేసిన వాఖ్యలకు వివరణ ఇచ్చారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఇప్పపూలతో సారా తయారు చేయడం అనేది 5వేల ఏళ్ల క్రితం నుంచే మన దేశంలో ఉందని, అయితే బ్రిటీష్ వాళ్లు మన దేశానికి వచ్చిన తర్వాత వారు తయారు చేసే మద్యాన్ని అమ్ముకోవడానికి ఇప్పసారా తయారీని బంద్ చేయించారని చెప్పారు. గతంలో ఇప్పసారా తాగిన వాళ్లు 115 ఏళ్ల వరకూ బతికే వారని, అయితే ఇప్పుడు తాగుతున్న మద్యం కారణంగా 60 ఏళ్లకే మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయం గురించి తాను ఎంతో పరిశోధన చేసిన తర్వాతనే ఈ విషయాలపై మాట్లాడుతున్నానని తెలిపారు. విదేశాల్లో మన ఇప్పపూల తరహాలోనే తయారు చేసి టకీలా అనే సారా ద్వారా దాన్ని తయారు చేసే దేశం లక్ష కోట్ల ఆదాయాన్ని సంపాదిస్తోందని, అలాగే చైనా, జపాన్‌లు కూడా తమ సాంప్రదాయపు మద్యాన్ని తయారు చేసి ప్రపంచ వ్యాప్తంగా అమ్ముతున్నాయని అన్నారు. అదే విధంగా సాంప్రదాయకమైన ఇప్పసారాను కూడా తెలంగాణ రాష్ట్రంలో ప్రమోట్ చేయడం ద్వారా మన రాష్ట్రానికి కూడా లక్ష కోట్ల ఆదాయాన్ని సంపాదించి పెట్టాలని, దాని ద్వారా ఆదివాసీ, గిరిజనులు కూడా ప్రతి యేటా లక్షల రుపాయల ఆదాయాన్ని సంపాదించుకోవాలన్నదే తన లక్ష్యమని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోని నల్లమల తో సహా అటవీ ప్రాంతాల్లో ఇప్పపూలు విస్తారంగా లభిస్తాయని వాటిని సేకరించడం ద్వారా ఆదివాసీ బిడ్డలకు ఉపాధి లభిస్తుందన్నారు. ఇప్పసారాకు ప్రపంచ వ్యాప్తంగా ఒక గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్ ను తీసుకురావాలన్నదే తన ఆలోచన అని అనిరుధ్ రెడ్డి చెప్పారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 345

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 10, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 345 దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 127 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 50దరఖాస్తులు,ఇందిరమ్మ ఇండ్ల కోసం 90దరఖాస్తులు ,ప్రవాసీ ప్రజావాణీకి 01దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 77దరఖాస్తులు అందాయి.సీఎం ప్రజావాణీ ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్,ఏసీపీ ఉమేందర్,ప్రవాసీ ప్రజావాణీ సమన్వయ కర్త బొజ్జా అమరేందర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## గర్భిణి స్త్రీలకు రైల్వేలో ప్రత్యేక
# కోటా కల్పించాలి

**సైఫాబాద్, మార్చి 10 ప్రభాతవార్త:** గర్భిణి స్త్రీలకు రైల్వేలో ప్రత్యేకంగా కోటా కల్పించాలి రైల్వే టిక్కెట్ల నిర్ధారణ (కన్ఫర్మేషన్) విషయంలో గర్భిణి మహిళలకు అత్యంత ప్రాధాన్యత కల్పించి, ప్రత్యేకంగా కోటా ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే సభ్యులు కాలపురెడ్డి సాయిబాబా కేంద్ర రైల్వే శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవికి లేఖ రాయడం జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో రోజువారిగా లక్షలాది మంది ప్రయాణికులు వారి, వారి అవసరాల నిమిత్తం ప్రయాణాలు కొనసాగిస్తున్నారని, కాని అందులో వృద్ధులు, వికలాంగులు, మహిళలకు, ఉద్యోగాల కార్డుల ఉన్న వారి కోసం ప్రీమియం తత్కాల్ అని ప్రత్యేకంగా కోటా ఏర్పాటు చేయడం జరిగిందని, కాని గర్భిణి స్త్రీలకు రిజర్వేషన్ టిక్కెట్ నిర్ధారణ కాకపోవడంతో వారు జనరల్ బోగిలో ప్రయాణించలేక అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణి స్త్రీలు రైల్వే టిక్కెట్లు బుక్ చేసేటప్పుడు వారి మెడికల్ సర్టిఫికేట్‌ను ఆధారంగా తీసుకుని ప్రత్యేక కోటాను ఏర్పాటు చేయాలని ఆయన రైల్వే శాఖ మంత్రిని కోరారు.

# ఆయిల్ పామ్ సాగులో మరింత అభివృద్ధి

### 22న నర్మెట్ట ఆయిల్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి
### ఏప్రిల్ 2, 3 తేదీల్లో హైదరాబాద్‌లో ఆసియన్ టెక్స్‌టైల్స్ సదస్సు: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడుతోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఈ నెల 22న సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో రెండు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లులు ఉన్నాయని తెలిపారు. ఈ మిల్లుల సమిష్టి సామర్థ్యం గంటకు 120 మెట్రిక్ టన్నులుగా ఉందని చెప్పారు. ఈ విషయమై మంగళవారం సచివాలయంలో వ్యవసాయ అనుబంధశాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో సుమారు రూ.300 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని నిర్మించిందని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించార్రు. ప్రారంభ దశలో నర్మెట్ట యూనిట్ గంటకు 30 టన్నుల సామర్థ్యంతో పనిచేయనుండగా భవిష్యత్తులో దీనిని గంటకు 120 టన్నుల వరకు విస్తరించే విధంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక ప్రాసెసింగ్ యూనిట్ ఆయిల్ పామ్ రైతులకు ఎంతో మద్దతుగా నిలవనుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు రైతు మేళా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మేళాలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన యంత్రాలు, ఆయిల్ పామ్ సాగు విధానాలు, ఉత్పత్తి పెంపు మార్గాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు ప్రత్యక్షంగా సమాచారం అందించనున్నట్లు తెలిపారు.

**హైదరాబాద్‌లో 13వ ఆసియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్...**
ప్రపంచ స్థాయి టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణను ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో ఏప్రిల్ 2, 3 తేదీల్లో జరగనున్న రి ఇమాజినింగ్ ది ఫ్యూచర్ గ్లోబల్ టెక్స్‌టైల్స్ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం సచివాలయంలో వారు విడుదల చేశారు. ఈ సదస్సు నిర్వహణ ద్వారా దేశీయ, అంతర్జాతీయ టెక్స్‌టైల్ పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడదారులు, నిపుణులు ఒకే వేదికపైకి రావడం ద్వారా తెలంగాణలో టెక్స్‌టైల్ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం, కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీ (సిఐటిఐ) భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని ఇంటర్నెషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సు ద్వారా తెలంగాణను టెక్స్‌టైల్, అపారెల్, ఫుట్‌వేర్ తయారికి అంతర్జాతీయల పెట్టుబడుల కేంద్రంగా నిలబెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. సమావేశంలో టెక్స్‌టైల్ రంగంలో సస్టైనబులిటి, సాంకేతికత, సరఫరా వ్యవస్థల అభివృద్ధి, గ్లోబల్ మార్కెట్ల అవకాశాలు వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయన్నారు. సదస్సుకు అనుబంధంగా ఏప్రిల్ 4న వరంగల్ లోని పిఎం మిత్ర పార్కుకు పరిశ్రమల సందర్శన కూడా నిర్వహించనున్నారు.

**యాసంగి పంటలు కొనుగోలుకు కేంద్ర మంత్రికి వినతి...**
యాసంగి (రబీ) 2025-26 సీజన్‌లో తెలంగాణ రాష్ట్రంలో పండిన మినుములు, వేరుశెనగ, పొద్దు తిరుగుడు, శెనగ పంటలను కనీస మద్దతు ధరనవ కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే అనుమతించాలని కేంద్ర వ్యవసాయశాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పంటల కోతలు ఆరంభమైనందున పంటలను వెంటనే కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.



గన్ పార్కులో మిలియన్ మార్చ్‌లో పాల్గొన్న కోదండరామ్, అద్దంకి దయాకర్, ప్రఫుల్ రామ్‌రెడ్డి తదితరులు

## హామీల అమలు కోసం కృషి చేస్తా: కోదండరామ్

**సైఫాబాద్, మార్చి 10 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు కోసం తన వంతు కృషి చేస్తానని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఒక కమిటీని వేయనున్నదని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ చెప్పారు. తెలంగాణ ఉద్యమకారుల జెఎసి, వివిధ ఉద్యమ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మిలియన్ మార్చ్ స్ఫూర్తిని కొనసాగిస్తూ తెలంగాణ అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించే కార్యక్రమం గన్‌పార్క్ వద్ద జరిగింది. కోదండరామ్ ప్రసంగిస్తూ తెలంగాణ ఉద్యమకారులు ఆత్మగౌరవంతో తలెత్తుకుని తిరిగేలా గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మిలియన్ మార్చ్ రోజు తెలంగాణ ప్రజలు ఇచ్చిన స్ఫూర్తి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. నాడు తెలంగాణ ప్రజలు చూపిన ధైర్యం, సాహసం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. రాష్ట్ర శాసన మండలి సభ్యుడు అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు కోసం రాష్ట్ర శాసన మండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, ఇప్పటికే ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారుల జెఎసి అధ్యక్షుడు ప్రఫుల్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డులు, ఆరోగ్య కార్డులు అందించాలని, వారిపైన ఉన్న కేసులన్నింటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్ రాజీనామా
### తాత్కాలిక సిఇఒ ఎండిగా రాహుల్‌భాటియా

**ముంబయి, మార్చి 10:** ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్ రాజీనామాచేయడంతో తాత్కాలిక బాధ్యతలను ఎండి రాహుల్‌భాటియాకు అప్పగించారు. స్టాక్ ఎక్స్ఛేంజిలకు ఇండిగో ఈ సమాచారం ఇచ్చింది. ఎయిర్‌లైన్స్ సంస్థ తీవ్రస్థాయి అంతరాయాలను ఎదుర్కొని వందలాది విమానాలు నిలిచిపోయిన సంఘటనలు జరిగిన మూడునెలలకు ఇండిగో సిఇఒ రాజీనామాతో మళ్లీ ఎయిర్‌లైన్స్ వార్తల్లోకి వచ్చింది. దీనికితోడు ఏవియేషన్ పర్యవేక్షణ సంస్థ డిజిసిఎ ఇండిగోపై రూ.22 .20 కోట్ల జరిమానా కూడా విధించింది. సిఇఒ రాజీనామాచేసారని ఆయన్ను రిలీవ్‌చేస్తున్నట్లు బోర్డు సమావేశంలో వెల్లడించారు. ప్రస్తుత ఎండి రాహుల్‌భాటియా తాత్కాలిక బాధ్యతలు కొనసాగిస్తారని ఇండిగోప్రకటన విడుదలచేయడంతో సంస్థాగతంగా కోల్డ్‌వార్ ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది డిసెంబరులో ఎయిర్‌లైన్స్ అత్యంత అధ్వాన్న కర రీతిలో సేవలు కొనసాగించిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందుకోసం సంస్థకు రూ.2వేల కోట్ల నష్టం కూడా వాటిల్లింది. అయితే ఎల్బర్స్ రాజీనామా వ్యక్తిగత కారణాలతోనే జరిగిందని నోటీసు వ్యవధిని కూడా రద్దుచేసినట్లు కంపెనీ తెలిపింది. ఎయిర్‌లైన్స్ సర్వీసుల నిలిపివేతతో కేంద్ర పౌరవిమానయానశాఖ కూడా దృష్టిసారించింది డిజిసిఎ ఎయిర్‌లైన్స్‌పై తీవ్ర విమర్శలుచేసింది. అయితే ఇండిగో కూడా శరవేగంగా కదిలి సర్వీసులన్నింటినీ సాధారణ స్థాయికి తీసుకురాగలిగింది.

## దానం, కడియం అనర్హత పిటీషన్లపై
## నేడు స్పీకర్ కీలక తీర్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 10:** తెలంగాణ రాజకీయ వర్గాల్లో గత కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకుబుధవారంతో తెరపడనుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బుధవారం తన తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. ఈ మేరకు పిటీషనర్లను స్పీకర్ కోర్టుకు హాజరు కావాల్సిందిగా సమాచారం పంపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, నిర్ణీత గడువు ముగుస్తుండటంతో స్పీకర్ కార్యాలయం ఈ మేరకు సిద్ధమైంది. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించగా, ఇప్పటికే ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు. దానం, కడియంలపై తాజాగా వాదనలు పూర్తయ్యాయి. సుప్రీంకోర్టు సూచనల ప్రకారం మార్చి 12వ తేదీలోపు వీరిద్దరి విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని ప్రకటించాలి. 12వ తేదీన ఎమ్మెల్యేల అనర్హత పిటీషన్లపై సుప్రీంకోర్టులో విచారణ కూడా ఉంది. దీంతో బుధవారం స్పీకర్ తీర్పు ఎలా ఉండబోతుందో అని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
## త్వరలో ఎంజిఎం ఆస్పత్రి ప్రారంభం
### అండర్‌గ్రౌండ్ పనులకు శంకుస్థాపన
### యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు
### మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి పొంగులేటి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 10:** వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగాపని చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా అభివృద్ధిపై దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్‌ను అభివృద్ధి పరచాలన్న కృత నిశ్చయంతో వరంగల్ నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల అమలులో వేగం పెంచాలని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన వివిధ ప్రగతి పనులు వచ్చే జూన్ 2వ తేదీ కల్లా పూర్తి కావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు నిర్విరామంగా పనిచేయాలని సూచించారు. భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు, భద్రకాళి చెరువు డీసిల్టేషన్ అంశాలకు సంబంధించి ఆలయ మాడవీధులలో కృష్ణశిలతో నిర్మాణం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను పూర్తి చేశామని జూన్ నాటికి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరంగల్ పట్టణంలో రూ.5,257 కోట్లతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పనులకు సంబంధించి వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తిచేసి వచ్చేనెలలో పనులను ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న 2 బిహెచ్‌కే ఇండ్లకు ఈనెల 31లోగా లబ్దిదారులను ఎంపిక చేసి కేటాయించాలని సూచించారు.

## బహ్రెయిన్‌లో చిక్కుకున్న తెలుగు వారు
# 65 మంది స్వదేశానికి

- 'వార్త' పత్రికకు ధన్యవాదాలు
- ప్రభుత్వం, తెలుగు సంఘాలకు కృతజ్ఞతలు

**చిక్కడపల్లి మార్చి 10 ప్రభాతవార్త :** యుద్ధ వాతావరణం కారణంగా బహ్రెయిన్‌లో చిక్కుకుపోయిన 65 మంది తెలుగు యాత్రికులు ఎట్టకేలకు క్షేమంగా మంగళవారం హైదరాబాద్ రావడానికి మార్గం సుగమం అయింది. కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో పాటు తమను ఆదుకున్న ప్రభుత్వ యంత్రాం గానికి, తెలుగు సంఘాలకు తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం బహ్రెయిన్ నుండి ప్రభాతవార్తతో మాట్లాడుతూ వివరాలు వెల్లడిం చారు. గత నెల ఫిబ్రవరి 24న టూరిస్ట్ వీసాపై బహ్రెయిన్ వెళ్లిన తాము 28న తిరుగు ప్రయాణం కావాల్సి ఉంది. అయితే అనూహ్యం గా యుద్ధం ప్రారంభం కావడంతో విమాన సర్వీసులు నిలిచిపోయి అక్కడే చిక్కుకు పోయామని అన్నారు. భయానక పరిస్థితుల మధ్య 10 రోజుల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపామని అన్నారు. తాము స్వదేశానికి రావడానికి కృషి చేసిన సహకరించిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తక్షణమే స్పందించి విమానయాన శాఖతో సమన్వయం చేయడం వల్లనే మంగళవారం గల్ఫ్ ఎయిర్ ద్వారా బాధితులు క్షేమంగా హైదరా బాద్ పయనం అవడానికి మార్గం సుగమం అయిందన్నారు. తెలుగు అసోసియేషన్ బహ్రెయిన్ ప్రతినిధులు ప్రభుత్వాలతో నిరంతరం సమ న్వయం చేస్తూ ప్రయాణ ఏర్పాట్లు పర్యవేక్షి ం చారన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్ఆర్ఐ, ఎపిఎన్ఆర్‌టి, తెలుగు కళా సమితి ఫిబ్రవరి 28 నుండి అండగా నిలిచిన సభ్యులు రఘునాథ్ బాబు, శివకుమార్, సతీష్ శెట్టి, కె. మోహన్, జగదీష్, ప్రసాద్, కె.సంతోష్, ఐ. జోయల్‌లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమకు బహ్రెయిన్‌లో తెలుగు ప్రజలు 65 మందికి 10 రోజుల పాటు ఉదయం అల్పాహారం, భోజనం, తాగునీరు అందించిన దాతృత్వానికి రుణపడి ఉంటామన్నారు. ఈ సమస్యను నిరంతరం ప్రజల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన తెలుగు జాతీయ దిన పత్రిక వార్తకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వాలు, ప్రవాస తెలుగు సంఘాలు చూపిన చొరవ వల్లే ఈరోజు తాము సురక్షి తంగా ఇళ్లకు చేరుకోగలిగామని బాధితులు భావోద్వేగంతో వెల్లడించారు.



బహ్రెయిన్ నుండి హైదరాబాద్ కు పయనమైన తెలుగు ప్రజలు




లింగంపల్లి జేఏసీ కార్యాలయంలో నిరాహార దీక్ష ను ప్రారంభించిన డా. విశారదన్ మహారాజ్, చిత్రంలో జాతీయ బిసి కమిషన్ పూర్వ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య

## వెలుగుమట్ల బాధితులకు న్యాయం కోసం
# పోరాటం: విశారదన్
### బాగ్ లింగంపల్లి జేఏసీ కార్యాలయంలో నిరాహార దీక్ష ప్రారంభం

**చిక్కడపల్లి మార్చి 10 ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూ బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ స్పష్టం చేశారు. ఖమ్మంలో పోలీసులు తనను అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించడంతో, మంగళవారం బాగ్ లింగంపల్లి జేఏసీ కార్యాలయంలోనే ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, మాజీ జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్ ఈ దీక్షను ప్రారంభించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డా. విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ భూదాన్ బోర్డు భూముల విషయంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న జేఏసీ, ధర్మసమాజ్ పార్టీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలి, 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించి, ఇళ్లను కూల్చివేసి వారిని రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు పేదల పట్ల చిత్తశుద్ధి లేదని, భవిష్యత్తులో ప్రజలే వారికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి బాధితులకు న్యాయం చేసే వరకు తన దీక్ష కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. అలాగే, పోలీసులు అదుపులో ఉన్న మరో 15 మంది కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**పేదల పక్షాన పోరాటం ప్రశంసనీయం: జస్టిస్ ఈశ్వరయ్య**
మాజీ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడ అన్యాయం జరిగినా పేదల పక్షాన నిలబడి పోరాడుతున్న విశారదన్ మహారాజ్ దీక్షకు తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రోడ్ల రాఘవేంద్రరావు ముదిరాజ్, తెలంగాణ జాగృతి నేతలు నవీన్ చారి, గంగాధర్ యాదవ్, ధర్మసమాజ్ పార్టీ నేతలు దుర్గాప్రసాద్, సాయిబాబా, హరప్పా తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

# కృష్ణయ్య పోరాటం @ 50
### ఇక బాధ్యతలు కుమారుడికి అప్పగించు: ప్రధాని మోడీ

**హైదరాబాద్ మార్చి 10 ( ప్రభాతవార్త):** రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు అరగంట పాటు సాగిన ఈ సమావేశంలో బీసీల సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్యతో ప్రధాని సరదాగా గడిపారు. కృష్ణయ్య మనవళ్లు రిషి నందన్, రిత్విక్ నందన్, మనవరాళ్లు అక్షర, కృత్రికలతో ప్రధాని మోడీ దాదాపు 20 నిమిషాల పాటు సరదాగా గడిపారు. పిల్లలు స్వయంగా గీసిన తన చిత్రాలను ప్రధాని ఆసక్తిగా తిలకించి, వారిని అభినందిం చారు. బీసీల సమస్యలపై వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ చర్చిస్తున్న సమయంలో ప్రధాని జోక్యం చేసుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. **కృష్ణయ్య గారు, మీరు 50 ఏళ్లుగా బీసీల కోసం నిరంతరం పోరాడుతున్నారు. ఇక మీ కుమారుడికి (అరుణ్) బాధ్యతలు అప్పగించండి. ఆయ న శక్తివంతుడు, సివిల్స్ ఇంటర్వ్యూ వరకు వెళ్లిన మేధా వి. ఉద్యమాన్ని ముందుకు నడిపే ధైర్యం ఆయనకు ఉంది** అని ప్రధాని పేర్కొన్నారు. కృష్ణయ్య బిసి డిమాండ్లను ప్రస్తావించారు. చట్టసభల్లో బీసీలకు 50 రిజర్వేషన్లు కల్పించేలా బిసి బిల్లు ప్రవేశపెట్టాలి, విద్య, ఉద్యోగాలలో కేంద్ర రిజర్వేషన్లను 27 నుండి 56కి పెంచాలి. క్రిమీలేయర్ నిబంధనను తొలగించాలి, ఒక్కో బీసీ కుటుంబానికి 80 సబ్సిడీతో రూ. 20 లక్షల రుణం ఇవ్వాలి, బడ్జెట్‌లో రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలి, ఎస్సీ, ఎస్టీ తరహాలో బీసీలకు సామాజిక భద్రత కల్పించేందుకు బి.సి. యాక్ట్ తీసుకురావాలి, ప్రైవేటు పరిశ్రమలు, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాల్లోనూ బీసీలకు వాటా ఇవ్వాలి, కేంద్రంలో బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి, బీసీల డిమాండ్లు న్యాయమైనవని, వీటిని దశలవారీగా పరిష్కరిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కుటుంబ సభ్యులతో కలిసిన రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

## గోపన్ పల్లి ఫార్మ్ హౌజ్‌లో
# గంజాయి సాగు
### 272 గ్రాముల గంజాయి స్వాధీనం





**గచ్చిబౌలి, మార్చి 10 ప్రభాత వార్త:** ఫార్మ్ హౌజ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ గంజాయి సాగు ప్రారంభించాడు ఓ వ్యక్తి. గోపన్‌పల్లిలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగుచేస్తున్న వాచ్‌మెన్‌ను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి 272 గ్రాముల గంజాయి మొక్క స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపన్‌పల్లి ఎన్టిఆర్ నగర్ సమీపంలో బిఎల్ కేరెడ్డి ఫార్మ్స్ ఉంది. దీనికి ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మట బాదల్ (49) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గత కొద్దినెలలుగా బాదల్ గుట్టుచప్పుడు కాకుండా ఫార్మ్స్ హౌజ్‌లో గంజాయి సాగుచేస్తున్నాడు. గంజాయి సాగుపై సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి ఎస్ఒటి, గచ్చిబౌలి పోలీసులు ఫార్మ్స్ హౌజ్ మీద మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో 272 గ్రాముల గంజాయి మొక్కని స్వాధీనం చేసుకున్నారు. బాదల్‌ని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు.

## పట్టణ ప్రాంతాల్లో 18,213 ఇళ్లు
### పిఎంఎవై (యు) 2.0 కింద
### రూ.273 కోట్లు మంజూరు
### హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి.పి. గౌతం వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 10:** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన్ (పట్టణ)2.0 (పిఎంఎవై-యు) కింద గృహ నిర్మాణ పథకాలు చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల వ్యయంతో రాష్ట్రంలోని 118 పట్టణ ప్రాంతాల్లో మొత్తం 18,213 ఇండ్లను నిర్మించాలన్న ప్రతిపాదలను ఆమోదిస్తూ, కేంద్రం వాటాగా విడుదల చేయాల్సిన నిధులను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. పిఎంఎవై(పట్టణ)2.0 పథకం సెంట్రల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ (సిఎస్ఎంసీ) ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు వివరించారు.

## లింగ సమానత్వానికి పాటుపడిన
## సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయిపూలే
### సావిత్రిబాయిపూలే 129వ వర్ధంతి

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** విద్యతోనే వనితకు విముక్తి అని లింగ సమానత్వానికి పాటుపడిన సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలేనని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ ఎ స్టాలిన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ ఎ స్టాలిన్ సావిత్రి భాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ .. ఆధునిక భారతదేశంలో మొట్టమొదటిగా బ్రాహ్మణీయ కులతత్వ సంస్కృతి మత వ్యవస్థలపై యుద్ధం ప్రకటించిన వ్యక్తులు జ్యోతిరావు పూలే, ఆయన భార్య సావిత్రీ బాయి పూలే అని గుర్తు చేశారు. 1847 నాటికి భర్తతో కలిసి సాయిత్రిబాయి పూలే బాలికల కోసం పుణేలో మొట్టమొదటి పాఠశాల ప్రారంభించారని, ఈ పాఠశాల నడపడటం కొందరికి నచ్చకపోవడంతో ఆమెపై వేధింపులకు, భౌతిక దాడులకు పాల్పడ్డారని తెలిపారు. సామాజిక సాంస్కృతిక పరివర్తన పోరాటాలకు స్ఫూర్తినిస్తూ మన ఆశయాలను వాస్తవ చరణాలుగా మార్చుకునే శక్తిని అందిస్తూ నిరంతర స్ఫూర్తి ప్రదాతగా నిలవడమే సావిత్రిబాయికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని వారన్నారు.


131 కోట్ల ప్రైజ్‌మనీ

## బిసిసిఐ నజరానా

**ముంబై:** టీ20 ప్రపంచకప్ నెగ్గిన సూర్యసేనకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. సొంతగడ్డపై కప్ నెగ్గి యావత్ భారతావనిని సంబరాల్లో ముంచెత్తిన టీమిండియాకు 131 కోట్ల నగదు బహుమతిని ఇవ్వనున్నట్లు బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా వెల్లడించారు. 2024లో రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా టీ20 వరల్డ్‌కప్ చేజిక్కించుకుంది. ఆ సమయంలో బీసీసీఐ 125 కోట్లను బహుమతిగా ప్రకటించగా, ఈసారి సూర్యసేనకు అదనంగా మరో ఆరు కోట్ల రూపాయలను పెంచింది. టీ20 ప్రపంచకప్ 2026 విజేతగా నిలిచిన తర్వాత టీమ్‌ఇండియాకు 27.48 కోట్ల ప్రైజ్‌మనీ, రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్‌కు 14.65 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. ప్రైజ్‌మనీతో కలుపుకుంటే టీమిండియా విన్నింగ్ టీమ్ సభ్యులు ఒక్కొక్కరికి దాదాపు 15 కోట్లు లభించనుంది. భారత్ అతిథ్యమిచ్చిన టీ20 ప్రపంచకప్‌లో సూర్య సేన అద్భుత ప్రదర్శన చేసింది. నాకౌట్ స్టేజ్‌లో మ్యాచ్‌లను వన్‌సైడ్‌గా ముగించి విజేతగా నిలిచింది.

## ఐసిసి జరిమానా

**న్యూఢిల్లీ:** భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై ఐసీసీ జరిమానా పడింది. టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో అనుచిత ప్రవర్తనకు గాను అర్షదీప్ మ్యాచ్ ఫీజులో 15శాతం కోత విధించింది. ఐసీసీ కోడ్ ఉల్లంఘించినందుకు జరిమానాతోపాటు ఒక డీమెరిట్ పాయింట్ అర్షదీప్ ఖాతాలో చేరింది. గత 24 నెలల్లో ఇదే తొలి జరిమానా కావడంతో మ్యాచ్ వేటు తప్పింది. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో 11వ ఓవర్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. మిచెల్ రెండు వరుస సిక్స్‌లు బాదడంతో అర్షదీప్ అసహనానికి గురయ్యాడు. తరువాతి బంతికి డారిల్ మిచెల్ స్ట్రెయిల్ డ్రైవ్ ఆడాడు. బంతిని అందుకున్న అర్ష దీప్.. బ్యాట్స్‌మెన్‌పైకి నేరుగా విసిరాడు. దీనిపై మిచెల్ తీవ్ర ఆగ్రహంతో అర్షదీప్ వెపు దూసుకు వచ్చాడు. అర్ష్‌దీప్ మాత్రం ఏమీ పట్టించుకోకుండా బౌలింగ్ రనప్ వైపు వెళ్లిపోయాడు. మిచెల్ వద్దకు కెప్టెన్ సూర్య వెళ్లి సర్ది చెప్పాడు. తాను మిచెల్ కు సారీ చెప్పానని.. కావాలని అలా విసరలేదని వివరించినట్లు అర్ష్‌దీప్ సింగ్ తెలిపాడు.




## క్రికెట్ పిచ్ నుంచి పెళ్లి పీటలపైకి



**ముస్సోరి:** టీమిండియా టాప్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఓ ఇంటివాడు కానున్నాడు. తన చిన్ననాటి స్నేహితురాలు వన్షిక చద్దాను ఈనెల 14న పెళ్లి చేసుకోబోతున్నాడు. వీరి వివాహానికి ఉత్తరాఖండ్ ముస్సోరిలోని ఓ రిసార్ట్ వేదికకానుంది. 13న ప్రీ వెడ్డింగ్ జరగనుంది. కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య పెళ్లితంతు నిర్వహించనున్నారు. 17న లక్నోలో గ్రాండ్‌గా జరిగే రిసెప్షన్‌కు టీమిండియా క్రికెటర్లు, మాజీ క్రికెటర్లు, బీసీసీఐ అధికారులు హాజరుకానున్నారు. కుల్‌దీప్, వన్సిక ఎంగేజ్‌మెంట్ గత ఏడాది జూన్4న జరిగింది. టీ20ప్రపంచకప్ నేపథ్యంలో పెళ్లిని వాయిదా వేసుకున్నారు. ప్రపంచకప్ ముగియడంతో వీరిద్దరూ పెళ్లిపీటలెక్కనున్నారు.

## షూటింగ్‌లో మను భాకర్ టాప్


గురితప్పని లక్ష్యం

**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్‌సెలక్షన్ ట్రయల్స్ మహిళల 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ అగ్రస్థానంలో నిలిచింది. గురితప్పని షూటింగ్‌తో మొత్తం 246.1 పాయింట్లు స్కోరు చేసింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్ సెయిన్యం 241.9 పాయింట్లతో, ఆసియా ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్ ఇషా సింగ్ 220.26 వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. మను బాకర్ కంటే సెయిన్యం కేవలం 4.2 పాయింట్లతో వెనకబడింది. ఆసియా క్రీడల ఛాంపియన్ పాలక్ గులియా 200.2 స్కోరుతో నిరాశ పరిచింది. నాలుగో స్థానంతో సరిపెట్టింది. భారత జాతీయ షూటింగ్ జట్టు మరో కోచింగ్ క్యాంప్ ఢిల్లీలోని తుగ్లకాబాద్ షూటింగ్ రేంజ్‌లో కొనసాగుతోంది.

# వేల్స్‌పై గెలిస్తే సెమీస్ బెర్త్

### మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫైయింగ్ ● ఫుల్ జోష్ మీదున్న భారత్



**హైదరాబాద్(వార్త క్రీడా ప్రతినిధి) :** గచ్చిబౌలీలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరుగుతున్న మహిళల హాకీ ప్రపంచ కప్ క్వాలిఫయర్స్‌లో భారత్ జోరుచూపుతోంది. సెమీఫైనల్‌పై ఫోకస్ పెట్టింది. ఉరుగ్వేపై 4-0 గోల్స్ తేడాతో నెగ్గిన భారత అమ్మాయిలు... రెండో మ్యాచ్‌ను స్కాట్లాండ్‌తో 2-2తో డ్రా చేసింది. రెండు మ్యాచ్‌లు ఆడిన భారత్ 4 పాయింట్లతో పూల్-బిలో టాప్ ప్లేస్‌లో నిలిచింది. నేడు వేల్స్‌తో చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే సెమీస్ బెర్త్ దక్కుతుంది. డ్రా చేసుకున్నా సెమీస్ అవకాశాలు మెండుగానే ఉంటాయి. ఈ మ్యాచ్ రాత్రి 7.30గంటలకు గచ్చిబౌలీలో జరగనుంది.

పూల్-బిలో 4 పాయింట్లతో స్కాట్లాండ్‌తో భారత్ సమానంగా ఉన్నా.. మెరుగైన గోల్ తేడాతో టాప్ ప్లేస్ పొందింది. ప్రతి పూల్ నుండి మొదటి రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఉరుగ్వే 3 పాయింట్లతో, వేల్స్ గెలుపు ఖాతా లేకుండా ఉంది. భారత మహిళలు ఫుల్ జోష్‌తో ఉన్నారు. యువ ఫార్వర్డ్ సునెలిటా టోప్పో రెండు మ్యాచ్‌లలోనూ గోల్ చేస్తూ అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నారు. అటాకర్లు లాల్రెమ్సియామి, నవనీత్ కౌర్, రుతుజా అద్భుతంగా రాణిస్తున్నారు. భారత డిఫెన్స్ కూడా దృఢంగాఉంది. గోల్‌కీపర్ బిచుదేవి స్థిరంగా సేవ్‌లుచేస్తున్నారు.

జట్టు ఆటతీరుపై భారత కెప్టెన్ సలీమా టెటె సంతృప్తి వ్యక్తం చేసింది. యువ ఆటగాళ్లు తమ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారని తెలిపింది. ఇది తమకు చాలా సానుకూలాంశమని, వేల్స్ పై నెగ్గి సెమీస్ చేరుతామన్న ధీమా వ్యక్తం చేశారు.

ఈ క్వాలిఫయింగ్ టోర్నీలో టాప్-3లో నిలిచిన జట్లు ఆగస్టులో బెల్జియం, నెదర్లాండ్స్‌లలో జరిగే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్స్ 13న... ఫైనల్ 14న జరుగుతాయి.

## స్విస్ ఓపెన్‌పై కిడాంబి శ్రీకాంత్ ఆశలు

**స్విట్జర్లాండ్:** స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో హైదరాబాదీ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ భారీ అంచనాలు ఉన్నాయి. గత ఏడాది రెండు టైటిల్స్‌కు విజయం దూరంలో ఉండిపోయిన శ్రీకాంత్ మరోసారి టైటిల్ వేటకు సిద్ధమయ్యాడు. స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 టోరీల్నో శ్రీకాంత్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ 42వ ర్యాంకర్ జేసన్ గుణవాన్ (హాంకాంగ్)తో శ్రీకాంత్ తలపడతాడు. గత ఏడాది మలేసియా మాస్టర్స్, సయ్యద్ మోడీ టోర్నీల్లో ఫైనల్‌కు చేరి రన్నరప్‌తో సరిపెట్టుకున్న శ్రీకాంత్.. ఈ సీజన్‌లో టైటిల్ నిరీక్షణకు తెరదించాలన్న పట్టుదలతో ఉన్నాడు. శ్రీకాంత్ చివరిసారి 2017లో ఫ్రెంచ్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. శ్రీకాంత్‌తోపాటు స్విస్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, ఆయుశ్ శెట్టి, కిరణ్ జార్జి, తరుణ్ మన్నేపల్లి పోటీపడుతున్నారు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, మాళవిక బన్సోద్ బరిలో ఉన్నారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ... మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దె రుతిక్వ శివాని-రోహన్ కపూర్, తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జోడీ బరిలోకి దిగారు.

## నాలుగో రౌండ్‌లో జొకోవిచ్


టైటిల్ వేటలో దూసుకుపోతున్న సెర్బియా స్టార్

**కాలిఫోర్నియా:** సెర్బియా స్టార్ నోవాక్ జొకోవిచ్ ఇండియన్ వేల్స్ టెన్నిస్ టోర్నీలో నాలుగో రౌండ్‌కు చేరుకున్నాడు. మూడో రౌండ్‌లో 72వ ర్యాంక్ అమెరికా ఆటగాడు అలెగ్జాండర్ కోవాసెవిచ్‌పై విజయం సాధించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో కార్లోస్ అల్కరాజ్ చేతిలో ఓడిన తర్వాత జొకోవిచ్‌కు ఇది తొలి టోర్నీ. ఇక తొమ్మిదేళ్ల తర్వాత తొలిసారి ఇండియన్ వెల్స్ టోర్నీ బరిలోకి దిగిన జొకోవిచ్ తొలి రౌండ్ నుంచి జోరు చూపుతున్నాడు. మూడో రౌండ్ తొలి సెట్‌ను 6-4తో నెగ్గిన జొకోవిచ్‌కు రెండో సెట్‌లో అలెగ్జాండర్ అనూహ్యంగా షాకిచ్చాడు. సెర్బియా సూపర్ స్టార్‌పై ఏకంగా 16 ఏస్‌లు సంధించి రెండో సెట్‌ను 6-1తో గెలుపొంది సమవుజ్జీగా నిలిచాడు. కీలకమైన మూడో సెట్‌లో ఆరంభంలోనూ అలెగ్జాండర్ గట్టి పోటీ ఇచ్చాడు. అయితే పుంజుకున్న జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేస్తూ 6-4తో ముగించి ఊపిరి పీల్చుకున్నాడు. జొకోవిచ్ ఐదుసార్లు ఇండియన్ వెల్స్ టైటిల్స్ నెగ్గి ఫెదరర్‌తో సమానంగా ఉన్నాడు. మిగతా గేమ్‌ల్లో బ్రిటన్‌కు చెందిన కామెరాన్ నోరీ 6-4, 6-4తో ఎనిమిదో ర్యాంక్ ఆస్ట్రేలియా ఆటగాడు అలెక్స్ డి మినౌర్‌ను ఓడించగా, ఆస్ట్రేలియన్ క్వాలిఫైయర్ రింకి హిజికాటా 6-7 (3/7), 7-6 (7/3), 6-3తో ఓడించడంతో పదో సీడ్ అలెగ్జాండర్ బబ్లిక్‌కు షాకిచ్చాడు.

## 12 మిలియన్ డాలర్ల ఐపిఒకు ఎక్సెడ్!

**అహ్మదాబాద్, మార్చి 10:** ఎగ్జిక్యూటివ్ లెర్నింగ్ సొల్యూషన్స్ సంస్థ ఎక్సెడ్ 12 మిలియన్ డాలర్ల ఐపిఒకు రెడీ అవుతోంది. ఈనెల 16వ తేదీనుంచి మార్కెట్లకు రావాలని నిర్ణయించింది. వాస్తవానికి ఈనెల ఆరవ తేదీనే నిర్ణయించినా మధ్యప్రాచ్య ఉద్రిక్తతలతో వాయిదా వేసింది.



గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్‌సిటీ అంటే గిఫ్ట్‌సిటీనుంచి వస్తున్న మొట్టమొదటి ఐపిఒగా చెపుతున్నారు. ఐపిఒలో ఇష్యూధర రూ.10నుంచి రూ.10.5గా నిర్ణయించనున్నారు. బిడ్డింగ్ ఈనెల 24వ తేదీతో ముగుస్తుంది. ఎగ్జిక్యూటివ్‌స్థాయి ఉద్యోగులకు శిక్షణ ఇతర విద్యాపరమైన పరిష్కారాలు అందించడంలో ఈ సంస్థ ముందుంది. సీనియర్ వృత్తినిపుణులు సుమారు 25 దేశాలనుంచి ఎక్సెడ్‌లో శిక్షణకు వస్తుంటారు. వీరంతా మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియా, ఉత్తర అమెరికా దేశాలనుంచి వస్తుంటారని సంస్థ వెల్లడించింది.

## 'బులియన్'కు ట్రంప్ బూస్ట్

### పసిడి రూ.1,62,380.. వెండి కిలో 2.90 లక్షలు

**ముంబయి, మార్చి 10:** బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అమెరికా డాలర్ బలహీనపడటం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలతో ముడి చమురు ధరలు పడిపోవడం వంటివి పసిడికి ఊపునిచ్చాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఏప్రిల్ గోల్డ్ ఫ్యూచర్స్ 1.15 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1, 62,150 వద్ద ట్రేడ్ అయింది. అదే సమయంలో మే సిల్వర్




ఫ్యూచర్స్ 3.68 శాతం లాభపడి కిలోకు రూ.2.77 లక్షలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 5,082.51 డాలర్లకు, స్పాట్ సిల్వర్ 82.50 డాలర్లకు పెరిగాయి. మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో ఉద్రిక్తతలు తగ్గే అవకాశం ఉందని ట్రంప్ వ్యాఖ్యానించడంతో చమురు ధరలు భారీగా తగ్గాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ ఒక దశలో 10.85 శాతం పడిపోయి బ్యారెల్‌కు 88.22 డాలర్ల కనిష్ఠానికి చేరింది. చమురు ధరలు తగ్గితే ద్రవ్యోల్బణ భయాలు తగ్గుతాయని, ఫలితంగా కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచకపోవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఇది వడ్డీ ఆదాయం లేని బంగారానికి మద్దతునిస్తుంది. మరోవైపు డాలర్ ఇండెక్స్ 0.44 శాతం తగ్గి 98.74 వద్దకు చేరడంతో ఇతర కరెన్సీల కొనుగోలుదారులకు బంగారం చౌకగా మారింది. ప్రస్తుతం ఇన్వెస్టర్ల దృష్టి అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై ఉంది. రేపు వెలువడనున్న వినియోగదారుల ధరల సూచీ, శుక్రవారం విడుదలచేసే వ్యక్తిగత వినియోగ వ్యయాల (పీసీఈ) సూచీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 18న జరిగే ఫెడ్ పాలసీ సమావేశంలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచవచ్చని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. 24క్యారెట్ల బంగారందరలు 1,62,380గాను, 22కేరట్ల బంగారం రూ.1,19,080గాను కొనసాగాయి. స్పాట్‌మార్కెట్‌లో కొన్ని చోట్ల వెండి కూడా రూ.2.90 లక్షలమార్కును చేరింది. డాలర్ విలువ 99 కంటే దిగువస్థాయికి పడిపోవడంతో వెండి, పసిడిధరల పెరుగుదలకు కారణం అయింది.




# రెండురోజుల నష్టాలకు బ్రేక్

### లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, మార్చి 10:** రెండు రోజుల వరుస ఈక్విటీ మార్కెట్ల నష్టాలకు బ్రేక్‌పడింది. మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగియవచ్చంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. దీంతో అంతర్జాతీయంగా ఆందోళనలు తగ్గడంతో కొనుగోళ్లకు మద్దతు లభించింది.


ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 639.82 పాయింట్లు పెరిగి 78,205.98 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 233.55పాయింట్లు లాభపడి 24,261.6 వద్ద ముగిసింది. ఇరాన్‌తో వివాదం కారణంగా గత కొన్ని రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. అయితే, ఈ వివాదం త్వరలోనే పరిష్కారమవుతుందని ట్రంప్ సూచించడంతో గ్లోబల్ మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొంది. ఈ పరిణామంతో అంతర్జాతీయ ముడిచమురు ధరలు కూడా దిగిరావడంతో మార్కెట్లకు కలిసొచ్చింది. ఈరోజు ట్రేడింగ్‌లో బెంచ్‌మార్క్ సూచీల కంటే బ్రాడర్ మార్కెట్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.62 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.12 శాతం మేర లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఆటో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి.

నిఫ్టీ ఐటీ సూచీ అమ్మకాల ఒత్తిడికి గురైంది. ఆయిల్ అండ్ గ్యాస్ రంగం కూడా బలహీనంగానే కదలాడింది. టెక్నికల్‌గా నిఫ్టీకి 24,300 వద్ద తక్షణ నిరోధం ఉందని, దానిని దాటితే 24,600 స్థాయికి చేరవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. శ్రీరామ్ ఫైనాన్స్ 8.05శాతం, ఐసిఐసిఐబ్యాంకు 2.69శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.99శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలోమిడ్‌క్యాప్‌సూచీ 1.66శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 2.04శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలో 3103 షేర్లుపెరిగితే 1175 కంపెనీలషేర్లు క్షీణించాయి. 155 కంపెనీలషేర్లుస్థిరంగా కొనసాగాయి. బ్రెంట్‌ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్లు 6.87డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 92.09 డాలర్లుగాకొనసాగింది. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 91.87వద్ద కొనసాగాయి. అంతకుముందురోజు 92.35గా కొనసాగిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ సెటిల్‌మెంట్లు రూ.1,61,700గా కొనసాగాయి. ఇక ఐపిఒలపరంగా ఇన్నోవిజన్ 1,21,635 షేర్లకుబిడ్లు అందాయి. మొత్తం 61,32,433 షేర్లను ఆఫర్‌కు కేటాయించింది. రాజపుతానా స్టెయిన్‌లెస్ కూడా 2.09 కోట్ల వాటాలకుగాను 88,08,580 షేర్లకు బిడ్లు అందాయి. ఇష్యూ 9వన ప్రారంభించింది. 11 మార్చితోముగుస్తుంది.

ఐపిఒ ఇష్యూధర రూ.116 నుంచి 122గా నిర్ణయించింది. ఇక షేర్లపరంగా హ్యాపియస్ట్ మైండ్స్ టెక్నాలజీస్ 17.85వాతం, మహీంద్ర అండ్ మహీంద్ర 3.67శాతం, జెఎస్‌డబ్ల్యు స్టీల్ 1.83శాతం, ఎబిబి ఇండియా 4.08శాతం, బిఎండబ్ల్యు వెంచర్స్ 3.71శాతం, అరవింద్ స్మార్ట్ స్పేసెస్ 3.77శాతం, బోరోసిల్ 12.03వాతం, హిందూజా గ్లోబల్ సొల్యూషన్స్ 0.05శాతం, సోలెక్స్ ఎ నర్జీ 4.66 శాతం, జగ్‌సోన్‌పాల్ ఫార్మా 4.24శాతం, ఓపిటమస్ ఇన్‌ఫ్రాకామ్ 3.08 శాతం, మిండా కార్పొరేషన్ 1.64శాతం, ఇంటరార్చ్ బిల్డింగ్ సొల్యూషన్స్ 5.13 శాతం, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ సంస్థ కూడా షేర్లు 5.22 శాతం చొప్పున పెరిగాయి.

## మ్యూచువల్‌ఫండ్స్‌కు రూ.26 వేల కోట్ల పెట్టుబడులు!

**ముంబయి, మార్చి 10:** మూచువల్‌ఫండ్స్ రంగంలో గతనెలలో మొత్తం నికరంగా రూ.25,977.81 కోట్ల పెట్టుబడులు అందాయి. అదే గత జనవరిలో 24,028.59 కోట్లవరకూ ఫండ్స్ నిర్వహణాస్తులు ఉన్నట్లు ఫండ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంఫీప్రకటించింది. మొత్తంగా ఫిబ్రవరిలో ఫండ్స్ రంగానికి రూ.94,530 కోట్లు నిధులు వచ్చాయి. అయితే జనవరిలో మాత్రం ఏకంగా రూ.1.56 లక్షలకోట్లు రావడం విశేషం. ఈక్విటీ కేటగిరీల్లో భారీగా పెరిగాయి. ఫ్లెక్సీక్యాప్‌ఫండ్స్‌కు ఎక్కువ పెట్టుబడులు వచ్చిట్లు ఆంఫీ డేటా చెపుతోంది. భారీక్యాప్‌ఫండ్స్ రూ.2111.68 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అదే జనవరిలో రూ.2,004.98 కోట్లు మాత్రమే అందాయి. మిడ్‌క్యాప్ కేటగిరీలో జనవరిలో వచ్చిన రూ.3185.47 కోట్లనుంచి ఫిబ్రవరిలో రూ.4,002.99 కోట్లకు పెరిగాయి. ఇక స్మాల్‌క్యాప్ కేటగిరీలో జనవరిలో రూ2942.11 కోట్లు రాగా ఫిబ్రవరిలో 3881.06 కోట్లవరకూ నిధులు అందాయి. ఫ్లెక్సీక్యాప్‌ఫండ్స్‌లో రూ.6924.65 కోట్లవరకూ నిధులున్నాయి. జనవరినెలలో అయితే రూ.7672.36 కోట్లురాగా ఫిబ్రవరిలో తగ్గాయి. వివిధ విభాగాలవారీగా వచిచన ఫండ్స్ రూ.1042.56 కోట్లనుంచి రూ.2987.29 కోట్లకు పెరిగాయి. డెట్‌ఫండ్స్‌లలోకి జనవరికంటే ఫిబ్రవరిలో తగ్గాయి. 74,827.13కోట్లనుంచి చూస్తే రూ.42,106.31కోట్లు ఫండ్స్ పెట్టుబడులున్నాయి. హైబ్రిడ్‌స్కీమ్స్‌లో రూ.11,983.37 కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. మధ్యవర్తిత్వరంగంలో ఫండ్స్ రూ.591.85కోట్లుగా ఉన్నాయి. ఇక గోల్డ్ ఇటిఎఫ్‌లు రూ.5254.95 కోట్లవరకూ పెట్టుబడులు వచ్చాయి.




## డాలరుతో రూపాయి రూ.91.85

**న్యూఢిల్లీ, మార్చి 10:** డాలరుతోరూపాయి మారకం విలువలు కొంతపెరిగాయి భారత్ రూపాయి 36 పైసలు లాభపడి మంగళవారం కరెన్సీ ట్రేడింగ్ ముగిసేనాటికి 91.85గా కొనసాగింది. ముడిచమురు ధరల్లో అంతర్జాతీ యంగా కొంతమేర తగ్గడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే విధంగా ట్రంప్ సంకేతాలు ఇవ్వడం కూడా రూపాయి బలపడేందుకు దోహదంచేసాయి.

ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజిలో భారత్ రూపాయి మారకం ట్రేడింగ్ 91.92వద్ద ప్రారంభం అయింది. ఒకదశలో 91.71 నుంచి 92.19వరకూ ట్రేడ్ అయి చివరకు 36 పైసలు లాభపడి 91.85వద్ద స్థిరపడింది. సోమవారం భారత్‌రూపాయి 92.21వరకూ క్షీణించింది. ఒక్కరోజే 39 పైసలు క్షీణించింది. రానున్న రోజుల్లో 91.60 నుంచి 92.20మధ్య కొనసాగవచ్చని అంచనావేసారు.

## కనీస నిల్వలరూపంలో బ్యాంకులు రూ.19 వేల కోట్లు వసూలు




**న్యూఢిల్లీ, మార్చి 10:** బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వలు (మినిమం బ్యాలెన్స్) లేని కారణంగా గడిచిన మూడేళ్లలో ప్రైవేటు రంగ బ్యాంకులు ఖాతాదారుల నుంచి రూ.11 వేల కోట్లు వసూలు చేసినట్లు కేంద్రం పార్లమెంటుకు వెల్లడించింది. ఇదే కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.8 వేల కోట్లు వసూలుచేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రైవేటు రంగ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ అత్యధికంగా రూ.3,800 కోట్లు కనీస నిల్వల నిబంధన పేరుతో ఖాతాదారుల నుంచి వసూలు చేసినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంకు రూ.2,700 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంకు రూ.1,200 కోట్ల చొప్పున వసూలు చేశాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంకు అత్యధికంగా రూ.1,500 కోట్లు వసూలు చేయగా, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1,200 కోట్లు, ఇండియన్ బ్యాంకు రూ.1,100 కోట్ల చొప్పున వసూలు చేసినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. కాగా, కనీస నిల్వలపై ఎస్బీఐ 2020 మార్చి నుంచి ఛార్జీలు వసూలు చేయడం లేదు. గత ఏడాది నుంచి పంజాబ్ నేషనల్ బ్యాంకు, కెనరా బ్యాంకు కూడా ఈ ఛార్జీలను తొలగించాయి. అలాగే దేశంలో రూ.10, రూ.20, రూ.50 వంటి తక్కువ విలువ కలిగిన కరెన్సీ నోట్లకు ఎలాంటి కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నోట్లు చలామణిలో సరిపడా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ఈ వివరాలను వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నివేదిక ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో 439.40 కోట్ల పది రూపాయల నోట్లు, 193.70 కోట్ల ఇరవై రూపాయల నోట్లు, 130.30 కోట్ల యాభై రూపాయల నోట్లను సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. సాధారణంగా ఏటీఎంల ద్వారా చిన్న డినామినేషన్ నోట్లను పంపిణీ చేయరని, వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు స్మాల్ వాల్యూ డిస్పెన్సర్ల ద్వారా పంపిణీ చేసే ఒక పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు సభకు తెలియజేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా ఆర్బీఐ ఎప్పటికప్పుడు వివిధ నోట్ల అవసరాన్ని అంచనా వేస్తుందని పంకజ్ చౌధరి వివరించారు. నోట్లు, నాణేలతో పాటు డిజిటల్ చెల్లింపుల ద్వారా కూడా తక్కువ విలువ లావాదేవీల అవసరాలు తీరుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.